
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 23-05-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

అదానీ కోల్ స్కాం

- తక్కువ గ్రేడ్ సరఫరాతో మోసం
- ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు నష్టం

న్యూఢిల్లీ : ప్రధానీ మోడీకి ఆప్తమిత్రుడిగా గుర్తింపు పొందిన కుబేరుడు గౌతం అదానీ బొగ్గు కుంభకోణానికి పాల్పడుతున్నారు. తక్కువ గ్రేడ్ బొగ్గును అధిక విలువగా చూపిస్తూ విక్రయిస్తున్నారని ఫైనాన్సియల్ టైమ్స్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. నాసిరకం బొగ్గుతో ప్రభుత్వ రంగ ...13లో



సంపుటి : 10 | సంచిక : 143 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



దర్శనం అనంతరం ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

ఏపీతో సత్సంబంధాలు

ఏ ప్రభుత్వం వచ్చినా కొనసాగిస్తాం

- ఉమ్మడిగా సమస్యలు పరిష్కరించుకుంటాం : సీఎం రేవంత్‌రెడ్డి

తిరుమల : ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడే ప్రభుత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శ్రీవారికి తన మనువడి పుట్టువెంట్రుకల మొక్కును చెల్లించుకున్నారు. దర్శనానంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏపీలో ఏర్పడే ప్రభుత్వంతో కలిసి సమస్యలు పరిష్కరించుకుని కలిసికట్టుగా నడుస్తామన్నారు. రెండు రాష్ట్రాల అభివద్ధికి ఒకరికొకరు సహకరించుకోవాలని ఆకాంక్షిం చారు. తిరుమలలో తెలంగాణ ప్రభుత్వం తరఫున సత్రం, కళ్యాణ మండపం నిర్మిస్తామని ప్రకటించారు. శ్రీవారి సేవలో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యం కూడా తీసుకోవాలని ఏపీ సీఎంకు విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. స్వామి వారి ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

జూన్ 2 వేడుకలకు కేసీఆర్‌కు ఆహ్వానం

రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయం

- మాజీ సీఎం వస్తారో... లేదో అని చర్చ
- అదే వేడుకలకు ముఖ్య అతిథిగా సోనియాగాంధీ

వివరాలు 6లో



అబద్ధాలకు అంతేలేదు

ఉద్యోగ కల్పనపై మోడీ కహానీలు

- యువతకు అనేక అవకాశాలు కల్పించామని ప్రచారం
- 8 శాతానికి నిరుద్యోగ రేటు
- ఖాళీల భర్తీపై ఆసక్తి చూపని ప్రభుత్వం

ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 20న పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ నిరుద్యోగ సమస్యను ప్రస్తావించారు. 'గత ప్రభుత్వాలతో పోలిస్తే మా ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించింది. అది మా ట్రాక్ రికార్డ్' అని ఆయన చెప్పుకున్నారు. అయితే లోక్‌నీతి- సీఎస్‌డీఎస్ ఇటీవల జరిపిన సర్వే సందర్భంగా అనేక మంది నిరుద్యోగం, ధరల పెరుగుదలపై తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశారు. 'గత ఐదు సంవత్సరాలతో పోలిస్తే ఇవాళ ఉద్యోగాలు పొందడం సులభమని మీరు భావిస్తున్నారా? కష్టమని అనుకుంటున్నారా?' అని అడిగిన ప్రశ్నకు ఇప్పుడు ఉద్యోగాలు సంపాదించడం కష్టంగా ఉన్నదని 62 శాతం మంది స్పష్టం చేశారు.



న్యూఢిల్లీ : దేశంలో ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే ధ్రువీకరిస్తున్నాయి.తాజాగా సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) సంస్థ నివేదిక ప్రకారం 2023-24లో 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో నిరుద్యోగ రేటు 8 శాతంగా ఉంది. అంతకుముందు రెండు సంవత్సరాల్లో ఈ రేటు 7.5-7.7 శాతం మధ్య నమోదైంది. ఉద్యోగాల కోసం వెతుకుతున్న నిరుద్యోగుల సంఖ్య 3.7 కోట్లకు చేరింది. గత ఏడు సంవత్సరాల్లో నిరుద్యోగ రేటు 8 శాతానికి పైగానే నమోదవుతోంది. 15-64 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో పనిచేస్తున్న కార్మికుల రేటు (ఎల్‌పీఆర్) 2016-17లో 46.2 శాతంగా ఉండేది. అయితే ఆ తర్వాతి మూడు సంవత్సరాల్లో ఈ రేటు 42-44 శాతానికి పడిపోయింది. 2020-21లో ఇది మరింత తగ్గి 40 శాతానికి చేరింది. అప్పటి నుండి ఈ రేటు తగ్గుతూనే ఉంది. 2023-24లో 40.4 శాతంగా ఉన్న ఎల్‌పీఆర్ రేటు 2016-17తో పోలిస్తే 5.8 పర్సంటేజ్ పాయింట్లు తగ్గింది. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే దేశంలో నిరుద్యోగ రేటు పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు.

పొరుగు దేశాలతో పోలిస్తే...

ఇక యువతలో నిరుద్యోగ రేటు విషయానికి వస్తే అది దక్షిణాసియాలోని పొరుగు దేశాల్లో కంటే అధికంగా ఉంది. 2022లో విడుదలైన ప్రపంచబ్యాంక్ నివేదిక ప్రకారం మన దేశంలోని యువతలో నిరుద్యోగ రేటు 23.22 శాతంగా నమోదైంది. ఇది పాకిస్తాన్ (11.3 శాతం), బంగ్లాదేశ్ (12.9 శాతం), భూటాన్ (14.4 శాతం) దేశాల్లో రేటు కంటే చాలా ఎక్కువ. అదే సంవత్సరం చైనాలో నిరుద్యోగ రేటు 13.2 శాతంగా ఉంది.

45 సంవత్సరాల గరిష్ట స్థాయికి...

2019లో దేశంలో నిరుద్యోగం 45 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరుకుంది. అయితే ఈ వాస్తవాన్ని మోడీ ప్రభుత్వం బయటికి పొక్కనివ్వలేదు. ప్రభుత్వ చర్యను నిరసిస్తూ ఇద్దరు అధికారులు రాజీనామా కూడా చేశారు. కార్మిక మంత్రిత్వ శాఖ 2019లో విడుదల చేసిన వివరాల ప్రకారం 2017-18లో నిరుద్యోగ రేటు 6.1శాతంగా ఉంది. ప్రభుత్వం ఎంతగా తొక్కిపట్టినప్పటికీ 2017 జూలై-2018 జూన్ కాలానికి సంబంధించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) నివేదిక బయటికి వచ్చింది. నిరుద్యోగం భయానక స్థాయికి చేరిందని, గత 45 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత గా నిరుద్యోగం పెరిగిందని ఆ నివేదిక బయటపెట్టింది.

యువతే అధికం

నిరుద్యోగుల్లో యువతే అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. 2022లో ...13లో

రికార్డు స్థాయిలో ఖాళీలు ...

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీల సంఖ్య రికార్డు స్థాయికి చేరింది. వాటిని భర్తీ చేయకపోగా అకస్మాత్తుగా రద్దు చేస్తున్నారు. సురక్షితమైన, గౌరవనీయమైన ఉపాధిని కల్పిస్తున్న సాయుధ దళాల్లో అగ్నివీర్ పేరిట నాలుగు సంవత్సరాల కాంట్రాక్ట్ సైనిక పథకాన్ని తీసుకొచ్చారు. ఈ అంశాన్ని ప్రధాని మోడీ తన ఎన్నికల ప్రచారంలో ఎక్కడా ప్రస్తావించడం లేదు. అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని రద్దు చేస్తామని ప్రతిపక్షాలు హామీ ఇచ్చాయి. ఉద్యోగ నియామకాల కోసం నిర్వహించే పరీక్షల్లో అనేక అవకతవకలు జరగడం యువతలో ఆగ్రహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా పరీక్షా పత్రాలు లీక్ అవడం పరిపాటిగా మారింది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వమే లోక్‌సభలో అంగీకరించింది. ఇదిలావుంటే ఐటీ రంగంలో ఉద్యోగాల్లో భారీ కోత పడుతోంది. నియామకాల సంస్థ ఫౌండిట్ తెలిపిన వివరాల ప్రకారం హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఐటీ కోసం ఆన్‌లైన్ నియామక కార్యకలాపాలు గత సంవత్సరం 18 శాతం మేర తగ్గిపోయాయి.

ఇకపై టీజీఎస్‌ఆర్టీసీ


పేరు మార్చిన యాజమాన్యం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
టీఎస్ఆర్టీసీ పేరు టీజీఎస్ఆర్టీసీగా మారింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రప్రభుత్వం టీఎస్ స్థానంలో టీజీగా మారుస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీని ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంస్థల పేర్లను 'టీజీ' గా మార్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు ఇప్పటికే రాష్ట్రంలోని జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలు తమ పేర్లకు ముందు టీఎస్‌ను తొలగించి, టీజీగా మార్చాయి. తాజాగా టీఎస్‌ఆర్టీసీని టీజీఎస్‌ఆర్టీసీగా మారుస్తున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ఆ మేరకు అధికారిక 'ఎక్స్' ఖాతాల ...6లో

ఓబీసీ సర్టిఫికెట్లు చెల్లవు

- 2010 తర్వాత జారీ అయిన వాటిపై కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు



కోల్‌కతా: కలకత్తా హైకోర్టు బుధవారం సంచలన తీర్పును వెలువరించింది. 2010 తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అన్ని ఓబీసీ ధ్రువపత్రాలను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ తీర్పుతో గట్టి ఎదురుదెబ్బే తగిలింది. ఇటీవల ఉపాధ్యాయ ...6లో

ఆరు గ్యారంటీల పేరిట కాంగ్రెస్ మోసం

- పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వంలో రెండు లక్షల ఉద్యోగాలు
- ఐదు నెలల్లో ఒక్క నోటిఫికేషన్ ఇచ్చింది లేదు
- పట్టభద్రులు సమాజానికి దిశ దశగా నిలిచి రాకేష్‌రెడ్డికి ఓటేయండి : ఎమ్మెల్యే కేటీఆర్

వివరాలు 13లో



వర్షాలకు ముందే మేడిగడ్డకు మరమ్మతులు

కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద జియో ట్యూబ్ వాల్ బ్యారేజీలను పరిశీలించిన సాంకేతిక నిపుణులు



నవతెలంగాణ-భూపాలపల్లి
రాబోయే వర్షాకాలానికి ముందే ప్రాణహిత నీటిని వృధాగా పోనీయకుండా ఎత్తిపోయ డానికి వీలుగా బ్యారేజీల రక్షణా చర్యలను చేపట్టి 15 రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలను పరిశీలించింది. పూణే నుంచి సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంట్రల్ సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు చెందిన నిపుణులు బుధవారం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్ విభాగానికి చెందిన శాస్త్రవేత్త జేఎస్ ఎడ్లబడ్కర్, జియోఫిజికల్ ఇన్వెస్టిగేషన్ శాస్త్రవేత్త డాక్టర్ సి. ధనుంజయ నాయుడు, నాన్ డిస్ట్రక్టివ్ టెస్ట్స్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రకాశ్ పాలే.. ఏడవ బ్లాక్‌లో కుంగిన ...13లో

జూన్ 6 నుంచి మేడిగడ్డపై విచారణ

- ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగా నోటీసులు
- వీడియో క్లిప్పింగుల సేకరణ
- ఇంజినీర్లతో ఈఎన్సీ జనరల్ భేటీ
- రాహుల్ బొజ్జా లేఖపై చర్చ

వివరాలు 13లో

ఆరో దశలో ఎవరికి మొగ్గు?

నేటితో ముగియనున్న ప్రచారం.. 25న పోలింగ్

- ఏడు రాష్ట్రాల్లో 58 లోక్‌సభ స్థానాలకు
- 889 మంది అభ్యర్థులు

వివరాలు 6లో


ఏడో దశలో 908 మంది అభ్యర్థులు

ఎనిమిది రాష్ట్రాలు, 57 స్థానాలు 6లో..

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు

పెన్నా అనంతరామశర్మ కన్నుమూత

సీపీఐ(ఎం) రాష్ట్రకమిటీ సంతాపం



(ఫైల్)



నవతెలంగాణ -నల్లగొండటౌన్
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పెన్నా అనంతరామశర్మ(90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి 9గంటలకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మరణించారు. కట్టంగూర్ మండలం పిట్టంపల్లి గ్రామానికి గ్రామానికి చెందిన అనంతరామ శర్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారు. కార్మిక నాయకునిగా, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యునిగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేశారు. జిల్లాలో పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. అనారోగ్య పరిస్థితుల్లో కూడా ఆయన ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. అనంతరామశర్మ మృతిపట్ల సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం ప్రకటించిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, డబ్బికారు మల్లేశ్, నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, సయ్యద్ హాషం చిన్నపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి, నాయకులు దండెపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి ఉన్నారు. బయటి దేశంలో ఉన్న చిన్న కుమారుడు వచ్చాక అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబీకులు తెలిపారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపం


తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పెన్నా అనంతరామ శర్మ మృతికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. బుధవారం ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ...6లో

బొబ్బలొస్తున్నాయి..!

కొలతలు పెంచిండ్రు.. కూలి పెరగలేదు

'చేతులు బొబ్బలొచ్చేలా పనిచేసినా ఫలితం లేదు. పొట్టకూటి కోసం దినమంతా రెక్కలుముక్కలు చేసుకుని పనిచేస్తున్నా కూలి గిట్టడం లేదు. పని భారం రెండింతలు పెరిగినా వేతనం మాత్రం రూ.150 దాటడం లేదు. మండుటెండలో గుక్కెడు నీళ్లు తాగుతూ చెమటోడ్చినా ఈ పాలకులకు కనికరం లేకపాయే. పని ప్రదేశంలో తాగునీరు లేక గొంతెండి సొమ్మసిల్లినా పట్టించుకునే దిక్కులేదు. మా గోస చెబితే వినే దిక్కెవరు. మా బతుకుల గురించి ఆలోచించేదెవరు' ఇది ఉపాధి కూలీల ఆవేదన.

- దినమంతా చేస్తే రూ.150 దాటుతలే..!
- తాగునీటికి గోస తీస్తున్నాం
- మా బాధలు చెబితే వినే దిక్కెవరు..?
- ఉపాధి హామీ కూలీల ఆవేదన



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,771 గ్రామ పంచాయతీల్లో 53.17లక్షల జాబ్‌కార్డులు జారీ కాగా, వాటి ద్వారా కోటీ 20 లక్షల మంది కూలీలు ఉపాధి హామీకి నమోదు చేసుకున్నారు. కాగా, వాటిలో.. 34.13లక్షల జాబ్‌కార్డులు, 58.22లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సాగునీటి అవకాశాలు తక్కువగా ఉండటంతో వ్యవసాయ కార్మికులు ఎక్కువగా ఉపాధి హామీపై ఆధారపడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో జాబ్ కార్డులు 1,61,889 ఉండగా.. ఇందులో 2,68,156 మంది కూలీలు ఉన్నారు. ఇందులో రెగ్యులర్‌గా 96,728 కుటుంబాలు ఉపాధి పనులను ఉపయోగించుకుంటున్నాయి. 1,48,887 మంది కార్మికులు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ప్రతి రోజూ 30 నుంచి 40 వేల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మే 13 వరకూ జిల్లాలో 55,452 మంది కార్మికులకుగాను ...6లో

రిజర్వేషన్లు పూర్తయ్యాకే 'స్థానిక' ఎన్నికలు

- కాంగ్రెస్ నేతల మెలిక
- ఎస్సీ, ఎస్టీ, బీసీల మేలు కోసమేనంటూ ఒత్తిడి
- డైలామాలో సర్కారు
- సీఎంకు లేఖ రాసిన వీహెచ్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు పూర్తయ్యాకే ఎన్నికలు నిర్వహించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ శ్రేణులు మెలిక పెడుతున్నాయి. తద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు మేలు జరుగుతుందని చెబుతున్నాయి. ప్రధానంగా కులగణన వెంటనే ప్రారంభించాలనిఆ పార్టీ నేతలు కోరుతున్నారు. ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌ను వారు తెరపైకి తెస్తున్నారు. ఇదే అంశంపై మాజీ ఎంపీ వి. హనుమంతరావు కూడా స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు చాలా అవసరమంటూ ఆయన పేర్కొన్నారు. కులాల వారీగా సర్వే చేస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీల లెక్కలు తేలుతాయని, ఆయా వర్గాలకు మేలు జరుగుతుందని వివరించారు. కేవలం నాలుగు నెలల్లోనే కుల గణన పూర్తి చేయొచ్చని వీహెచ్ స్పష్టం చేశారు. ఈ సర్వేను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేస్తే పార్టీకి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఆయా వర్గాలకు దక్కాల్సిన వాటాలు దక్కుతాయని తెలిపారు. అగ్రనేత రాహుల్ గాంధీ లక్ష్యం కూడా జనాభా గణన నిర్వహించి రిజర్వేషన్లు పెంచాలన్నదే అని పేర్కొన్నారు. దేశంలోని మూడు కాంగ్రెస్ ప్రభుత్వాల్లో కులాల వారీగా సర్వే నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు తగిన స్థాయిలో సీట్లు రాలేదనీ, స్థానిక సంస్థల్లోనైనా పెద్దపీట వేయాల్సిందిగా పలువురు నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోయినా, ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా కాంగ్రెస్‌కు సంపూర్ణంగా మద్దతు ఇవ్వడంతోపాటు అండగా నిలబడ్డారని వారు గుర్తు చేశారు.

ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లోనూ ఈ వర్గాలన్నీ కాంగ్రెస్ కోసం పని చేశాయన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల్లో తగిన స్థాయిలో ప్రాధాన్యత ఇస్తేనే, పార్టీకి మేలు జరుగుతుందని మరో నేత తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను కాస్త ఆలస్యంగానైనా రిజర్వేషన్లు పూర్తి చేసిన వెంటనే పెడితే బాగుటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ప్రభుత్వం ఈ విషయంలో ఏం నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉత్కంఠ నెలకొన్నది. ప్రస్తుతం కొనసాగుతున్న స్థానిక రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలను నిర్వహిస్తారా? లేదా అందులో మార్పులు, చేర్పులు చేస్తారా? అనే దానిపై పార్టీలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతున్నది.

25 నుంచి విద్యుత్ కార్మికుల పోరాటాలు

- టీఎస్‌యూఈఈయూ రాష్ట్ర కమిటీ పిలుపు

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25 నుంచి జూన్ 10వతేదీ వరకు పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్టు తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌యూఈఈయూ) రాష్ట్ర కమిటీ ప్రకటించింది. రెండ్రోజులపాటు జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో విద్యుత్ కార్మికుల సమస్యలపై చర్చించినట్టు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే ఈశ్వరరావు, వీ గోవర్ధన్ తెలిపారు. గత ప్రభుత్వం తరహాలోనే ప్రస్తుత ప్రభుత్వం కూడా సమస్యల పరిష్కారంలో మొండివైఖరి అవలంబిస్తున్నదని వారు విమర్శించారు. కార్మికులకు రావాల్సిన డీఏ, ఆర్టిజన్స్ కన్వర్షన్, బిల్ కలెక్టర్లు, అన్‌మెన్ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, మీటర్ రీడర్ల సమస్యల్లో ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. అర్హత కలిగిన ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వట్లేదని తెలిపారు. రాష్ట్రంలో 1.80 కోట్ల సర్వీసులు ఉంటే, ఇంజినీర్లు, ప్రొవిజన్స్ సిబ్బందితో కలిపి కేవలం 53వేల మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారనీ, సిబ్బంది కొరతతో పనిభారాలు పెరుగుతున్నాయని వివరించారు. ఒక్క నిముషం కరెంటు పోవద్దంటూ ఆపరేషన్ మెయింటెనెన్స్ సిబ్బందిని వేధిస్తున్నారనీ, బ్రేక్‌డౌన్స్ సందర్భాల్లో ఎల్సీలు ఇవ్వకుండా పనిచేయాలని చెప్పి, సిబ్బంది ప్రాణాలతో చెలగాటం



ఆడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆఫీసుల్లో పనిచేయాల్సిన అకౌంట్ ఆఫీసర్లు, జూనియర్ అక్కౌంట్స్ సహా అందరికీ సబ్‌స్టేషన్లలో డ్యూటీలు వేయడం ఏంటని ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వంపై విద్యుత్ ఉద్యోగులు అనేక ఆశలు పెట్టుకున్నారనీ, వారి సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చూపాలని విజ్ఞప్తి చేశారు. పలు సమస్యల పరిష్కారం కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రాన్స్‌కో సీఎమ్‌డీని వినతిపత్రం ఇచ్చామనీ, దానిపై ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. అందువల్ల ఈనెల 25వ తేదీన డివిజనల్ ఇంజినీర్లకు, 28న సూపరిటెండెంట్ ఇంజినీర్లకు, జూన్ 10న డిస్కంల సీఎమ్‌డీలకు వినతిపత్రాలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. అప్పటికీ యాజమాన్యాలు స్పందించకుంటే జూన్ 10 తర్వాత జరిగే పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చింది.

రేపు పాలిసెట్ రాతపరీక్ష

- 92,808 మంది దరఖాస్తు
- 259 పరీక్షా కేంద్రాల ఏర్పాటు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్–2024 రాతపరీక్ష శుక్రవారం జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) కార్యదర్శి, పాలిసెట్ కన్వీనర్ పుల్లయ్య బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ పరీక్షను రాష్ట్రంలోని 259 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఎంపీసీ నుంచి 56,764 మంది, బైపీసీ నుంచి 36,044 మంది కలిపి 92,808 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. విద్యార్థులను గంట ముందునుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. హాల్‌టికెట్‌తోపా4టు హెచ్‌బీ పెన్సిల్, ఎరేసర్, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను తప్పక తీసుకుని రావాలని సూచించారు. హాల్‌టికెట్ మీద ఫొటో ముద్రించని వారు పాస్‌పోర్టు సైజ్ ఫొటోతోపాటు ఆధార్ కార్డు (గుర్తింపు కార్డు) వెంటను తెచ్చుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమని పేర్కొన్నారు.

సామాన్యుడికి ఊరటేది?

- చమురు ధరలు తగ్గినా ఆమ్‌ఆద్మీకి ఒరిగిందేమీ లేదు
- లాభాలు దండుకుంటున్న ఆయిల్ కంపెనీలు

డివిడెండ్ల రూపంలో ప్రభుత్వానికి కాసుల పంట



న్యూఢిల్లీ : మార్చి 31తో అంతమైన 2023-24 ఆర్థిక సంవత్సరంలో చమురు కంపెనీల లాభాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినప్పటికీ మన ఆయిల్ కంపెనీలు మాత్రం సంవత్సరం పొడవునా ఇంధన ధరలను తగ్గించనే లేదు. చమురు కంపెనీలకు లాభాల పంట పండడానికి ఇదే కారణం. మరో మాటలో చెప్పాలంటే చమురు మార్కెటింగ్ కంపెనీలు తమ లాభాలను పెంచుకుంటుంటే సామాన్య ప్రజలకు మాత్రం ఎలాంటి ఊరట లభించలేదు. డివిడెండ్లు చెల్లిస్తామని చమురు కంపెనీలు హామీ ఇవ్వడంతో ప్రభుత్వం కూడా లాభపడుతోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో డివిడెండ్ల రూపంలో ప్రభుత్వానికి సమకూరిన ఆదాయంతో పోలిస్తే గత సంవత్సరం వచ్చిన ఆదాయం అనేక రెట్లు అధికంగా ఉంది.

ప్రభుత్వ రంగంలోని చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) 2023-24లో రూ.80,986 కోట్ల లాభాన్ని మూటకట్టుకున్నాయి. 2022-23లో ఆ కంపెనీలు ఆర్జించిన లాభంతో పోలిస్తే ఇది నాలుగు రెట్ల కంటే ఎక్కువే. ఐఓసీఎల్, బీపీసీఎల్‌ను ప్రభుత్వమే నేరుగా నిర్వహిస్తోంది. హెచ్‌పీసీఎల్ మాత్రం మరో ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి అనుబంధంగా ఉంది.

సర్కారుకు డివిడెండ్లు

చమురు మార్కెట్ కంపెనీలు తాము ఆర్జించిన లాభాల్లో కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ ఇస్తామని హామీ ఇవ్వడంతో సర్కారు కూడా ప్రయోజనం పొందింది. 2022-23లో ప్రభుత్వానికి ఐఓసీఎల్ నుండి రూ.2,182 కోట్ల డివిడెండ్ అందగా 2023-24లో రూ.8,727 కోట్లు అందింది. అదే సమయంలో బీపీసీఎల్ నుండి పొందిన డివిడెండ్ రూ.460 కోట్ల నుండి రూ.2,413 కోట్లకు పెరిగింది. హెచ్‌పీసీఎల్ నుండి రూ.1,635 కోట్ల డివిడెండ్ వచ్చింది.

ఆయిల్ కంపెనీల లాభాలు ఇవే

ఐఓసీఎల్ 2021-22లో రూ.24,184 కోట్లు, 2022-23లో రూ.8,242 కోట్లు, 2023-24లో రూ.39,619 కోట్ల లాభాలు పొందింది. బీపీసీఎల్ 2021-22లో రూ.8,789 కోట్లు, 2022-23లో రూ.1,870 కోట్లు, 2023-24లో రూ.26,874 కోట్ల లాభాలు ఆర్జించింది. హెచ్‌పీసీఎల్ 2021-22లో రూ.39,335 కోట్లు, 2022-23లో రూ.19,086 కోట్లు, 2023-24లో రూ.80,986 కోట్ల లాభాలు సంపాదించింది.

చమురు కంపెనీలు ఏం చేస్తాయి?

చమురు మార్కెటింగ్ కంపెనీలు చేసే ప్రధానమైన పనులు ఏమిటంటే ముడి చమురును కొనుగోలు చేయడం, దానిని పెట్రోల్, డీజిల్, నాఫ్తా, లూబ్రికెంట్లు వంటి పెట్రోలియం ఉత్పత్తులుగా ప్రాసెస్ చేయడం, ఆ తర్వాత వాటిని మార్కెట్‌లో విక్రయించడం. చమురు మార్కెటింగ్ కంపెనీల లాభాలను ముఖ్యంగా రెండు అంశాలు ప్రభావితం చేస్తాయి. ఒకటి చమురు ధరలు. రెండు పెట్రోలియం ఉత్పత్తుల అమ్మకం ధరలు.

తొలుత వినియోగదారులకు ఊరట

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత అంటే 2022 జూన్‌లో బ్యారల్ చమురును 116 డాలర్ల గరిష్ట ధరకు భారత్ కొనుగోలు చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ జరిపిన తర్వాత మన దేశంలో కొన్ని నెలల పాటు పెట్రోల్, డీజిల్ ధరలు భగ్గుమన్నాయి. లీటరు పెట్రోలు ధర రూ.110కి చేరింది. 2022 ఏప్రిల్‌లో ఈ ధర సగటున రూ.105 పలికింది. దీంతో రోజువారీ ధరల సమీక్షను నిలిపివేయాలని చమురు కంపెనీలు నిర్ణయించాయి. రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధరను రూ.96.7, డీజిల్ ధరను రూ.89.62గా ఫ్రీజ్ చేశాయి. దీంతో అధిక చమురు ధరల నుంచి వినియోగదారులకు ఊరట లభించింది. 2022 మార్చి-ఆగస్ట్ నెలల మధ్య కూడా బ్యారల్ చమురు ధర 100 డాలర్లకు పైనే నడిచింది. అయితే వినియోగదారులకు రక్షణ ఉచితంగా ఏమీ లభించలేదు. అది చమురు మార్కెటింగ్ కంపెనీల లాభదాయకతపై గణనీయమైన ప్రతికూల ప్రభావం చూపింది. అవి అధిక ధరకు చమురును కొనుగోలు చేసినప్పటికీ ఆ భారాన్ని వినియోగదారులపై మోపకుండా తామే భరించాయి.

లాభాల బాట పట్టినా...

2022 ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో అంటే రెండు త్రైమాసికాలలో చమురు కంపెనీలు నష్టాలు చవిచూసినప్పటికీ ఆ తర్వాత లాభాల బాట పట్టాయి. వాస్తవానికి 2022-23లో మూడు చమురు కంపెనీలు రూ.19,086 కోట్ల లాభం పొందాయి. ఆయిల్ కంపెనీలు త్వరితగతిన కోలుకోవడానికి ప్రధాన కారణమేమంటే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పడిపోవడం మొదలైంది. 2023 జూన్ నాటికి చమురు ధరలు అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 35 శాతం మేర తగ్గాయి. కానీ ఈ ప్రయోజనాలేవీ వినియోగదారులకు దక్కలేదు. ఇంధన ధరల్లో ఎలాంటి మార్పులు రాలేదు. హమాస్-ఇజ్రాయిల్ ఘర్షణ నేపథ్యంలో అప్పటి నుంచి చమురు ధరలు కొద్దో గొప్పో పెరుగుతూనే ఉన్నాయి. కానీ గరిష్ట స్థాయికి (116 డాలర్లు) చేరినప్పటి బ్యారల్ చమురు ధరతో పోలిస్తే 28 శాతం తక్కువగానే ఉన్నాయి. మన దేశంలో ఈ ఏడాది మార్చిలో లీటరు పెట్రోల్ ధరను రెండు రూపాయలు తగ్గించి నప్పటికీ ఇంధన ధరల్లో మాత్రం మార్పు రాలేదు. ప్రారంభంలో అంతర్జాతీయ చమురు ధరల ప్రభావం వినియోగదారులపై పడకూడదని భావించి, అందుకు అనుగుణంగా ఆయిల్ కంపెనీలు చర్యలు తీసుకున్నప్పటికీ ఆ తర్వాత కాలంలో మాత్రం వాటి వైఖరిలో మార్పు వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా ఇక్కడ మాత్రం పెట్రోలియం ఉత్పత్తుల ధరలను ఏ మాత్రం తగ్గించలేదు.

కన్నయ్యకుమార్ కోసం ఢిల్లీకి బల్మూరి వెంకట్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఢిల్లీ నార్త్ ఈస్ట్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ ఇన్‌చార్జీ కన్నయ్య కుమార్ తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బుధవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. రాహుల్‌గాంధీతోపాటు ఆయన ఢిల్లీలో ప్రచారం నిర్వహించనున్నారు. ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరి అధ్యక్షతన గురువారం నిర్వహించనున్న సమావేశంలో ఆయన మాట్లాడనున్నారు.

నాటి ప్రజా తీర్పు పునరావృతం

జైరాం రమేష్

న్యూఢిల్లీ: 2004లో వెల్లడైన నాటి ప్రజా తీర్పు 2024 లోక్‌సభ ఎన్నికల్లో పునరావృతమవుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ మిగిలిన 115 సీట్లలో కనీసం ప్రచారం కూడా చేయడం లేదని అన్నారు. రైతులు ఆగ్రహంగా ఉండటంతో కాషాయ నేతలు హరియాణ, పంజాబ్ రాష్ట్రాల్లో అడుగుపెట్టడం లేదని ఆరోపించారు. రైతు సంఘాలకు ఇచ్చిన హామీలను ప్రధాని మోడీ నెరవేర్చలేదని ఆయన దుయ్యబట్టారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో 700 మంది రైతులు మరణించినా ప్రధాని మోడీ కనీసం వారికి సంతాపం తెలపలేదని విమర్శించారు. రైతులు ఈ విషయం ఎన్నటికీ మరువరని మండిపడ్డారు.డ్రోన్ల సాయంతో భాష్ప వాయు గోళాలను ప్రయోగించారని హరియాణ మాజీ హోంమంత్రి అనిల్ విజ్ అంగీకరించారని జైరాం రమేష్ గుర్తు చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో సైనిక రిక్రూట్‌మెంట్ స్కీం అగ్నివీర్‌పై హాట్ డిబేట్ సాగుతోంది. కాషాయ పాలకులు మన సైన్యంతో, దేశ భద్రతతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో తాము స్పష్టమైన తీర్పును పొందుతామని, మన రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, ప్రభుత్వ విధానాలు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్నాయని ప్రజలకు అర్థమైందని అన్నారు.

పరువు నష్టం కేసులో... రాహుల్‌కు రాంచీ కోర్టు సమన్లు

జంషెడ్‌పూర్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి రాంచీలోని దిగువ కోర్టు సమన్లు జారీ చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను 'హత్య కేసులో నిందితుడి'గా సంబోధించినందుకు రాహుల్‌పై పరువునష్టం కేసు నమోదైంది. రాంచీ సివిల్ కోర్టులో బీజేపీ మద్దతుదారు దాఖలు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో రాహుల్‌కు మంగళవారం సమన్లు జారీ చేశారు. తనపై నమోదైన పరువునష్టం కేసుకు సంబంధించి రాంచీ దిగువ కోర్టులో జరుగుతున్న విచారణను కొట్టివేయాల్సిందిగా రాహుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జార్ఖండ్ హైకోర్టు ఫిబ్రవరిలో తోసిపుచ్చింది. 2018 మార్చి 18న న్యూఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో రాహుల్ ప్రసంగిస్తూ హత్య కేసులో అమిత్ షా నిందితుడని తెలిపారు. దీనిపై బీజేపీ మద్దతుదారు ఝా ఫిర్యాదు చేయడంతో రాహుల్‌పై కేసు నమోదైంది. కాగా సమన్ల తేదీ ఇంకా తెలియలేదని రాహుల్ న్యాయవాది చెప్పారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు ఈసీ నోటీసులు

నిబంధనలను అనుసరించాలని మీ స్టార్ క్యాంపెయినర్లను ఆదేశించండి

న్యూఢిల్లీ : బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులకు బుధవారం ఎన్నికల సంఘం వేరువేరుగా నోటీసులు జారీ చేసింది. ఎన్నికల నిబంధనలు అనుసరించాలని మీ స్టార్ క్యాంపెయినర్లను ఆదేశించాలని ఈ నోటీసులు ఈసీ స్పష్టం చేసింది. సమాజంలో విభజనలు సృష్టించే, కులాల మధ్య ఉద్రికత్తలకు కారణమయ్యే ప్రకటనలు చేయకుండా స్టార్ క్యాంపెయినర్లను నియంత్రించాలని పార్టీ అధ్యక్షులను కోరింది. స్టార్ క్యాంపెయినర్లు తమ ప్రసంగాలు మర్యాదగా చేసే బాధ్యత పార్టీ అధ్యక్షులదేనని తెలిపింది. ఇటీవల స్టార్ క్యాంపెయినర్లు చేస్తున్న ప్రసంగాలు గాడి తప్పుతున్నాయంటూ ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రచారాల్లో కుల, మత ప్రస్తావనలను తీసుకురావడంపైనా విరుచుకుపడింది. ఎన్నిసార్లు హెచ్చరించినా పార్టీల ప్రచారశైలిలో మార్పు రావడం లేదని, ఇకనైనా సరిదిద్దుకోవాలని నోటీసుల్లో ఈసీ పేర్కొంది. ప్రచారాల్లో మతపరమైన అంశాలకు దూరంగా ఉండాలని ఇరు పార్టీలకు ఎన్నికల సంఘం సూచించింది. ముఖ్యంగా సమాజంలో విభజనకు దారితీసే ప్రసంగాలను చేయొద్దని తమ పార్టీ స్టార్ క్యాంపెయినర్లను ఆదేశించాలని బీజేపీ అధ్యక్షులు జెపి నడ్డాకు రాసిన లేఖలో తెలిపింది. గత నెలలో బన్‌స్వారాలో ప్రధాని మోడీ చేసిన ప్రసంగానికి వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 13న నడ్డాకు ఈసీ నోటీసు జారీ చేసింది. దీనికి నడ్డా వివరణ తరువాత ఈ తాజా నోటీసు ఈసీ జారీ చేసింది.

అలాగే, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జునకు జారీ చేసిన నోటీసుల్లో కులాల మధ్య ఉద్రిక్తతలు దారి తీసే విధంగా ప్రసంగాలు చేయవద్దని తమ స్టార్ క్యాంపెయినర్లను ఆదేశించాలని కోరింది. రాజ్యాంగం రద్దవుతుందనే తప్పుడు అభిప్రాయం కలిగించే ప్రసంగాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది. అగ్నివీర్ వంటి పథకాలపై ప్రసంగాలు చేసేటప్పుడు.. సాయుధ బలగాలను రాజకీయం చేయవద్దని పేర్కొంది. అలాగే బీజేపీ, కాంగ్రెస్ ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం, వాటిని సమర్థించుకోవడాన్ని ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. అధికారంలో ఉన్న పార్టీ మరింత బాధ్యతగా వ్యవహరించాలని, అయితే ప్రతిపక్ష పార్టీకీ ఈ విషయంలో మినహాయింపు లేదని పేర్కొంది. ఎన్నికల వ్యవస్థపై దేశ ఓటరుకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని ఈసీ పేర్కొంది. దేశంలో సుదీర్ఘంగా సాగుతున్న సామాజిక, సంస్కృతిక వాతావరణాన్ని బలహీన పర్చడానికి రెండు పార్టీలకు అనుమతి లేదని ఈసీ స్పష్టం చేసింది.



బీజేపీకి 'హర్యానా'లో కష్టమే

మెజారిటీ సీట్లే ఇండియా ఫోరం లక్ష్యం

- కమలానికి నష్టం చేయనున్న రైతుల ఆందోళన, రెజ్లర్ల పోరాటం, అగ్నిపథ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

హర్యానాలో లోక్‌సభ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు బీజేపీకి మొగ్గుచూపారు. 2014లో రాష్ట్రంలోని 10 స్థానాల్లో బీజేపీ ఏడు గెలుచుకోగా, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ) రెండు స్థానాలను, కాంగ్రెస్ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. 2019 ఎన్నికల్లో మాత్రం బీజేపీ 58 శాతం ఓట్లతో 10కి 10 స్థానాలను కైవసం చేసుకొని క్లీన్‌స్వీప్ చేసింది. అయితే, ఆ ఎన్నికల తరువాత రాష్ట్రంలో పరిస్థితులు వేగంగా మారాయి.

ఆరు నెలలకే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓట్లు 58 శాతం నుంచి 36 శాతానికి పడిపోయాయి. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మరోవైపు పదేండ్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్న ప్రజా వ్యతిరేకతను సద్వినియోగం చేసుకొని రాష్ట్రంలో బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేయాలని ఐక్యంగా పోటీ చేసుస్తున్న కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రయత్నిస్తున్నాయి.

బీజేపీపై రైతుల ఆగ్రహం

2019 లోక్‌సభ ఎన్నికల్లో హర్యానాలోని మొత్తం 10 సీట్లను బీజేపీ గెలుచుకోవడం ఒక ఎత్తయితే, ఒక్క రోహ్‌తక్ మినహా తొమ్మిది స్థానాలను లక్షల మెజారిటీలతో ఆ పార్టీ కైవసం చేసుకోవడం మరో ఎత్తు. అయితే, ఆ వెంటనే పరిణామాలు మారిపోయాయి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడం, వారిపై కేంద్రం కఠినంగా వ్యవహరించడం, ఇప్పటికీ రైతుల డిమాండ్‌లను నెరవేర్చకపోవడం వంటి కారణాలతో బీజేపీపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. హర్యానాలో రైతులు ఎక్కువగా జాట్ సామాజికవర్గానికి చెందిన వారే.

రాష్ట్రంలో వీరి జనాభా 26 శాతం వరకు ఉంది. ఐదు లోక్‌సభ నియోజకవర్గాల్లో జాట్‌లే గెలుపోటములను నిర్ణయిస్తారు. ఇక, బీజేపీలో తమకు రాజకీయ ప్రాధాన్యం తగ్గిందనే భావన కూడా జాట్‌లలో ఉంది. జాట్‌ల వ్యతిరేకతను గుర్తించిన బీజేపీ.. కోల్పోయే ఓట్లను ఓబీసీలతో భర్తీ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే మనోహర్‌లాల్ ఖట్టర్ స్థానంలో నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. అయితే, ఈ మార్పులో ఓబీసీలను ఎంతవరకు ప్రభావితం చేస్తుందనేది చూడాల్సి ఉంది.

రెజ్లర్ల ఆందోళన.. అగ్నిపథ్‌పై వ్యతిరేకత

రాష్ట్రంలో బీజేపీకి మరికొన్ని అంశాలు కూడా ప్రతికూలంగా మారాయి. ముఖ్యంగా బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలతో రెజ్లర్లు ఆందోళనకు దిగడం, వారి పట్ల కేంద్ర నిర్లక్ష్య వైఖరి, బ్రిజ్ భూషణ్ కుమారుడికి టికెట్ ఇవ్వడం వంటి అంశాలు కూడా హర్యానా ప్రజల్లో బీజేపీ పట్ల అసంతృప్తికి ఒక కారణం. ఆందోళనకు దిగిన రెజ్లర్లు ఎక్కువగా హర్యానాకు చెందినవారే. ఇక, హర్యానా యువత ఎక్కువగా సైనిక బలగాల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తారు. ఇప్పుడు కేంద్రం తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకం పట్ల యువతలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఇది కూడా రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా మారే అవకాశం ఉంది. వీటికి తోడు పదేండ్లుగా కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై సహజంగానే ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుంది. ఇక, కాంగ్రెస్ నుంచి కొత్తగా చేరిన అశోక్ తన్వర్, నవీన్ జిందాల్‌కు టికెట్లు ఇవ్వడం పట్ల కొందరు బీజేపీ నేతల్లో అసంతృప్తి ఉంది. ఈ అంశాలన్నీ లోక్‌సభ ఎన్నికలు బీజేపీ విజయావకాశాలను తగ్గించవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కాంగ్రెస్‌కు కలిసొస్తున్న అవకాశాలు

బీజేపీకి ఉన్న ప్రతికూల అంశాలను సద్వినియోగం చేసుకొని హర్యానాలో పూర్వవైభవం సాధించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నది. జాట్లు, రైతులు, యువతను ఆకర్షించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. ఆమ్ ఆద్మీతో పొత్తు కూడా కాంగ్రెస్‌కు కలిసొచ్చే అవకాశం ఉంది. హర్యానాకు ఇరువైపులా ఉన్న పంజాబ్, ఢిల్లీలో ఆప్ అధికారంలో ఉండటంతో హర్యానాలోనూ ఆ పార్టీ ప్రభావం ఉంది. పొత్తులో భాగంగా కాంగ్రెస్ తొమ్మిది స్థానాల్లో, ఆప్ ఒక స్థానంలో పోటీ చేస్తున్నాయి. జాట్‌ల ఓట్లు ఏకపక్షంగా కాంగ్రెస్ వైపు పడితే ఆ పార్టీ గణనీయ ఫలితాలను సాధించే అవకాశం ఉంది.

ఐఎన్ఎల్‌డీ, జేజేపీ ప్రభావం

అభయ్ సింగ్ చౌతాలా నాయకత్వంలోని ఐఎన్ఎల్‌డీ, దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ)లు ఈ ఎన్నికల్లో విడిగా పోటీ చేస్తున్నాయి. ఈ రెండు పార్టీలకు రైతులు, జాట్లలో పట్టుంది. దుష్యంత్ చౌతాలాకు యువతలోనూ ఆదరణ ఉంది. దీంతో ఈ రెండు పార్టీలు సాధించే ఓట్లు బీజేపీని దెబ్బతీస్తాయా? కాంగ్రెస్ విజయావకాశాలను నీరుగారుస్తాయా? అనేది ఆసక్తికరంగా మారింది. ఆ పార్టీలు జాట్ల ఓట్లను చీలిస్తే బీజేపీకి లాభం జరగొచ్చనే విశ్లేషణలూ ఉన్నాయి. అయితే, కుటుంబ కలహాలతో ఐఎన్ఎల్‌డి, ఎమ్మెల్యేల ఫిరాయింపులతో జేజేపీ బలహీనపడ్డాయి. ఈ పార్టీలు ఎన్నికల్లో ఏ మేరకు ప్రభావం చూపిస్తాయనేది చూడాల్సి ఉంది. మొత్తంగా బీజేపీకి ఈసారి ఇండియా ఫోరం నుంచి గట్టి పోటీనే ఎదురవుతున్నది. ముఖ్యంగా, రోహ్‌తక్, సోనేపట్, సిర్సా, హిసార్, కర్నాల్ స్థానాల్లో బీజేపీ - కాంగ్రెస్ మధ్య పోటీ తీవ్రంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకుల అంచనా.

సంఘ్ పరివార్‌లో మోడీపై మంటలు!

స్వయం సేవకుల్లో పెరుగుతున్న వ్యతిరేకత



న్యూఢిల్లీ : 'ఒకప్పటి బీజేపీకి, ఇప్పటి బీజేపీకి చాలా తేడా ఉంది. అప్పట్లో మా సామర్థ్యం తక్కువగా ఉండేది. చాలా చిన్నగా ఉండేవాళ్లం. అందుకే ఆర్ఎస్ఎస్ అవసరం ఉండేది. మాకు ఉపయోగపడింది. ఇప్పుడు మేము కూడా పెరిగాము. సమర్థులుగా నిలిచాం. ఆర్ఎస్ఎస్ ఒక సాంస్కృతిక సంస్థ. మాది రాజకీయ సంస్థ. ఎవరి పనులు వారికుంటాయి కదా! బీజేపీ ఇక స్వయంగా నడుస్తుంది.'

- ఐదవ దశ పోలింగ్‌కుఒక రోజు ముందు బీజేపీ అధ్యక్షుడు జెపి నడ్డా అన్న మాటలు ఇవి.

నరేంద్రమోడీ ప్రధాని అయిన తరువాత బీజేపీ - ఆర్ఎస్ఎస్ మధ్య ఉన్న సంబంధాల్లో వచ్చిన మార్పునకు ఈ వ్యాఖ్యలు నిదర్శనమని పరిశీలకులు భావిస్తున్నారు. తనను తాను సర్వశక్తిమంతుడిగా ప్రచారం చేసుకుంటున్న మోడీ, ఆయన ఇద్దరు అనుంగు మిత్రులు (అమిత్‌షా, నడ్డా) సంఘ్‌పరివార్ ప్రాభవాన్ని తగ్గించేందుకు ఒక పథకం ప్రకారం పనిచేస్తున్నారన్న అభిప్రాయం సంఘ్‌పరివారంలో కొంత కాలంగా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో నడ్డా తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ శ్రేణుల్లో చర్చనీయాంశమైనాయి. ఆర్ఎస్ఎస్‌తో అవసరం తీరిపోయిందని, బీజేపీని ఇక నుంచి తాము స్వయంగా నడుపుకుంటామన్నట్టుగా ఆయన చెప్పిన మాటలపై 'సంఘ్ పరివారం'లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్టు సమాచారం. దీని ప్రభావం ఐదవ విడత పోలింగ్ ప్రక్రియపై కూడా పడినట్టు వార్తలు వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి పట్టున్న అనేక నియోజకవర్గాల్లో నత్తనడకన పోలింగ్ జరగడం, అతి తక్కువగా పోలింగ్‌శాతం నమోదు కావడం దీనికి నిదర్శనమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మిగిలిన రెండు విడతల పోలింగ్‌లో కూడా ఇదే ధోరణి కొనసాగే అవకాశం ఉందని భావిస్తున్నారు. 'ది వైర్' తాజాగా ప్రచురించిన కథనంలో ఆర్ఎస్ఎస్-బీజేపీల మధ్య పెరిగిన దూరాన్ని, దానికి దారి తీసిన పరిణామాలను సోదాహరణంగా వివరించింది.

రామాలయమూ వివాదాంశమే...

ఎన్నికల ముందు అట్టహాసంగా నిర్వహించిన ఆయోధ్య రామమందిర ప్రారంభం కూడా సంఘ్ పరివార్‌కు, మోడీ పరివార్‌కు మధ్య వివాదాలను మరింత రాజేసిందని చెబుతున్నారు. రథయాత్ర నిర్వహించిన అద్వాని లాంటి వారిని ఆ కార్యక్రమానికి దూరంగా పెట్టిన మోడీ పరివారం సంఘ్ నేతలకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆర్ఎస్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. ఆ కార్యక్రమం అంతా మోడీ మయంగా మారిన విషయం తెలిసిందే.

సంఘ్ పరివార్ - మోడీ పరివార్

సంఘ్‌పరివార్‌కు, మోడీ పరివార్ (మోడీ, అమిత్‌షా, నడ్డా తదితరులు)కు మధ్య కొంత కాలంగా ఆధిపత్య పోరు సాగుతున్నట్టు సమాచారం. గతంలో మాదిరే తమ కనుసన్నల్లో బీజేపీ నడవాలన్న సంఘ్‌పరివార్ ఆదేశాలను మోడీ పరివార్ బేఖాతరు చేస్తోందని చెబుతున్నారు.

హిందుత్వ అజెండాగా, ప్రజలను చీల్చి, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి అధికారంలోకి రావడానికి ఆర్ఎస్ఎస్ కొన్ని దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, రెండు సార్లు వరుసగా బీజేపీ అధికారంలోకి రావడానికి మోడీ మానియానే కారణమని ఆయన పరివారం ప్రచారం చేసుకుంటోంది. దీనిపైనే సంఘ్‌పరివారంలో అభ్యంతరాలు వ్యక్తమవుతుండగా, తాజా ఎన్నికల్లో ఏకంగా మోడీ గ్యారంటీ పేరుతో ప్రచార బరిలోకి దిగడం వారిని మరింత ఆగ్రహానికి గురిచేస్తోంది. సంఘ్‌పరివార్ నుంచి దీనిపై వ్యక్తమైన అభ్యంతరాలను సైతం మోడీ పరివారం పట్టించుకోలేదని, ఎన్నికల ప్రచార తీరుకు సంబంధించి సంఘ్‌పరివార్ చేసిన సూచనలను సైతం ఖాతరు చేయలేదని సమాచారం.

అద్వానీతో మొదలు పెట్టి...!

మోడీ అధికార బాధ్యతలు చేపట్టిన తరువాత సీనియర్ నాయకులు ఒక్కొక్కరిని పక్కన బెట్టిన విషయం తెలిసిందే. అద్వానితో ప్రారంభమైన ఈ పరంపర ఇంకా కొనసాగుతోంది. ఎన్నికల వేళ అద్వానికి భారతరత్నను ప్రకటించినప్పటికీ, ఆయనను బహిరంగంగానే అగౌరవపరిచిన తీరు సంఘ్‌పరివారంలో చర్చనీయాంశంగా మారింది. ఉమాభారతి వంటి నేతలను దూరంగా ఉంచిన తీరు కూడా వారి ఆగ్రహానికి కారణమని చెబుతున్నారు. తాజా ఎన్నికల్లో సైతం బీజేపీ అంటే మోడీ, మోడీ అంటే బీజేపీగా ప్రచారం సాగిన విషయం తెలిసిందే. మోడీ లేని చోట్ల అమిత్‌షా, నడ్డాలు కనిపించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌తో పాటు, బీజేపీకి చెందిన ఇతర రాష్ట్రాల సిఎంలకు ప్రాధాన్యత ఇవ్వలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎన్డీఏకు రెబల్

స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి పవన్‌సింగ్

న్యూఢిల్లీ : భోజ్‌పురి నటుడు, బీజేపీ సభ్యుడు పవన్‌సింగ్ ఎన్డీఏను కాదని స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. దీంతో పవన్‌ను బీజేపీ బహిష్కరించింది. ఇందుకు సంబంధించి బుధవారం లేఖను విడుదల చేసింది. పవన్‌సింగ్ చేసిన పని పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా ఉందని విమర్శిం చింది. ప్రస్తుతం పవన్ సింగ్ ఎన్డీఏ అభ్యర్థి ఉపేందర్ కుష్వాహాకు పోటీగా బీహార్‌లోని కరాకట్ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్నారు. గతంలో పవన్ బీజేపీ సభ్యుడిగా ఉన్నప్పటికీ నామినేషన్‌లకు ముందు ఆర్‌జేడీ టికెట్ అడిగినట్టు సమాచారం. అక్కడి నుంచి నిరాశ ఎదురవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. కరాకట్ లోక్‌సభ స్థానానికి జూన్ 1న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇది ఏడవ దశ, చివరిది కూడానూ. ఆ స్థానానికి కుష్వాహాతో పాటు రాష్ట్రీయ లోక్ మోర్చా అధినేత, కేంద్ర మాజీ మంత్రి రాజారాం సింగ్, మజ్లీస్ పార్టీ నుంచి ప్రియాంక చౌదరి బరిలో ఉన్నారు. ఆర్‌జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ ఈ లేఖపై స్పందిస్తూ 'ఉపేంద్ర కుష్వాహాను ఓడించేందుకు బీజేపీ కుట్ర మాత్రమే. అంతర్గతంగా పవన్‌సింగ్‌కు బీజేపీ మద్దతుగానే ఉంది' అన్నారు. బీహార్ ఉప ముఖ్యమంత్రి సమరత్ చౌదరి స్పందిస్తూ "ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో పోటీ చేస్తే, సహజంగానే ఆ పార్టీ చర్యలు తీసుకుంటుంది." అన్నారు.

సెల్ఫీ తెచ్చిన తంటా..

- పోలింగ్ అధికారిపై సస్పెన్షన్ వేటు
- నిబంధన అతిక్రమణతో ఈసీ ఆగ్రహం


న్యూఢిల్లీ : ఎన్నికల విధుల్లో ఉన్న సమయంలో ఓటర్లతో సెల్ఫీలు తీసుకున్నందుకు ఓ పోలింగ్ అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. ఉత్తరప్రదేశ్‌లోని హరీంపూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఓ పోలింగ్ బూత్ అధికారి పోలింగ్ జరుగున్న సమయంలో తన సెల్‌ఫోన్‌లో ఓటర్లతో సెల్ఫీలు తీసుకున్నాడు. నిబంధనలు అతిక్రమించినందుకు అతనిపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు ఉత్తరప్రదేశ్ ఎన్నికల ముఖ్య అధికారి నవదీప్ రిన్వా తెలిపారు. హరీంపూర్ జిల్లాలోని ముష్కారా బ్లాక్ ఉమ్రి బాలికల ప్రాథమిక పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆశిష్ కుమార్ ఆర్యను శ్రీ విద్యా మందిర్ ఇంటర్ కాలేజీలో 112వ పోలింగ్ బూత్‌కు ఎన్నికల విధుల కోసం పంపారు. పోలింగ్ కొనసాగుతున్న సమయంలో అతను ఓటర్లతో సెల్ఫీలు దిగాడు. ఈసీ ఆదేశాలను ఉల్లంఘించినందుకు హరీంపూర్ జిల్లా విద్యాధికారి ఆర్యాను సస్పెండ్ చేసి, ముస్కారా బ్లాస్ రిసోర్స్ సెంటర్‌కు పోస్ట్ చేసినట్టు జిల్లా విద్యాధికారులు తెలిపారు.

సంపాదకీయం

ప్రజారోగ్యానికి గ్యారంటీ కావాలి

'ఆరోగ్యమే మహాభాగ్యం' మనందరికీ తెలిసిన విషయమే. నేటి ఆధునిక కాలంలో కరువు అవుతున్నదే అవి. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఆరోగ్య సమస్యలు సర్వసాధారణమయ్యాయి. ఏదో ఒక అనారోగ్య సమస్య లేకుండా ఎవరైనా ఉంటారంటే నమ్మగలమా? కొందరు అన్నమే దొరక్క పస్తులతో చస్తుంటే, మరికొందరికి రకరకాల హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీల్లోని కల్తీ ఆహార పదార్థాలను తింటూ ఆరోగ్యాన్ని దెబ్బ తీసుకుంటున్నారు. చావుదరి చేరుతున్నారు. పేదరికం వెంట వచ్చే ఆకలి, పరిశుభ్రమైన నీరు, గాలి లేకపోవడం వంటివీ కీలకమే. రాష్ట్రంలోని తాజా పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఏమీ లేవు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని రాష్ట్ర ఆహార భద్రతా విభాగం గత మూడు వారాలుగా చేస్తున్న విస్తృత తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. ఆహారం కల్తీ కావడం నిత్యకృత్యమైంది. ఉన్నది ఉన్నట్టుగా చెప్పాలంటే కల్తీలేనీ ఆహారమే లేదు. వంట గదుల నుంచి వండే పదార్థాల దాకా అన్నీ అపరిశుభ్రమే. అందులో నాణ్యతా ప్రశ్నార్థకమే.

ఇండ్లల్లో వంట చేసుకునే సమయం లేక, ఉన్నా బద్ధకించి ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా ఫుడ్ తెప్పించుకునే పరిస్థితి. ఇదే అవకాశంగా తీసుకుని కాలం చెల్లిన మసాలాలను కలిపి పాడైపోయిన పదార్థాలను వేడివేడిగా వడ్డించే హోటళ్లు, రెస్టారెంట్లు అనేకం. ఘుమఘుమలాడే వాసనలు, ఆకర్షణీయమైన రంగులు, వేడివేడి వడ్డన ఆకట్టుకుంటున్నా, తింటే మాత్రం అనారోగ్యం తథ్యం. జీవనశైలీ వ్యాధులు అంటడం ఖాయం. ఆపైన ఆస్పత్రిలో రెస్ట్ తప్పదు మరి. పదే పదే కాచిన నూనెల వినియోగం, గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఆరోగ్యాన్ని పీల్చిపిప్పి చేస్తున్నాయి. హోటళ్లలో ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచిన పదార్థాలు, నకిలీ వాటర్ బాటిళ్లు, చాక్లెట్లు, మసాలాలు, చీజ్, సిరప్, శాండ్‌విచ్ బ్రెడ్‌లను అక్రమంగా విక్రయిస్తున్నారనేది బహిరంగ సత్యం.




గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 14 వేలకుపైగా ఆహారపు శాంపిళ్లను సేకరిస్తే 3800పైగా శాంపిళ్లల్లో నాణ్యతకు సంబంధించి వివిధ హోటళ్లకు రాష్ట్ర ఆరోగ్య విభాగం సలహాలు, సూచనలు చేయాల్సి వచ్చింది. 2500కు పైగా శాంపిళ్లల్లో అసలు నాణ్యత లేదని స్పష్టమైంది. 300కుపైగా శాంపిళ్లు భారీగా కల్తీతో ఉన్నట్టు నిర్ధారించింది. రాష్ట్ర రాజధానిలోనే ఇంత దారుణ పరిస్థితి ఉంటే, ఇక జిల్లాల్లో అంచనా వేయగలమా? రుచి సంగతి పక్కనబెడితే శుచిని ఆశించగలమా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. జీవనశైలీ ఆహారపు అలవాట్లలో గణనీయమైన మార్పులు వస్తుండటం, ఇది ఆరోగ్యంపై పెనుప్రభావాన్ని చూపుతుండటమూ గమనార్హం. జంక్‌ఫుడ్స్, వ్యాయామం లేకపోవడం, భోజనం, నిద్రకు సమపాలన లేకపోవడం తోనే వ్యాధులు ప్రబలుతున్నాయి. ఆహారంతోనే దాదాపు 56 శాతం వ్యాధులు సంక్రమిస్తున్నాయనేది జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) అంచనా. మంచి ఆరోగ్యం కోసం ఏం తినాలి? ఎప్పుడు తినాలి? తదితర అంశాలను డైటరీ గైడెన్స్ ఫర్ ఇండియన్స్ పేరుతో ఎన్ఐఎన్ తాజాగా విడుదల చేసింది. పోషకాహారంతో బీపీ, షుగర్ ఇతర ముప్పులను తగ్గించుకోవచ్చు. ఉప్పు, చక్కెర, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ (చిప్స్, బర్గర్లు, పిజ్జా, కూల్‌డ్రింక్స్) విషయంలో అప్రమత్తత తప్పనిసరి. జిహ్వాచాపల్యం తీర్చుకునే పేర కంట్రోల్ తప్పితే ఇక అంతే సంగతులు.

ప్రజలకు సమతుల ఆహారం అందజేసే బాధ్యత ప్రభుత్వాలే తీసుకోవాలి. ఇక్కడ సర్కారు ఒక్కరిదే బాధ్యత కాదు. ప్రజలూ అందులో భాగస్వాములవ్వాలి. తాజా కూరగాయలు, పండ్లను తమ మెనూలో పెట్టుకోవాలి. కాగా సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తరుణంలో పని గంటలు పెరగడం, కుటుంబాల ఉమ్మడి సంతోష సమయం తగ్గిపోవడం, కార్పొరేటీకరణ, నిరుద్యోగం అధికం కావడం తదితర కారణాలతో ఆర్థిక మూలాలు దెబ్బతినడంతో ప్రజలకు ఆరోగ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పార్లమెంటు ఎన్నికల తర్వాత పరిపాలనపైనే పూర్తిగా దృష్టి పెడతామని సీఎం రేవంత్ చెప్పారు. కల్తీ ఆహారాన్ని అమ్మే హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలపై ఉక్కుపాదం మోపాలి. కన్నెర్ర చేయాల్సిన అవసరమూ ఉంది. వాటి పీచమణిస్తే కొంతలో కొంతైనా ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించినట్టే. ప్రజలకు సేవలందించే అన్ని శాఖల్లో పేరుకు పోయిన బూజును దులపాలి. నిరంతర తనిఖీలు, పరిశీలన, కఠిన చర్యలతో సర్కారీ శాఖలను ప్రజల గుమ్మాలు తొక్కేదాకా పరిగెత్తించాలి. ఆయా వృత్తుల వారికి అవగాహనా కార్యక్రమాలు పెంచాలి. అవినీతిపై కొరడా ఝులిపించాలి. సమతుల ఆహారాన్ని అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి గ్యారంటీ ఇవ్వాలి.

> సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తరుణంలో పనిగంటలు పెరగడం, కుటుంబాల ఉమ్మడి సంతోష సమయం తగ్గిపోవడం, కార్పొరేటీకరణ, నిరుద్యోగం అధికం కావడం తదితర కారణాలతో ఆర్థిక మూలాలు దెబ్బతినడంతో ప్రజలకు ఆరోగ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పార్లమెంటు ఎన్నికల తర్వాత పరిపాలనపైనే పూర్తిగా దృష్టి పెడతామని సీఎం రేవంత్ చెప్పారు. కల్తీ ఆహారాన్ని అమ్మే హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలపై ఉక్కుపాదం మోపాలి. కన్నెర్ర చేయాల్సిన అవసరమూ ఉంది. వాటి పీచమణిస్తే కొంతలో కొంతైనా ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించి నట్టే.

వ్యవసాయ ప్రణాళిక-శాస్త్రీయ పద్ధతి



సారంపల్లి మల్లారెడ్డి
9490098666


2014 నుంచి క్రమంగా రాష్ట్ర వ్యవసాయ ప్రణాళికను తగ్గిస్తూ గత ప్రభుత్వం 2020 నుంచి పూర్తిగా నిషేదించింది. ప్రణాళికలేని అరాచక వ్యవసాయ ఉత్పత్తికి దోహదం చేసింది. ముఖ్యమంత్రి ప్రకటనే వ్యవసాయ ప్రణాళికగా నాటి అధికారులు ఆమోదించారు. వ్యవసాయ పరిశోధనలు, పంటల ధరలు, హార్టికల్చర్ పంటల ఉత్పత్తి పెంపుదల, ఆహార ధాన్యాల ఎగుమతులు - దిగుమతులపై ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికగానీ, అజమాయిషీగానీ లేదు. ఎరువులు, విత్తనాలు, ప్రకృతి వైపరీత్యాలు, బడ్జెట్ మొదలగు అంశాల ప్రస్తావన ప్రణాళిక నుంచి తొలగించి వేశారు. వ్యవసాయ శాఖ రైతులు పండించిన పంటలపైనే సమాచార సేకరణ చేశారు తప్ప, రాష్ట్రంలో గల మౌలిక వసతులను పరిగణలోకి తీసుకోలేదు. వాటిని సద్వినియోగం చేసి ఉత్పత్తిని, ఉత్పదకతను పెంచడానికి కనీస కృషి చేయలేదు.

డిసెంబర్ 2023న రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితుల్లో మార్పు వచ్చింది. క్యాబినేట్ సమావేశం జరపడానికి ప్రధాన ఎన్నికల కమిషన్ అంక్షలు పెట్టడం వలన కొన్ని సమస్యలకై పరిమితమై చర్చించింది. వ్యవసాయ ప్రణాళిక, రుణమాఫీ, ఖరీఫ్ ప్రణాళిక తదితర అంశాలపై పాక్షికంగా చర్చించారు. మరో 15 రోజులలో తొలకరి రాబోతోంది. ఇప్పటికే కొన్ని జిల్లాలలో విత్తనాలు వేయడం జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం సమగ్రమైన 'వ్యవసాయ ప్రణాళికను రూపొందించాలి. అందులో రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలి. గత రెండేండ్ల భూ వినియోగంతోపాటు రానున్న 2024-25 సంవత్సరాల వాస్తవాలు, లక్ష్యాలు ప్రకటించాలి. గత మూడేండ్లలో పండిన పంటలు, ఉత్పత్తి, ఉత్పాదకత, జిల్లాల వారీగా ప్రకటించాలి. భూసార పరీక్షలు జరిపి అందరికి 'సాయిల్ హెల్త్ కార్డులు' ఇవ్వాలి. ఇవి మూడేండ్ల వరకు పనిచేస్తాయి.

రాష్ట్రం అవసరాలకు తగిన ఆహార ఉత్పత్తులను పండించడం లేదు. పప్పులు, నూనెగింజలు, కూరగాయలు, ఆకుకూరలు, పంచదార, సుగంధద్రవ్యాలు(ఉల్లి, వెల్లుల్లి), పండ్లు, హార్టికల్చర్ ఉత్పత్తులు దిగుమతులు చేసుకుంటున్నాము. మన రాష్ట్రంలో వీటన్నిటిని ఉత్పత్తి చేయడానికి తగిన భూ, భౌతిక వనరులు ఉన్నాయి. పైగా రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాము. మన రాష్ట్రంలో ఒక పంటపై 20 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. నాణ్యతగల విత్తనాలను రైతులకు అందుబాటులో పెట్టి మిగిలిన విత్తనాలను ఎగుమతులు చేయాలి. గత వ్యవసాయ శాఖ 'విత్తనగోదాం' గా తయారు చేస్తానని ప్రకటనలు చేశారే తప్ప ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. కంపెనీల మోసాలకు తట్టుకొలేక విత్తనాల రైతులు భూములు కొల్పోవడమేకాక ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విత్తన చట్టం తెచ్చి ఆ రైతులకు రక్షణ కల్పించాలి.

కల్తీ విత్తనాల సమస్య

రాష్ట్రంలో ఏటా 4, 5 లక్షల ఎకరాల్లో కల్తీ విత్తనాల వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. చట్టం లేకపోవడంతో రైతులు నష్ట పోతున్నారు. నాణ్యత లేని విత్తనాలు అనగా ఆడ, మగ విత్తనాల మధ్య తక్కువ పాలినేషన్ చేసి విత్తనాలు తయారు చేయడం వల్ల ఉత్పాదకత దెబ్బతింటున్నది. ఎఫ్-1 విత్తనాలు, హైబ్రిడ్ విత్తనాలు, సర్టిఫైడ్ విత్తనాలు, అధికోత్పత్తి వంగడాలు, వీటికి ధృవీకరణ పత్రం కంపెనీలే ఇస్తున్నాయి. సొంత ధృవీకరణ వల్ల విత్తనాల "జర్మినేషన్" 60 శాతం లోపే ఉంటున్నది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో విత్తన ధృవీకరణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ద్వారా నిర్ణయించిన కమిషన్ ద్వారా "విత్తన ధృవీకరణ పత్రం" ఇచ్చారు. తిరిగి దానిని పునరుద్ధరించాలి. విత్తన కంపెనీకి, రైతుకు కుదించిన ఒప్పంద పత్రం రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ వద్ద డిపాజిట్ చేయాలి. విత్తన రైతుకు కావాల్సిన రుణాలు, వ్యవసాయ సలహాలు ఉచితంగా అందుబాటులో పెట్టాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల పర్యవేక్షణ కింద విత్తనోత్పత్తి, పరిశోధన కేంద్రాలు పని చేయాలి. ఆ విధంగా ఉత్పాదకతలను పెంచాలి.



హార్టికల్చర్

తెలంగాణలో ప్రస్తుతం 6.5 లక్షల ఎకరాలలో హార్టికల్చర్ పంటలు పండిస్తున్నారు. దీని లక్ష్యాన్ని 15 లక్షల ఎకరాలకు పెంచాలి. ప్రస్తుతం రాష్ట్రంలో కూరగాయలు, నూనెలు, పప్పులు, చెరుకు, ఆయిల్ పాం తదితర పంటల లోటు ఉంది. అలాగే హార్టికల్చర్ పంటల ప్రయోగ కేంద్రాలు నిర్వహించి పై పంటలపై కేంద్రీకరించాలి, లోటును భర్తీ చేయాలి. హార్టికల్చర్ పంటలను ప్రాసెస్ చేసి, గ్రేడింగ్ చేసి దగ్గరలో ఉన్న ముస్లిం దేశాలకు ఎగుమతులు చేయడం ద్వారా రైతులకు లాభాలు కట్టబెట్టవచ్చు. ప్రస్తుతం ఈ శాఖలో 901 పోస్టులు ఖాళీలు ఉన్నాయి, వాటిని వెంటనే భర్తీ చేయాల్సిన అవసరం ఉన్నది.

వ్యవసాయశాఖలో ఖాళీలు

ప్రతి మూడు గ్రామాలకు ఒక ఏఓను నియమించాలి. ప్రస్తుతం ఉన్న పోస్టుల ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలి. అన్ని వ్యవసాయ పరిశోధన కేంద్రాలను పని చేయించాలి. రైతుల పర్యటనలు పెట్టాలి. వాటికి నిధులు కేటాయించి పరిశోధన కేంద్రాలలో రైతులకు క్లాసులు పెట్టాలి. రాష్ట్రంలోని 2,208 రైతు వేదికలను రైతు సలహా కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ఆ కేంద్రం నుండే రైతులకు సలహాలివ్వాలి. రైతుల పంటల జబ్బులకు సలహాలు ఇవ్వడానికి టోల్ నెంబర్లు కేటాయించాలి. ప్రణాళికలో ఐప్సోమ్ పంటల వివరాలను స్పష్టపరచాలి. కెవికెల పనిని మెరుగుపర్చాలి. పంటలేగాక మార్కెట్ చట్టాలు ఎగుమతి, దిగుమతుల ఫలితాలను వివరించాలి. పంటలు వేయు సందర్భంగా, కోతల అనంతర కృషికి సంబంధించి విధానాలను ప్రణాళికలో చెప్పాలి. పంటల నిల్వ సౌకర్యం, అమ్మకపు సందర్భంగా రైతు బంధు (సరుకు తాకట్టు పెట్టుకొని డబ్బు ఇవ్వడం) పథకం సక్రమంగా అమలు చేయాలి. ఎంపిక చేసిన జిల్లా కేంద్రాల్లో ల్యాబ్ సౌకర్యం కల్పించి కల్తీ, నాణ్యతలేని విత్తనాలను, ఎరువులను పరిశీలించి చర్యలు చేపట్టాలి. ఒకే పంటల విధానం కాక బహుళ పంటల సేద్యాన్ని ప్రోత్సహించాలి.

బడ్జెట్, రుణప్రణాళిక

ప్రణాళికలో చివరి అంశంగా గత మూడేండ్ల బడ్జెట్‌తో పాటు రానున్న ఏడాదికి కేటాయించిన వ్యవసాయ బడ్జెట్ వివరాలను అంశాల వారీగా ప్రకటించాలి. కేంద్ర సహాయాన్ని విడిగా జాబితా ఇవ్వాలి. హార్టికల్చర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన్ కేంద్రాల కేటాయింపులు స్పష్టంగా బడ్జెట్‌లో ఇవ్వాలి. బ్యాంకుల ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి "రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం"లో రిజర్వుబ్యాంకు ఆదేశాలను అమలు చేయాలి. రైతులందరికీ రుణాలివ్వాలి. ఇందుకు ఎస్ఎల్‌బిసి బాధ్యత వహించాలి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలివ్వాలి. 15 శాతం దళిత గిరిజనులకు, 8.3 శాతం సన్న-చిన్నకారు రైతులకు రుణాలివ్వాలని ఆర్‌బిఐ ఆదేశించింది. పంటల రుణాలు, దీర్ఘ కాలిక రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు ఇవ్వాలి. బుక్ అడ్జెస్ట్‌మెంట్ పద్ధతి రద్దు చేయాలి. కాంఫౌండ్ వడ్డీ కాకుండా "సాలు సరి" వడ్డీని లెక్కగట్టాలి. పావలా వడ్డీ, వడ్డీమాఫీ, కేంద్ర వడ్డీ సహాయం తదితర పథకాల అమలు చేయని బ్యాంకులపై చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర బడ్జెట్ నిధులను సహకరా సంఘాలలో డిపాజిట్లు చేయాలి. సహకరా సొసైటీలు నిత్యావసర సరుకుల అమ్మకాలు, పంటల కొనుగోళ్లు చేయాలి. ఎఫ్‌పిఓ (రైతుల, ఉత్పత్తిదారుల ఆర్గనైజేషన్)లు ఏర్పాటు చేసి వాటి ద్వారా సేవలు కొనసాగించాలి. అధికారులను నిధులకు అకౌంట్ బులిటి బాధ్యత వహింపజేయాలి. ప్రతి మండలానికి నాలుగు సహకరా సంఘాలు నెలకొల్పాలి. కేంద్ర ఎన్‌సిడిసి సహాయంతో భవనాలు, గోదాంల నిర్మాణం చేపట్టాలి. పంటలలో కనీసం 70 శాతం నిల్వ సౌకర్యం కల్పించాలి. తాత్కాలిక రేకుల షెడ్, సిమెంట్ గద్దెలు నిర్మాణం చేసి మార్కెట్‌కు వచ్చిన పంటలు అకాల వర్షాల వల్ల నష్టపోకుండ సౌకర్యం కల్పించాలి. తగినన్ని టార్పాలిన్స్ అందుబాటులో పెట్టాలి. రైతులకు అవసరమైన అన్ని సరుకులను సొసైటీల ద్వారా అందించాలి. కొన్ని సంఘాలలో గ్రేడింగ్, ప్రాసెసింగ్ జరిపే ఏర్పాట్లు చేయాలి. సహకార వ్యవస్థలో ఐదంచెల విధానానికి బదులు మూడంచెల విధానాన్ని అమలు చేయాలి. అనగా జిల్లా కమిటీలు, రిజర్వు బ్యాంకు అంచెలను తొలగించాలి. ప్రయివేటు రుణాలను బ్యాంకు రుణాలుగా మార్చాలి. వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ప్రస్తుతం మధ్యదళారీలు కొనసాగిస్తున్న దోపిడీ, కుంభకోణాలను అరికట్టాలి. రైతుబంధు (గోదాములలో ధాన్యం తాకట్టుపెట్టుకొని డబ్బులు ఇవ్వడం) రైతులకు అమలు చేయాలి. ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి అదనపు ఆదాయం వచ్చే విధంగా చూడాలి. వ్యవ సాయ అనుబంధ ఉత్పత్తులు కోళ్లు, గొర్రెలు, మేకలు, చేపలు, పాలు తదితర ఉత్పత్తులను పెంచడానికి తగిన ప్రణాళిక రూపొందించాలి.

ప్రకృతి వైపరీత్యాలు

గతంలో యాక్షన్ ప్లాన్‌లో ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి నిబంధనలు మాత్రమే ప్రచురించారు. దాంతో పాటు గత రెండేండ్లలో జరిగిన నష్టం మండలాల వారీగా ప్రకటించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ఆర్థిక సంస్థలు ఇచ్చే పరిహారాన్ని ప్రణాళికలో తెలియబరచాలి. అన్ని పంటలకు ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించి, బీమా సౌకర్యం కల్పించాలి. ఇందుకు నిబంధనలు రూపొం దించాలి. రైతుబీమా ప్రస్తుతం 18-59 సంవత్సరాల వయస్సు వారికే ఉంది. దీనిని 18-70 సంవత్సరాలకు పెంచాలి. ప్రస్తుత బీమా ఆగస్టు 15తో పూర్తవుతుంది గనుక తిరిగి పునరుద్ధరించాలి. సిపిఓ (చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్) ద్వారా క్రాప్ కటింగ్ చేసి నష్టాన్ని అంచనా వేయాలి.రాష్ట్ర వ్యవసాయ శాఖ శాస్త్రీయంగా వ్యవసాయ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలి. పై విధానాలు అమలు చేయడం ద్వారా రైతుల ఆత్మహత్యలను నివారించవచ్చు. వ్యవసాయ దిగుమతులను తగ్గించి, ఎగుమతులు కొనసాగించవచ్చు. నష్టాల్లో ఉన్న వ్యవసాయాన్ని లాభాల్లోకి తీసుకురావచ్చు.

> రాష్ట్రం అవసరాలకు తగిన ఆహార ఉత్పత్తులను పండించడం లేదు. పప్పులు, నూనెగింజలు, కూరగాయలు, ఆకుకూరలు, పంచదార, సుగంధద్రవ్యాలు(ఉల్లి, వెల్లుల్లి), పండ్లు, హార్టికల్చర్ ఉత్పత్తులు దిగుమతులు చేసుకుంటున్నాము. మన రాష్ట్రంలో వీటన్నిటిని ఉత్పత్తి చేయడానికి తగిన భూ, భౌతిక వనరులు ఉన్నాయి. పైగా రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాము. మన రాష్ట్రంలో ఒక పంటపై 20 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. నాణ్యతగల విత్తనాలను రైతులకు అందుబాటులో పెట్టి మిగిలిన విత్తనాలను ఎగుమతులు చేయాలి. గత వ్యవసాయ శాఖ 'విత్తనగోదాం' గా తయారు చేస్తానని ప్రకటనలు చేశారే తప్ప ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. కంపెనీల మోసాలకు తట్టుకొలేక విత్తనాల రైతులు భూములు కొల్పోవడమేకాక ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విత్తన చట్టం తెచ్చి ఆ రైతులకు రక్షణ కల్పించాలి.


> ప్రయివేటు రుణాలను బ్యాంకు రుణాలుగా మార్చాలి. వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ప్రస్తుతం మధ్యదళారీలు కొనసాగిస్తున్న దోపిడీ, కుంభకోణాలను అరికట్టాలి. రైతుబంధు (గోదాములలో ధాన్యం తాకట్టుపెట్టుకొని డబ్బులు ఇవ్వడం) రైతులకు అమలు చేయాలి. ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి అదనపు ఆదాయం వచ్చే విధంగా చూడాలి.

> గతంలో యాక్షన్ ప్లాన్‌లో ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి నిబంధనలు మాత్రమే ప్రచురించారు. దాంతో పాటు గత రెండేండ్లలో జరిగిన నష్టం మండలాల వారీగా ప్రకటించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ఆర్థిక సంస్థలు ఇచ్చే పరిహారాన్ని ప్రణాళికలో తెలియబరచాలి. అన్ని పంటలకు ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించి, బీమా సౌకర్యం కల్పించాలి. ఇందుకు నిబంధనలు రూపొందించాలి. రైతుబీమా ప్రస్తుతం 18-59 సంవత్సరాల వయస్సు వారికే ఉంది. దీనిని 18-70 సంవత్సరాలకు పెంచాలి.

సంభాల్ ఘటనలు : ముస్లింలపై మాటలూ దాడులూ

(మే 15 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ఈ రోజుల్లో నరేంద్ర మోడీ కనీసం సత్యానికి కాస్త అటూ ఇటూగానైనా మాట్లాడలేక పోతున్నారు. తాజాగా వారణాసిలో నామినేషన్ దాఖలు చేసిన తర్వాత ఈ కోవలోనే ఆయన కొన్ని అసత్య వాక్కులు నుడివారు. 'ఎక్కువ మంది పిల్లలు కనేవారు' అన్న మాట తాను ముస్లింలను ఉద్దేశించి అనలేదని చెప్పుకొచ్చారు. 'ఏ రోజునైతే నేను హిందూ ముస్లింలను వేరుగా చూస్తానో ప్రజా జీవితంలో వుండే అర్హత కోల్పోతాను' అంటూ దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్య కూడా చేశారు. ఎందుకంటే ఏప్రిల్ 9న బాన్స్‌వారాలో ఆయన చేసిన ప్రసంగాన్ని ఆలకించిన వారెవరైనా అది ముస్లింలను లక్ష్యంగా చేసినట్టు చాలా తేలిగ్గానే అర్థం చేసుకోగలుగుతారు. 'చొరబాటుదారులు', 'ఎక్కువ మందిని కనేవారు' అన్నది ముస్లింల గురించనే భావిస్తారు. పైగా ఆ సందర్భం కూడా స్పష్టంగా వుంది. దేశ వనరులపై ముస్లింలకు వాటా వుందని మన్మోహన్ సింగ్ చేసిన ప్రకటనను ఆయన ఉటంకించారు కూడా. నిజానికి ముస్లింలు అధిక సంతానం కంటారనేది 2002 గుజరాత్ ఎన్నికల నాటి నుంచి మోడీ నిరంతర ఉవాచగా వుంటోంది. 'మేము అయిదుగురం...మాకు అయిదుగురు..' అంటూ ఆయన వారిని వెక్కిరించారు. ఆ మత మారణకాండ బాధితులైన ముస్లిం శరణార్థుల కోసం ఏర్పాటు చేసిన సహాయ శిబిరాలు 'సంతానోత్పత్తి కేంద్రాలుగా' తయారయ్యాయని అత్యంత బాధ్యతా రహితంగా మాట్లాడారాయన. ఈ హిందూ ముస్లిం పాటే ముదిరి తర్వాత ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కబరిస్థాన్, శ్మశాన్‌ఘాట్ వంటి వాటి గురించి మాట్లాడేందుకు దారితీసింది. ప్రధాని, ఆయన హంగుదార్లు ఈ విధంగా ముస్లింలను రాక్షసులుగా చిత్రిస్తూ వారిపై దాడి చేయడం క్షేత్ర స్థాయిలో ప్రభావం చూపింది. వారి ఓటు హక్కు తొలగించే చర్యలకు దారితీసింది.



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

సంభాల్‌లో జరిగిందేమిటి?

మే 7వ తేదీన మూడవ దశ పోలింగ్‌లో పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని సంభాల్ పార్లమెంటరీ నియోజకర్గంలో జరిగింది అదే. ఈ నియోజక వర్గంలోని ముస్లిం జనాభా అధికంగా వున్న అనేక గ్రామాలలో వారి ఓటు హక్కు నిరాకరించబడింది. ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాల బయట నిరీక్షిస్తున్న ముస్లింలపై పోలీసులు దాడికి దిగారు. న్యూస్ వెబ్‌సైట్ 'స్క్రోల్'లో ఈ పరిణామాన్ని విశదంగా ప్రచురించారు. మన్సురాపూర్, ఓవరీ, షెబాజ్‌పూర్ కలన్, ముబారక్‌పూర్ తదితర గ్రామాలలో ఇదే పునరావృతమైంది. ఉదయం పది పదకొండు గంటల మధ్య ముప్పై నలభై మంది పోలీసుల గుర్రాల దండు రావడం, అక్కడ ఓటు వేయడానికి కాచుకుని వున్న ఓటర్ల ఆధార్ కార్డులు, ఓటింగ్ స్లిప్‌లు లాగేసుకోవడం ఇదే తంతు. మహిళలని కూడా చూడకుండా వారిలో అనేక మందిని లాఠీలతో బాది, ఫైబర్ బెత్తాలతో కొట్టి తరిమేశారు. ఓవ్రీలోని ఒక జూనియర్ హైస్కూలులోని పోలింగ్ కేంద్రంలోనైతే ఓటర్లను ఎలా తరిమేశారో చిత్రించిన వీడియో కూడా వుంది. ఈ పోలింగ్ స్టేషన్లలో ఎక్కువగా అస్మోలి శాసనసభ నియోజకవర్గ పరిధిలో వున్నాయి. సంభాల్ పట్టణంలోని కొన్ని ముస్లిం ప్రాంతాలలోనైతే పోలింగ్ కేంద్రాలలోని ఓటర్లపై పోలీసులు దాడులు చేశారు. ఇక్కడ గమనించాల్సింది ఏమంటే ముస్లింలు లేని మరే గ్రామాలపైన గాని, పోలింగ్ కేంద్రాలపైన గాని ఈ విధమైన పోలీసు దాడులు జరగలేదు. ఈ విధంగా అనేక పోలింగ్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ జరపడం స్థానిక విషయంగానో లేక చెదురు మదురు ఘటనగానో జరిగే అవకాశం లేదు. జిల్లా స్థాయి పోలీసు అధికారులకు తెలిసీ లేదా ఆమోదంతో ఇవి జరిగి వుండాలి. కుందరికి అసెంబ్లీ ఎమ్మెల్యే కూడా అయిన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి జియా ఉర్ రహ్మాన్ ముస్లిం ఓటర్లపై దాడికి జరిగిన కుట్రగా దీన్ని అభివర్ణించారు. సంభాల్ లోక్‌సభ స్థానం 2019 ఎన్నికలలో సమాజ్‌వాది పార్టీ గెలుచుకున్నది.

ఇ.సి ఉపేక్షకు వెనుక..

ఈ ఘటనలపై పోలీసులకు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. బాధితులలో ఒకరిని పోలీసులు ఒత్తిడి పెట్టి అసలు ఏ దాడి జరగలేదని వాంగ్మూలం తీసుకున్న సందర్భం కూడా వుంది. ఉత్తరప్రదేశ్‌లో ముస్లింలు ఇప్పటికే రెండవ శ్రేణి పౌరులుగా మార్చబడ్డారని సంభాల్ సంఘటన నిరూపించింది. అంతకుముందు పోలీసులు ఓటర్లను బెదిరించిన, నిరోధించిన ఘటనలపై ఇదే విధంగా మొదటి దశ పోలింగ్ తర్వాత కూడా సమాజ్‌వాది పార్టీ అభ్యర్థులు ఫిర్యాదు చేశారు. రామ్‌పూర్, మొరాదాబాద్, ముజఫర్‌నగర్ నియోజకవర్గాలలో జరిగిన ఇలాంటి ఘటనలపై ఫిర్యాదు చేసినప్పుడు ఎన్నికల సంఘం సత్వరం రంగంలోకి దిగి వుండాల్సింది. దాడికి గురైన పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ జరిపి దోషులైన పోలీసులపై చర్య తీసుకోవలసింది. కానీ అలాంటిదేమీ జరగలేదు. ముస్లింలపై ప్రధానమంత్రి ఇలా మాట్లాడినా తప్పుగా భావించని ఎన్నికల సంఘం ముస్లిం ఓటర్ల హక్కులను కాపాడుతుందని ఆశించడం అసాధ్యం. నరేంద్ర మోడీ ఆలపిస్తున్న ముస్లిం వ్యతిరేక వికృత రాగాలనూ ఉత్తరప్రదేశ్ పోలీసులు సంభాల్ నియోజకవర్గంలో ముస్లింల ఓటు హక్కును కాలరాచే దాడులనూ ప్రత్యక్షంగా కలిపే విధాన రేఖ ఒకటే.

> సంభాల్ పట్టణంలోని కొన్ని ముస్లిం ప్రాంతాలలోనైతే పోలింగ్ కేంద్రాలలోని ఓటర్లపై పోలీసులు దాడులు చేశారు. ఇక్కడ గమనించాల్సింది ఏమంటే ముస్లింలు లేని మరే గ్రామాలపైన గాని, పోలింగ్ కేంద్రాలపైన గాని ఈ విధమైన పోలీసు దాడులు జరగలేదు. ఈ విధంగా అనేక పోలింగ్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ జరపడం స్థానిక విషయంగానో లేక చెదురు మదురు ఘటనగానో జరిగే అవకాశం లేదు. జిల్లా స్థాయి పోలీసు అధికారులకు తెలిసీ లేదా ఆమోదంతో ఇవి జరిగి వుండాలి.

రిపోర్టర్స్ డైరీ

వింటారంటావా?

రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వీఆర్‌ఓ వ్యవస్థను రద్దు చేసిన విషయం తెలిసిందే. వాళ్లందర్నీ తలా ఓ దిక్కున ఇష్టమొచ్చినట్టు ఎక్కడపడితే అక్కడకు బదిలీ చేశారు. అప్పట్లో 'దొర'కు వ్యతిరేకంగా గళమెత్తే ధైర్యం లేక సర్దుకుపోయారు. మరీ అన్యాయంగా అప్పటివరకు రెవెన్యూ విభాగంలో వీఆర్‌ఓలుగా పదేండ్లకు పైగా పనిచేసిన వారి సర్వీసును కూడా రద్దుచేసి ఇతర విభాగాలకు పంపేశారు. కొలువుంటే సాలు దొరా.. అన్నట్టు 55 రోజులు సమ్మె చేసిన ఆర్టీసీ కార్మికుల లెక్కే వీఆర్‌ఓలు మనసుల్ని బండరాళ్లు చేసుకొని కొత్త కొలువుల్లో చేరారు. అప్పట్లో వీళ్ల సమస్యను కాంగ్రెస్‌పార్టీ భుజాని కెత్తుకుని, సీఎం కేసీఆర్‌ను "గద్దెదిగు బిడ్డా... నీ సంగతి చెప్తాం..." అంటూ హూంకరించింది. ఉద్యమ నాయకుడే సీఎం అయినట్టు... అప్పటి పీసీసీ అధ్యక్షుడే ఇప్పుడు సీఎం అయ్యారు. వాళ్లకు వీఆర్‌ఓల సమస్యలు గుర్తున్నాయో లేదో అని సదరు ఉద్యోగులు గుబులు పడుతున్నారు. "మా సర్వీసును మాకిచ్చి, మమ్మల్ని మళ్లీ రెవెన్యూ ఉద్యోగులుగా గుర్తించండి సారూ..." అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పుకోవాలని ఉన్నా... అన్నవస్త్రాలకు వెళ్తే... ఉన్న వస్త్రాలు పోతాయేమో అనే భయం వాళ్లను వెంటాడుతున్నది. సీఎం సారే పెద్ద మనసు చేసుకొని అందర్నీ పిలిపించుకొని మాట్లాడితే బాగుంటుంది కదన్నా... ఆయన వింటారంటావా?!!

- ఎస్ఎస్ఆర్ శాస్త్రి

మనం గెలుస్తమంటవా?

ఏందిరా రాజన్న రెండు దినాల నుంచి కంటిగ్గ నవడ్తలేవు. యాడబోయినవురా? అవును మీ కొడుక్కు పాణం మంచిగలేదని తెలిసింది గిప్పుడెట్లున్నడురా? మంచిగున్నడా? అయినా ఎప్పుడు వానలు గొడుతయో, ఎప్పుడు ఎండలు గొడుతయో తెల్వకుంటున్నదిరా? శెడగొట్టు వానలు గొడుతాన్నై. కాలం కట్టుదప్పిందట్టే గిదేనేమోరా? సరెలేరా..గీ ముచ్చట తర్వాతగని మన సంగతేందిరా? మనమే గెలుత్తాన్నమని మనోళ్లందరూ ఎంత ధైర్యం జెప్పినా... లోపల బుగులుగుందిరా? ఏమోరా ఈసారి ఎప్పుడు లేనంత రంది మోపైంది. రాత్రి కునుకువడ్తలేదు. దినాం పొద్దువోత లేదు. ఇంక పద్దెదుదినాలు ఎట్ల గడుత్తయో తెలుత్తలేదురా! అవురా మనం గెలుస్తమంటవా? జెర సొచాయించి జెప్పు. గా నాలుగూళ్ల మీద జెర అనుమానంగుందిరా? మన పార్టీ బలంగున్నా, మనోళ్లే లోపల లోపల వేరే పార్టోళ్లకు సపోర్ట్ జేశిరని తెలిశింది. గదేం పద్ధతిరా? ఎంత వాళ్ల కులపోల్లయితే మాత్రం పార్టీని ముంచుతరంట వారా? ఏ జెప్పత్తలేదురా ఎవడెటేశిండో ఓటు..మనతోనే తిరుక్కుంటా మనకిందికే నీళ్లు తెచ్చిర్రంటవారా? అయినా మనకే గాదురా... వేరే పార్టోల్లగ్గూడా మంది మస్తుగచ్చింద్రు గదరా? పొద్దుగాల్ల మనతోని తిరిగింద్రు, మాపటీలి మందితోని తిరిగింద్రు...గీల్లంతా ఎవలకోటేశిరంటవురా? ఏడికివోయినా కడుపు గడుక్కున్నరు, జేబు నింపుకున్నరు. గీ జనం గిట్ల తయారైంద్రేందిరా? అయినా జనాన్ననుడు మన తప్పేరా, ఆల్లనట్ల తయారు జేసింది మనమేరా!

- ఊరగొండ మల్లేశం

గగన విహారం.. గగనమే!

చిన్నతనంలో గాలిమోటర్ సౌండ్ వినగానే అదో ఆనందం. ఎగిరి గంతులేసేవాళ్లం. ప్రతి ఒక్కరికీ ఒక్కసారైనా గాలిమోటర్ ఎక్కాలనేది ఆశ ఉంటుంది. కానీ ఈ విషయం విన్నాక గగన విహరం పేదోడికి గగనమే అని చెప్పాలి. తాజాగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దంపతులు వ్యక్తిగత విదేశీ (లండన్) పర్యటన నిమిత్తం బయలుదేరిన గాలిమోటర్ గురించి తెలుసుకున్న తర్వాత అది ఎక్కాలనే ఆశలు గల్లంతు కావడం మాత్రం ఖాయం! ఎందుకంటే ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన గాలిమోటరు. అందులో ఎనిమిది పడకలు మాత్రమే ఉంటాయి. దానికి కిరాయి గంటకు అక్షరాల రూ.12 లక్షలు అంటే నమ్ముతారా? నేను కూడా ముందు నమ్మలే. గూగుల్‌లో పరిశీలిస్తే చెప్పిందంతా నిజమే. ముఖ్యమంత్రి ప్రయాణానికి కొంత డబ్బు ప్రభుత్వం భరించినప్పటికీ మిగతాది సొంతంగా పెట్టుకోవాల్సిందే. అయితే ఇక్కడ చెప్పుకోవాల్సిందేమిటంటే, ఈ వార్త ఏపీలో బాగా వైరల్ అవుతున్నది. ఎన్నికల్లో బిజీబిజీగా గడిపిన జగన్... ఫలితాలొచ్చే వరకు విశ్రాంతిగా గడపాలని విదేశీ టూర్‌కు పయనమయ్యారు. చాలామంది పేదింటి బిడ్డ గాలిమోటర్‌లో లండన్ పోతున్నారంటూ సైటైర్లు వేస్తున్నారు. పాలన గాలి కొదిలేసి గాలి మోటర్‌లో చెక్కర్లు కొడుతున్నారని కామెంట్లు పెడుతున్నారు. లండన్‌కు నేరుగా విమానాలు ఉంటాయి కదా.. లగ్జరీ విమానం బుక్ చేసుకుని పోవడం అవసరమా? అని అంటున్నారు. గాలిమోటర్‌కు పెట్టే ఖర్చు కూడు, గూడు లేని పేదోళ్లకు పెడితే మంచి గుండని అనుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ గాలిమోటర్ కథ విన్న తర్వాత గీ పైసలు లేని జీవితాన గాలిమోటర్ ఎక్కుడు నాతోనై కాదనిపించింది.

-గుడిగ రఘు

ఫినాయిల్‌కి మహాగిరాకీ..

'సుక్కల్లోకెక్కినాడు సెందురూడు' అంటూ ప్రధాన రాజకీయపార్టీలన్నీ ఇప్పుడు ప్రశాంతంగా ఓ సొంగేసు కుంటున్నాయి. ఓట్ల పండగ అయిపాయే...రిజల్ట్ వచ్చాక ఓడినా, గెలిచినా చేసేదేం లేదు. గెలిస్తే ఏం సెప్పాలే... ఓడితే ఏం సెప్పాలే అనే దానిపై పెద్దసార్లు ఫుల్‌క్లారిటీతో ఇప్పటికే ముస్తాబై ఉన్నారు. ఓట్ల కోసం నాలిక మడతపెట్టి ఒకర్నొకరు తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టుకొని, ఇప్పుడు ఏం జరగనట్టు సైలెంట్‌గా ఎలా ఉన్నారబ్బా! అనే డౌటను మానం సహజమే. దీన్నే ఓ దోస్తుగాని దగ్గరంటే ..."ఓట్ల పండగ అయిన తెల్లారే ఆళ్లు ఫినాయిల్‌తో నోళ్లు కడిగేసుకున్నార్లే...నువ్వేం గుబులుపడకు బై" అని నొక్కివక్కాణించాడు. పైగా... ఇప్పుడాళ్లు సోంప్, ఇలాచీ, బెల్లం, పుదీనా కలిసి 'మీనాక్షి' పాన్ వేసుకొని మజాచేస్తు న్నార్లే...అని కూడా ముక్తాయింపు ఇచ్చాడు... నిజమేనంటారా?!!

- కెఎన్ హరి

బుగ్గ కారెక్కేదెవరో..!



క్యాబినెట్ విస్తరణపై పలువురి ఆశలు

- ప్రాతినిధ్యం లేని ఉమ్మడి జిల్లాలకు ఈసారి ప్రాధాన్యత
- సామాజిక తరగతులకు పెద్దపీట
- ఢిల్లీ పెద్దలతో ముఖ్యమంత్రి మంతనాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ తిరిగి చర్చనీయాంశంగా మారింది. ఈ విస్తరణపై కాంగ్రెస్‌లోని ఆశావహులు గంపెడాశలు పెట్టుకున్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారోనని ఎదురు చూస్తున్నారు. సీఎం కూడా త్వరలో క్యాబినెట్ విస్తరణపై మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయాలను తీసుకునే అవకాశం ఉన్నది. మంత్రివర్గ విస్తరణను స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయిన తర్వాత చేపడదామా? లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అనంతరం భర్తీ చేద్దామా? అనే అంశంపై ఆయన సమాలోచన చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసి పాలనపై ప్రభుత్వం ఫోకస్ పెట్టిన నేపథ్యంలో విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయనుందని సమాచారం.

ముఖ్యంగా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని ఉమ్మడి జిల్లాల నుంచి క్యాబినెట్ విస్తరణ కోసం ఒత్తిడి పెరుగుతున్నది. ఖాళీగా ఉన్న ఆరు బెర్తులను ఎప్పుడు భర్తీ చేస్తారోనని చాలా మంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలు పూర్తి కాగానే మంత్రివర్గ విస్తరణ ఉంటుందంటూ పార్టీ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో మంత్రి పదవి కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ సన్నాహాల్లో ఉన్నారు. కొత్త మంత్రివర్గ విస్తరణలో ప్రధానంగా బీసీ, అందులో ముఖ్యంగా ముదిరాజ్, మైనార్టీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించనున్నట్టు పార్టీలో జోరుగా చర్చ మొదలైంది.

ఆ ఆరుగురెవరు?

క్యాబినెట్ కూర్పులో ఉమ్మడి జిల్లాలు, సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకుని భర్తీ చేస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి పలుమార్లు చెప్పారు. ప్రస్తుతం సీఎంతో కలిపి 12 మంది మంత్రులున్నారు. నల్లగొండ, కరీంనగర్, వరంగల్ ఒక్కో జిల్లాలో ఇద్దరు చొప్పున మంత్రులుండగా, ఖమ్మం నుంచి ఏకంగా ముగ్గురికి ప్రాతినిధ్యం ఉన్నది. మెదక్‌లో ఒక్కరే ఉన్నారు. మహబూబ్‌నగర్‌కు సీఎంతోపాటు మరొక మంత్రి పదవి దక్కింది. ఇంకా మంత్రివర్గంలో ఆరుగురికి అవకాశం ఉన్నది. హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లేదు. ఈసారి ఆయా జిల్లాలకు అవకాశం కల్పిస్తూనే, సామాజిక వర్గాల వారీగా భర్తీ చేయనున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ వెంకటస్వామి, నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వాకాటి శ్రీహరిరావు (ముదిరాజ్), రంగారెడ్డి నుంచి వీరపల్లి శంకర్ (రజక), హైదరాబాద్ నుంచి అజరుద్దీన్ లేదా ఫిరోజ్‌ఖాన్‌కు బెర్తు దక్కే అవకాశం ఉందనే చర్చ కొనసాగుతున్నది. జిల్లాలో ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం లేకపోవడంతో ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రివర్గంలో అవకాశం కల్పించాలనే ఉద్దేశంలో సీఎం ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా మంత్రిపదవి ఆశిస్తున్నట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంటును గెలిపిస్తే ఆయనకు మంత్రిపదవి ఇస్తామంటూ హామీ ఇచ్చినట్టు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఆ స్థానానికి ఆయనే ఇన్‌చార్జీగా వ్యవహరించారు. అభ్యర్థి గెలుపు కోసం కోమటిరెడ్డి బ్రదర్స్ అహర్నిశలు కష్టపడి పని చేశారనే టాక్ వచ్చింది. ఈ క్రమంలో రాజగోపాల్‌రెడ్డి కూడా బెర్తు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఎం రేవంత్ ... ఢిల్లీ పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిసింది.

ఇంకెన్ని విషాద దృశ్యాలు చూడాల్సి వస్తుందో...?

కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరు దశాబ్దాల కన్నీటి దృశ్యాలను ఆర్నెల్ల కాంగ్రెస్ పాలనలో మళ్లీ చవిచూడాల్సి వస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ట్వీట్ చేశారు. పదేండ్లపాటు కనిపించని కరెంటు కోతలు ఇప్పుడు మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల ముట్టడులు, జనరేటర్ల మోతలు షురూ అయ్యాయని పేర్కొన్నారు. సాగునీరు లేక ఎండిన పంట పొలాలు, చుక్కనీరు లేక బోసిపోయిన చెరువులు, పాత అప్పులు కట్టాలంటూ రైతులకు నోటీసులు, రైతుబంధు కోసం నెలలపాటు ఎదురు చూపులు షరా మామూలయ్యాయని వాపోయారు. తడిసిన ధాన్యాన్ని కొనే దిక్కులేని దుస్థితిని చూస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల తర్వాత అన్నదాతల ఆత్మహత్యలను చూస్తున్నామని పేర్కొన్న ఆయన...ఇలాంటి విషాద దృశ్యాలను ఇంకెన్ని చూడాల్సి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేశారు.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులు, ఉద్యోగుల అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ రెసిడెన్షియల్ స్కూళ్లలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులు, ఉద్యోగుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.బాలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్ తదితరులు గురుకుల సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. సాధారణ బదిలీలు జూన్ నెలలో చేపట్టాలనీ, అర్హులకు వెంటనే పదోన్నతులు కల్పించాలనీ, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఆరు, పన్నెండు, పద్దెనిమిది, ఇరవై నాలుగు సంవత్సరాల ఆటోమేటిక్ అడ్వాన్స్ మెంట్ ఇంక్రిమెంట్‌లను విడుదల చేయాలనీ, 2022 వేసవి సెలవుల్లో పనిచేసిన జూనియర్ లెక్చరర్లకు సంపాదిత సెలవులు (ఈఎల్స్) మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బోటనీ, జువాలజీ జూనియర్ లెక్చరర్లను హై స్కూల్ తరగతుల బోధన నుంచి మినహాయించి వారికి ఇంటర్ తరగతులకే పరిమితం చేయాలని కోరారు. 2022 వేసవి సెలవుల్లో పనిచేసిన కాంట్రాక్టు ఉపాధ్యాయులకు నగదు భతి, డిగ్రీ కాలేజీల్లో ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వారికి ఎఫ్ఏసీ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ విరమణ చేయబోయే ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమాచార ఉత్తర్వులను 6 నెలల ముందే విడుదల చేయాలని సూచించారు.

రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

లైసెన్స్‌లు లేవు, నిబంధనలు పాటించడం లేదని గుర్తింపు

- పిజ్జాలు, బర్గర్లు, నూడుల్స్‌తోపాటు ఇతర వస్తువుల సీజ్
- గడువు తీరిన వస్తువుల వినియోగం
- రిఫ్రిజిరేట్స్‌లో కుళ్లిపోయిన ఆహార వస్తువులు







నవతెలంగాణ-సిటీబ్యూరో/బంజారాహిల్స్

ప్రజారోగ్యాన్ని పట్టించుకోకుండా, సంపాదనే ధ్యేయంగా నగరంలో కొందరు రెస్టారెంట్లను నడుపుతున్నారు. రసాయనాలతో పండ్లు మగ్గపెట్టడంతోపాటు కాలం చెల్లించిన ఆహార వస్తువులను విక్రయిస్తున్నారు. మరికొందరు ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా రెస్టారెంట్స్, హోటళ్ల నిర్వహిస్తున్నారు. ఇలాంటి వారిపై ఎఫ్ఎస్ఎస్ఏఐ టాస్క్‌ఫోర్సు బృందాలు ప్రత్యేక దృష్టి సారించాయి. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం ప్రత్యేక దాడులు నిర్వహించారు. ప్రతి రెస్టారెంట్‌లో అపరిశుభ్రమైన వస్తువులు, వంటగది, నాసిరకపు మసాలా, కారం పొడులను అధికారులు గుర్తించారు. వంట గదుల్లో ఈగలు, క్రిమికీటకాలు తిరుగుతున్నాయి. కాలం చెల్లిన ఆహార వస్తువులను ఉపయోగిస్తున్నారు. తెరిచిన డస్ట్‌బిన్స్‌ను గుర్తించారు. రిఫ్రిజిరేటర్లలో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న చికెన్, మటన్, అల్లం పేస్ట్‌తోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న హెూటళ్లు, రెస్టారెంట్లను గుర్తించిన అధికారులు కేసులు నమోదు చేశారు.

సోమాజిగూడలోని కృతుంగ-పాలెగార్స్ రెస్టారెంట్‌లో కాలం చెల్లిన పనీర్, ఇతర వస్తువులను ఉపయోగిస్తున్నట్టు గుర్తించారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా నిర్వహించడమే కాకుండా.. రసాయనాలతో తయారు చేసిన వస్తువులు, కాలం చెల్లిన ప్రముఖ కంపెనీల పేస్ట్‌లు ఉపయోగించడాన్ని పరిశీలించారు. కృతుంగ పాలెగార్ బ్రాండ్‌తో అందిస్తున్న వాటర్‌బాటిళ్లను సీజ్ చేశారు. సిట్రిక్ యాసిడ్‌తో ప్యాక్ చేసిన వాటిని సీజ్ చేసిన అధికారులు.. పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. అలాగే, హెడ్‌క్వార్టర్స్ రెస్ట్ -ఓ-బార్‌ను తనిఖీ చేశారు. కాలం చెల్లిన పిజ్జాలు, బర్గర్స్, నూడుల్స్‌ను గుర్తించారు. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసిన శాఖాహారం, మాంసా ఆహార వస్తువులను, కాలం చెల్లిన, లేబుల్స్ లేని వాటిని గుర్తించారు. కేఎఫ్‌సీలో సైతం దాడులు నిర్వహించిన అధికారులు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌ను చూపించకపోవడంతో వారిపై చర్యలు తీసుకున్నారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రెస్టారెంట్స్, హోటళ్ల ఇతర వ్యాపార సముదాయాలపై దాడులు కొనసాగిస్తామని ఫుడ్‌సేఫ్టీ అధికారులు తెలిపారు. లైసెన్స్‌లు.. ఆహార పదార్థాల నాణ్యత లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చేప పిల్లల పంపిణీపై సందిగ్ధం..!

- స్పష్టత కరువు..రాని ఆదేశాలు
- ఊసేలేని టెండర్ల ప్రక్రియ
- గతేడాది ఏప్రిల్‌లోనే పూర్తి
- ఎదురు చూస్తున్న మత్స్యకారులు



నవతెలంగాణ- సిటీబ్యూరో

మత్స్యకారుల అభివృద్ధికి గత ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలేందుకు ప్రతి ఏడాదీ ఏప్రిల్ నెలలో టెండర్ల ప్రక్రియ ప్రారంభించేది. సర్కార్ మారడం, వరుస ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఈ కార్యక్రమంపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. ప్రస్తుతం మే నెల వచ్చినప్పటికీ ఇంకా టెండర్లు పిలవకపోవడంతో చేప పిల్లల పంపిణీపై నీలినీడలు అలుముకున్నాయి. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి చేప పిల్లలను పంపిణీ చేస్తారా..? లేదా..? అనే సందిగ్ధం నెలకొంది. చేప పిల్లల పంపిణీకి బదులు నగదు బదిలీ చేయాలని గతేడాది నుంచే మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల్లో మొత్తం నీటి వనరులు ఉన్న చెరువులు, కుంటలు 400 వరకు ఉంటాయి. చెరువులన్నీ అనుకూలంగా లేకపోవడంతో గతేడాది 332 చెరువుల్లో దాదాపు రూ.40 లక్షల విలువగల 68.05 లక్షల చేప పిల్లలను వదిలారు. ఇందులో 35 ఎంఎం సైజ్ సీడ్ చేపలు 58 వేలు, 40 ఎంఎం సైజ్ సీడ్ చేపలు లక్ష, 80 ఎంఎం సైజ్ సీడ్ చేపలు లక్షా 60 వేలు, 100 ఎంఎం సైజ్ సీడ్ చేపలు లక్ష ఉన్నాయి. జిల్లాలో మొత్తం 82 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 3,738 మంది సభ్యులు ఉన్నారు. ఈ సభ్యుల కుటుంబాలన్నీ చేప పిల్లల పంపిణీపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ది పొందుతున్నాయి. జిల్లాల్లో ఏటా జులై తర్వాత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించేవారు. అప్పటి వరకు వర్షాలు పుష్కలంగా కురిసి చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉంటుంది. అయితే ఈ సమయంలో చేప పిల్లలను వదిలితే అవి బాగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఈ ఏడాది మే నెల ముగుస్తున్నా.. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాకపోవడంతో చేప పిల్లలను పంపిణీ చేస్తారా..? లేదా..? అన్న సందేహం మత్స్యకారుల్లో ఉంది.

టెండర్ల ఊసే లేదు

ప్రతి ఏడాదీ మే నెలలోనే చేప పిల్లల కొనుగోలు కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచేది. జూన్, జులై నెలల్లో వర్షాలు కురిసి చెరువుల్లో నీరు చేరాక ఆగస్టులో మత్స్యకారులకు వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేసేవారు. ఈ ఏడాది మే నెల పూర్తి కావస్తున్నా.. నేటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ప్రభుత్వం ఈ కార్యక్రమం ఊసే ఎత్తడం లేదు. చేప పిల్లల కొనుగోలుకు ఇప్పటికే టెండర్లు పిలవాల్సి ఉన్నా.. ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. చేప పిల్లల పంపిణీ కోసం మత్స్యకారులు వేయి కండ్లతో ఎదురు చూస్తున్నారు.

నగదు బదిలీకి డిమాండ్..!

రాష్ట్రంలోని కొన్ని ఏరియాల్లో చేప పిల్లలను సెప్టెంబర్ నుంచి నవంబర్ నెల వరకు కూడా పంపిణీ చేస్తున్నారని, ఇలా చేయడం వల్ల చేప పిల్లలు ఎదగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని ఏరియాల్లో కాంట్రాక్టర్లు నాసిరకం చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారని, అది కూడా సక్రమంగా పూర్తిస్థాయిలో అందజేయడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. ఆలస్యంగా పంపిణీ చేయడంతో చేప పిల్లల్లో ఎదుగుదల కనిపించకపోవడంతో తాము నష్టపోతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ఉచిత చేప పిల్లలకు బదులుగా నగదు బదిలీ పథకాన్ని చేపట్టాలని కోరుతున్నారు. నగదును మత్స్యసహకార సొసైటీలకు ఇస్తే.. తామే నాణ్యమైన చేప పిల్లలను కొనుగోలు చేసి సరైన సమయంలో చెరువుల్లో వదులుతాం అని అంటున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు
పూర్ణిమ, మత్స్యశాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా



ఉచిత చేప పిల్లల పంపిణీ గురించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు. గతేడాది మే నెలలోనే టెండర్ల ప్రక్రియ చేపట్టాం. ప్రభుత్వం నుంచి అధికారికంగా ఆదేశాలు వస్తే వెంటనే ప్రక్రియ ప్రారంభిస్తాం. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తుంది. దీని ఆధారంగా జిల్లా స్థాయిలో టెండర్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుంది.

ఏడో దశలో 908 మంది అభ్యర్థులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
సార్వత్రిక ఎన్నికలు ముగింపు దశకు వచ్చాయి. జూన్ 1న జరగబోయే ఏడో దశలో ఎనిమిది రాష్ట్రాల్లో 57 స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 908 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ మేరకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. 57 స్థానాలకు మొత్తం 2,105 నామినేషన్లు దాఖలు కాగా, 954 నామినేషన్లు మాత్రమే ఆమోదం పొందాయి. నామినేషన్లు ఉపసంహరణ తరువాత 908 నామినేషన్లు మిగిలి ఉన్నాయి. పంజాబ్(13)లో 328, ఉత్తరప్రదేశ్(13)లో 144, బీహార్(8)లో 134, పశ్చిమ బెంగాల్(9)లో 124, ఒరిస్సా(6)లో 66, జార్ఖండ్(3)లో 52, హిమాచల్ ప్రదేశ్(4)లో 37, చండీగఢ్(1)లో 19 మంది బరిలో ఉన్నారు.

జూన్ 2 వేడుకలకు కేసీఆర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ-హైదరబాద్‌బ్యూరో
తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకలకు మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు (కేసీఆర్)ను ఆహ్వానించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆయన మాజీ ముఖ్యమంత్రితో పాటు ప్రతిపక్షనేతగా కూడా ఉండటంతో ప్రోటోకాల్ ప్రకారం ఆయనకు ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నారు. జూన్ 2న జరిగే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ హాజరవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ ఆ వేడుకలకు హాజరు అవుతారా...లేదా అనేదానిపై చర్చ జరుగుతున్నది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన తొలి శాసనసభాపక్ష సమావేశాలకు కేసీఆర్ హాజరుకాని విషయం తెలిసిందే. ఆయన కాలి తుంటి విరిగి ఆస్పత్రిలో ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వెళ్లి ఆయన్ని పరామర్శించడం మినహా ఇప్పటి వరకు కేసీఆర్-రేవంత్ ముఖాముఖి ఎదురుపడిన సందర్భాలు లేవు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో రాజకీయాలకు అతీతంగా హాజరుకావడం పరస్పర గౌరవానికి సంబంధించిన అంశమనీ, దానిలో భాగంగానే ప్రధాని మోడీ నిర్వహించిన అధికారిక సభకు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారని గుర్తుచేస్తున్నారు. ఆవిర్భావ వేడుకలకు కేసీఆర్ హాజరైతే హుందాగా ఉంటుందనీ, లేనిపక్షంలో ఆయనే ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇకపై టీజీఎస్ఆర్టీసీ

(మొదటిపేజీ తరువాయి)
పేర్లను gsrtcmdoffice@tgsrtchగా మార్చింది. ప్రజలు తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులను పేరు మార్చిన ఖాతాల ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఇదే పేరుతో ఉన్న అధికారిక 'ఎక్స్'ను ఫాలో కావాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే అన్ని ఆర్టీసీ డిపోల పేర్లనూ టీజీఎస్‌గా మారుస్తామని తెలిపారు.

పర్సా నుంచి ఎంతో నేర్చుకోవాలి

- టీయూ నిర్మాణంలో పత్రిక ప్రాధాన్యతను గుర్తించాలి : సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో పర్సా తొమ్మిదో వర్థంతి సభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
జీవితాంతం ట్రేడ్ యూనియన్ నిర్మాణం కోసం పనిచేసిన పర్సా సత్యనారాయణ జీవితం నుంచి కార్మికవర్గం ఎంతో నేర్చుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో పర్సా సత్యనారాయణ తొమ్మిదో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వీరయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ..సింగరేణిలో పర్సా కోల్ కార్మికునిగా పనిచేసేవారనీ, నిజాం కాలంలోనే సింగరేణిలో యూనియన్ పెట్టేందుకు యత్నించి తన ఉద్యోగం కోల్పోయారని గుర్తుచేశారు. తన ఉద్యోగం గురించి ప్రయత్నించకుండా ట్రేడ్ యూనియన్ నిర్మాణం కోసం కృషి చేశారని కొనియాడారు. నిజాం కాలంలోనే ఆయన కమ్యూనిస్టుగా ఉండాలనుకోవడం చిన్న విషయం కాదన్నారు. సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులుగా పనిచేశారన్నారు. పర్సా, నండూరి సూచనలు ఉద్యమ నిర్మాణంలో ఎంతో దోహదపడేవన్నారు. కార్మిక లోకం పత్రిక ను నిర్విరామంగా తీసుకురావడానికి పర్సా తన చివర క్షణం వరకు తపనపడ్డారని కొనియాడారు. ఒక పత్రిక కోసం అంతలా వెంటపడి పని చేసిన వ్యక్తిని తానెక్కడా చూడలేదన్నారు. పత్రికల ప్రాధాన్యతను గుర్తెరిగి టీయూ నాయకులు ముందుకు సాగాలన్నారు. యూనియన్ పెట్టేందుకు ఆనాడు ఉన్నట్టుగానే ఈనాడు కూడా పరీక్షా సమయమేనని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ..ట్రేడ్ యూనియన్ నిర్మాణంలో పర్సా కీలక పాత్ర పోషించారన్నారు. ఎమ్మెల్యేగా ఉండి కూడా సాధారణ జీవితం గడిపిన ఆయన నిరాడంబరత నేటి తరానికి ఆచరణీయమన్నారు. ఆయన గొప్ప ఆలోచనాపరుడనీ, విజ్ఞాన వంతుడని కొనియాడారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, కె.ఈశ్వర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కాసు మాధవి, వై.సోమన్న, పి.సుధాకర్, ఎ.సునీత,నాయకులు సుభాశ్, భారతి, సందీప్, అనిల్ ఉన్నారు.

ఓబీసీ సర్టిఫికెట్లు చెల్లవు

(మొదటిపేజీ తరువాయి)
నియామక కుంభకోణం కేసులో 26వేల మంది టీచర్ల ఉద్యోగాలను కలకత్తా హైకోర్టు రద్దు చేసిన విషయం విదితమే.
2012 నాటి పశ్చిమబెంగాల్ వెనకబడిన వర్గాల చట్టంలోని కొన్ని నిబంధనలు చట్టవిరుద్ధంగా ఉన్నాయంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం.. 2010-12 మధ్య రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ వర్గీకరణలుగా పేర్కొన్న 42 క్లాసులను కొట్టివేస్తున్నట్టు వెల్లడించింది. ఆ వర్గీకరణలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని స్పష్టంచేసింది. అందువల్ల 2010 తర్వాత ఈ క్లాసుల కింద జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లన్నింటిని రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. 1993 నాటి వెనకబడిన వర్గాల చట్టానికి అనుగుణంగా కొత్త ఓబీసీ జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అయితే, ఈ క్లాసులతో జారీ అయిన ఓబీసీ ధ్రువపత్రాలతో ఇప్పటికే ప్రయోజనాలు పొందుతున్నవారు, ఆ రిజర్వేషన్ల కింద ఉద్యోగాలు చేస్తున్నవారిపై ఈ తీర్పు ఎలాంటి ప్రభావం చూపదని న్యాయస్థానం వెల్లడించింది.

తీర్పుపై మమత అసహనం..

హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసహనం వ్యక్తం చేశారు. "ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించి బిల్లు తీసుకొచ్చాం. రాజ్యాంగానికి లోబడి తీసుకొచ్చిన ఈ బిల్లును శాసనసభ ఆమోదించింది. ఇప్పుడు బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దీన్ని నిలిపి వేయాలని కుట్ర పన్నింది. ఈ తీర్పును మేం అంగీకరించబోం. ఓబీసీ రిజర్వేషన్లు కొనసాగుతాయి" అని మమత స్పష్టంచేశారు.

ఆరో దశలో ఎవరికి మొగ్గు?



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
దేశంలో సార్వత్రిక ఎన్నికల సమరం చివరి దశకు చేరుకుంది. మెజార్టీ నియోజకవర్గాల్లో పోలింగ్ ముగిసింది. ఈ నెల 25న ఆరో దశ, జూన్ 1న ఏడో దశ పోలింగ్‌తో దేశంలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. మొత్తం ఏడు దశల ఎన్నికలకు.. ఐదు దశల పోలింగ్ ముగిసింది. ఆరో విడత పోలింగ్ ఈ నెల 25 (శనివారం)న నిర్వహించనున్నారు. ఏడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 57 లోక్‌సభ స్థానాలకు జరగనున్న ఎన్నికల సమరంలో 889 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దేశ రాజధానిలో ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలతో పాటు హర్యానాలోని 10 లోక్‌సభ స్థానాలకు ఆరో విడతలో పోలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఈ 57 లోక్‌సభ నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో ఎక్కువ సీట్లను ఎన్డీయే కూటమి గెలచుకుంది. అధికారంలోకి రావాలని పట్టుదలతో ఉన్న ఇండియా ఫోరం ఈ 57 స్థానాల్లో మెజార్టీ సీట్లు గెలుచుకుంటేనే అధికారానికి దగ్గరయ్యే ఛాన్స్ ఉంటుంది. గత ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించిన బీజేపీని ఓడించి, ఇండియా ఫోరం తన సత్తా చాటితే కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ ఫిగర్‌కు చేరుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
ఆరో దశ ఎన్నికలు జరగనున్న 57 లోక్‌సభ స్థానాల్లో 2019లో కాంగ్రెస్ ఒక్క సీటు గెలుచుకోలేదు. ఈసారి అధికారంలోకి రావాలంటే ఇండియా ఫోరం ఖాతా తెరవడమే కాకుండా బీజేపీ గతంలో గెలిచిన సీట్ల సంఖ్యను తగ్గించి, మెజార్టీ సీట్లను సాధించుకోవాల్సి ఉంది. ప్రధాని మోడీ హ్యాట్రిక్ కొట్టాలంటే మరోసారి ఈ 57 నియోజక వర్గాల్లో తన అధిపత్యాన్ని కొనసాగించాల్సి ఉంటుంది. మరోవైపు ప్రాంతీయ పార్టీలకు ఆరో దశ ఎన్నికలు అగ్ని పరీక్ష కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆరో దశలో ఎవరు అధిపత్యం కనబరుస్తారనేది ఆసక్తికరంగా మారింది.

ఆరో దశలో ఎక్కడెక్కడ ఎన్ని స్థానాలు?

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆరో దశలో 7 రాష్ట్రాలతో పాటు ఢిల్లీ ఎన్నికలున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 14, బీహార్‌లో ఎనిమిది, హర్యానాలో పది, ఢిల్లీలో ఏడు, పశ్చిమ బెంగాల్‌లో ఎనిమిది, జార్ఖండ్‌లో నాలుగు, ఒరిస్సాలో ఆరు స్థానాలకు పోలింగ్ జరగనుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ 57 లోక్‌సభ స్థానాల్లో 40 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. బీఎస్పీ నాలుగు, టీఎంసీ మూడు, బీజేడీ 4, జేడీయూ మూడు, ఎల్‌జేపీ ఒకటి, ఏజేఎస్‌యూ ఒక స్థానంలో విజయం సాధించాయి. ఎస్పీ కూడా ఒక్క సీటు గెలుచుకుంది. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, ఆర్జేడి వంటి పార్టీలు తమ ఖాతాను తెరవలేకపోయాయి. హర్యానా, ఢిల్లీలో బీజేపీ క్లీన్ స్వీప్ చేసింది. ఈసారి ఢిల్లీ, హర్యానాలో బీజేపీకి సీట్లు తగ్గే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. గతంలో సాధించిన 40 సీట్లను గెలుచుకునేందుకు బీజేపీ సైతం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఆరో దశలలో ఎక్కువ సీట్లు ఎవరు గెలుస్తారనేది ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

మెజార్టీ సీట్ల కోసం పార్టీల ప్రయత్నాలు?

బీజేపీని కట్టడిచేసేందుకు ఇండియా కూటమి తీవ్రంగా శ్రమిస్తోంది. బీజేపీకి 200 సీట్లు దాటకుండా చేయాలని గట్టి ప్రయత్నం చేస్తోంది. ఇప్పటివరకు జరిగిన ఐదు దశల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రదర్శన సంతృప్తికరంగా ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరో దశ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో ఎవరి బలం ఎంత?

యూపీలో గట్టి పోటీ

ఆరో దశలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లో సుల్తాన్‌పూర్, ప్రతాప్‌గఢ్, ఫుల్‌పూర్, ప్రయాగ్‌రాజ్, అంబేద్కర్‌నగర్, శ్రస్తీ, దుమ్రియాగంజ్, బస్తీ, సంత్ కబీర్‌నగర్, లాల్‌గంజ్, జాన్‌పూర్, అజంగఢ్, ఫిష్ సిటీ, భదోహి లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2019లో బీజేపీ 9 సీట్లు, బీఎస్పీ 4, ఎస్పీ ఒక సీటు గెలుచుకున్నాయి. గత ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ కలిసి పోటీ చేయగా.. ఈసారి కాంగ్రెస్, ఎస్పీ కలిసి పోటీచేస్తున్నాయి. బీఎస్పీ ఒంటరిగానే బరిలోకి దిగింది. ఎస్పీ ఈసారి కొత్త సమీకరణంతో ఎన్నికల బరిలోకి దిగింది. అఖిలేష్ యాదవ్ ఈసారి దళిత, ఓబీసీ ఓటర్లపై ఫోకస్ పెట్టారు. ఈ వర్గాల ఓట్లను పొందడం ద్వారా యూపీలో బీజేపీ స్పీడ్‌కు బ్రేకులు వేయాలనే ఆలోచనలో అఖిలేష్ ఉన్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికల్లో గెలిచిన సీట్లను తిరిగి సాధించడం బీఎస్పీకి అతిపెద్ద సవాల్ కానుంది. ఇండియా ఫోరం, ఎన్డీయే కూటమి మధ్య హోరాహోరీగా సాగుతున్న పోరులో బీఎస్పీ ఎలాంటి ప్రభావం చూపిస్తుందనేది ఆసక్తి రేపుతోంది.

బీహార్, జార్ఖండ్‌లో పరిస్థితి

బీహార్‌లోని వాల్మీకి నగర్, పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, శివర్, వైశాలి, గోపాల్‌గంజ్, మహారాజ్‌గంజ్, సివాన్ స్థానాలకు ఆరో దశలో ఎన్నికలు జరగనున్నాయి. 2019లో బీజేపీ నాలుగు, జేడీయూ మూడు, ఎల్‌జేపీ ఒక సీటు గెలుచుకున్నాయి. ఆర్జేడి, కాంగ్రెస్ ఈ స్థానాల్లో తమ ఖాతాను తెరవలేకపోయాయి. ఈసారి పోటీ భిన్నంగా ఉన్నట్టు తెలుస్తోంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్డీయేకు తమ సీట్లు కాపాడుకోవడం పెద్ద సవాల్‌గా మారింది. జార్ఖండ్‌లోని గిరిడి, ధన్‌బాద్, రాంచీ, జంషెడ్‌పూర్ స్థానాలకు ఆరో దశలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నాలుగు నియోజకవర్గాల్లో ఎన్డీయే, ఇండియా ఫోరం మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

బెంగాల్, ఒరిస్సాలో బలాబలాలు

పశ్చిమ బెంగాల్‌లోని ఎనిమిది లోక్‌సభ స్థానాలకు, ఒరిస్సాలోని ఆరు లోక్‌సభ స్థానాలకు ఆరో దశలో ఎన్నికలు జరగనున్నాయి. బెంగాల్‌లోని తమ్లుక్, కాంతి, ఘటల్, ఝర్‌గ్రామ్, మెదీన్పూర్, పుర్లియా, బంకురా, బిష్ణుపూర్ స్థానాలకు మే 25న పోలింగ్ జరగనుంది. 2019లో ఈ ఎనిమిది సీట్లలో బీజేపీ ఐదు సీట్లు గెలుచుకోగా, టీఎంసీ మూడు సీట్లు గెలుచుకుంది. ఒరిస్సాలోని సంబల్‌పూర్, కెంజోర్, ఢెంకనల్, కటక్, పూరి, భువనేశ్వర్ లోక్‌సభ స్థానాలున్నాయి. 2019 ఎన్నికల్లో బీజేపీ రెండు సీట్లు గెలుచుకోగా, బీజేడీ నాలుగు సీట్లు గెలుపొందింది. ఈ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, ఒరిస్సా రెండింటిలోనూ కమలం పార్టీ తన సీట్లను గతంతో పోలిస్తే పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. బెంగాల్‌లో బీజేపీ, టీఎంసీతో ఇండియా ఫోరం, ఒరిస్సాలో బీజేపీ, బీజేడీతో ఇండియా ఫోరం ప్రధాన పోటీని ఎదుర్కొంటుంది.

ఢిల్లీ, హర్యానాలో ఎలా ఉంది?

ఆరో దశలో ఢిల్లీలోని మొత్తం ఏడు లోక్‌సభ స్థానాలు, హర్యానాలోని మొత్తం పది లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2014, 2019 ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలను బీజేపీ గెలుచుకుంది. ఈసారి ఆమ్ ఆద్మీ కాంగ్రెస్ కలిసి ఎన్నికల బరిలోకి దిగాయి. దీంతో మరోసారి ఢిల్లీలో క్లీన్ స్వీప్ చేయడం బీజేపీకి కష్టతరంగా మారింది. ఆ పార్టీలో ఏడుగురు సిట్టింగ్ ఎంపీల్లో ఆరుగురికి టికెట్లు నిరకారించింది. వారి స్థానంలో కొత్త అభ్యర్థులను రంగంలోకి దింపింది. నార్త్ ఈస్ట్ ఢిల్లీ ఎంపీ మనోజ్ తివారీకి మాత్రమే తిరిగి టికెట్ కేటాయించింది. అయితే ఈ స్థానంలో కాంగ్రెస్ కన్హయ్య కుమార్‌ను రంగంలోకి దించడం ద్వారా పోటీని ఆసక్తికరంగా మార్చింది. ఢిల్లీలోని ఏడు స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ నాలుగు స్థానాల్లో, కాంగ్రెస్ మూడు స్థానాల్లో పోటీ చేస్తోంది.

బొబ్బలొస్తున్నాయి..!

(మొదటిపేజీ తరువాయి)
రూ.20 కోట్లా 89 లక్షల వేతనాలు చెల్లించినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

పని భారం పెంపు.. వేతనాల్లో కోతలు

'పెంచింది మూరెడు.. మోపింది బారెడు' అన్నచందంగా ప్రభుత్వం కూలీలపై పని భారం రెండింతలు పెంచింది. ప్రభుత్వం ఉపాధి కూలి రేటు గతేడాది కంటే రూ.28 పెంచుతూ రూ. 300 చేసింది. గతంలో ఒక్కరికి.. పని కొలతల పొడవు 2 మీటర్లు, వెడల్పు 1 మీటరు, లోతు 1 ఫీటు కేటాయించేవారు. ప్రస్తుతం ఈ కొలతలను అమాంతం రెండింతలు చేసింది. పొడవు 4.50 మీటర్లు, వెడల్పు 1.80 మీటర్లు, లోతు 1 ఫీటుగా కొలతలు పెంచారు. దీంతో కూలీలపై పని భారం పెరిగింది. పెంచిన కొలతలు పూర్తి చేస్తేనే పూర్తి స్థాయి కూలి రూ. 300 వస్తోంది. ప్రస్తుత పరిస్థితిలో ప్రభుత్వం కేటాయించిన కొలతల ప్రకారం ఒక రోజులో పని పూర్తి చేయడం కష్టమవుతుందని కూలీలు వాపోతు న్నారు. ప్రభుత్వం కూలి పెంచామని గొప్పలు చెప్పుకోవడం తప్ప కూలీల బతుకులు మార్చింది ఏమీ లేదని వాపోతున్నారు. పొద్దంతా పని చేసినా ఫలితం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'మంచాల మండలంలోని నోముల గ్రామ పంచాయతీ పరిధిలో 367 జాబ్ కార్డులున్నాయి. ఇందులో 270 మంది కూలీలు ఉపాధి హామీ పనికి హాజర వుతున్నారు. అయితే ఇక్కడ రెండు నెలలుగా భూమి చదును చేసే పనులు చేపడుతున్నారు. భూములు గట్టిబారి ఉండటంతో చేతులు బొబ్బలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. పొద్దంతా తవ్వినా.. కొలతల ప్రకారం పూర్తి చేయడం కష్టమవుతుందని కూలీలు వాపోతున్నారు. ఎంత కష్టం చేసినా గదే వేతనం ఇస్తున్నారని కూలీలు వాపోతున్నారు. పని ప్రదేశంలో ప్రమాదశాత్తు ఏమైనా జరిగినా పట్టించుకునే దిక్కులేరని ఆందోళన చెందుతున్నారు. కనీసం తాగునీటి సదుపాయం కూడా లేక తాగునీటి కోసం నానా తిప్పలు పడుతున్నామని వాపోయారు. ఉపాధి కూలీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలపై పనిభారం తగ్గించి, పూర్తి స్థాయి వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. పాత కొలతల పద్ధతినే కొనసాగించాలని, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించి, కూలీలను ప్రమాదాల నుంచి కాపాడాలని ఉపాధి హామీ కూలీ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

రెక్కలు పోతున్నయ్ పైసలొస్తలేవ్- గంట పద్మ, ఉపాధి కూలి నోముల గ్రామం

మండుటెండలో చేతులు బొబ్బలు వస్తున్నా పొట్టకూటి కోసం తిప్పలు పడుతున్నాం. అయినా ఫలితం లేదు. పొద్దంతా చేస్తే గవ్వే నూటయాభై ఇస్తుంద్రు. వారం మొత్తంలో వెయ్యి కూడా వచ్చేట్టు లేవు. బయట పనిచేద్దామంటే పని దొరకకపాయే. ఇంటి కాడ ఉంటే పూటగడువక పాయే.. సర్కారు పనికొస్తే కూలి ఇవ్వకపాయే.. మా బతుకులు తెల్లారెదెట్లా.. ప్రభుత్వం మా గోస చూసైనా పూర్తి స్థాయి వేతనం చెల్లించాలి.

అందరికీ పూర్తి వేతనం వచ్చేలా ప్రయత్నిస్తున్నాం- శ్రీలత, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి

ప్రతి ఒక్కరికి పూర్తి వేతనం వచ్చేలా ప్రయత్నం చేస్తున్నాం. వేతనాలు పెండింగ్ లేకుండా చూస్తున్నాం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మే 13 వరకు జిల్లాలో పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లించాం. పెండింగ్ ఏమీ లేదు.

ఆర్టీసీ దొంగదెబ్బ!

- డైనమిక్ చార్జీలంటూ టిక్కెట్‌రేట్ల పెంపు
- సూపర్‌లగ్జరీ, డీలక్స్ బస్సులకూ వర్తింపు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రయాణీకులపై దొంగదెబ్బ తీసింది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సు చార్జీలను పెంచేసింది. దీనితో ప్రయాణీకులు భగ్గుమంటున్నారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అని చెప్పి, పురుషుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే హైదరాబాద్ నుంచి వరంగల్‌కు సూపర్ లగ్జరీ బస్సులో సాధారణ టిక్కెట్ చార్జీ రూ.245 మాత్రమే. కానీ రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ముగియగానే ప్రజలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో వస్తారని అంచనా వేసిన టీఎస్ఆర్టీసీ, ఇప్పటి వరకు బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం వంటి అంతర్రాష్ట్ర సర్వీసుల్లో అమలు చేసే 'డైనమిక్ టిక్కెట్' విధానాన్ని సప్పుడు లేకుండా సూపర్ లగ్జరీ బస్సుల్లో అమల్లోకి తెచ్చారు. దీనితో హైదరాబాద్ నుంచి హన్మకొండకు వెళ్లే బస్సు టిక్కెట్ ధర ఏకంగా రూ.350కి పెరిగింది. ప్రయాణీకులు ఈ టిక్కెట్లను సోషల్ మీడియాలో పెట్టి 'ఇదీ గుంపు మేస్త్రి దోపిడీ' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ట్రోల్ చేస్తున్నారు. దీనికి ప్రతిపక్షాల విమర్శలు తోడై, ఇప్పుడీ అంశం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఆర్టీసీ అధికారులు వివరణ ఇచ్చేందుకు నిరాకరించారు. అయితే డైనమిక్ బస్సు చార్జీలు అమలు చేస్తామని గతంలో టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ప్రకటించారు. అయితే వాటిని సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులకు వర్తించవని చెప్పారు. వోల్వో, గరుడ, రాజధాని వంటి దూరప్రాంత బస్సుల్లోనే అమల్లో ఉంటాయని తెలిపారు. డైనమిక్ చార్జీలు అంటే... రద్దీని బట్టి విమాన టిక్కెట్ల రేట్లను ఎలాగైతే పెంచుతారో, అదే విధానాన్ని ఆర్టీసీ బస్సుల్లోనూ అమలు చేయడం. రద్దీ లేని సమయంలో టిక్కెట్ రేట్లను తగ్గిస్తారు. గతంలో సంక్రాంతి సెలవుల్లో మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో ఒకటిన్నర రెట్లు చార్జీ వసూలు చేసేవారు. ఆ తర్వాత దాన్ని ఎత్తేసి, సెలవురోజుల్లోనూ పాత టిక్కెట్ చార్జీలే వసూలు చేస్తామని ప్రకటించారు. తాజాగా 'మహాలక్ష్మి' పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి తెచ్చారు. దీనితో ఆర్టీసీ బస్సుల్లో రోజువారీ కలెక్షన్లు తగ్గిపోయాయి. కొన్ని చోట్ల డీజిల్ చార్జీలు కూడా వసూలు కావట్లేదని కండక్టర్లు మొత్తుకుంటున్నారు. దీనితో బస్సెక్కే పురుషుల నుంచే టిక్కెట్ రేట్లు పెంచి వసూలు చేయాలని ఆర్టీసీ నిర్ణయించినట్టు ఉందనే చర్చ ప్రయాణీకుల్లో జరుగుతుంది.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు

పెన్నా అనంతరామశర్మ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)
తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. వీఎస్, మల్లు స్వరాజ్యం, నర్రా రాఘవరెడ్డి లాంటి ఉద్దండులతో కలిసి నల్లగొండ జిల్లాలో సీపీఐ(ఎం) విస్తరణ కోసం ఆయన చేసిన కృషిని మననం చేసుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ల కోసం చివరి వరకు కొట్లాడారనీ, ఆ సంఘం కన్వీనర్‌గా కూడా పనిచేశారని గుర్తుచేశారు. చివరి వరకు నమ్ముకున్న కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని కొనియాడారు. సీపీఐ(ఎం) నల్లగొండ డివిజన్ కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన మరణం తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

కార్మికవర్గానికి తీరని లోటు : సీఐటీయూ

సీఐటీయూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ ఉపాధ్యక్షులు పెన్నా అనంతరామ శర్మ మృతికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఆయన మృతి కార్మిక వర్గానికి తీరని లోటని పేర్కొంది. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది.
సంతాపం తెలిపిన వారిలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, సీనియర్ నాయకులు పి.రాజారావు, మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్.సుధాభాస్కర్, సీఐటీయూ ఆఫీస్‌బేరర్లు ఉన్నారు. సీఐటీయూ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి ఏపీ ఉపాధ్యక్షులుగా, ఆలిండియా వర్కింగ్ కమిటీ సభ్యులుగా ట్రేడ్ యూనియన్ విస్తరణకు శర్మ ఎంతో కృషి చేశారని గుర్తుకు చేసుకున్నారు. అనంతరామ శర్మ చిన్నప్పటి నుంచే ప్రగతిశీల భావాలతో పెరిగారనీ, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూ కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన మార్గదర్శకత్వంలో ఎదిగిన కార్యకర్తలే నేడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రధాన నాయకత్వ బాధ్యతల్లో ఉన్నారని గుర్తుచేశారు.

పిల్లలు.. పిడుగుల్లై మెరిశారు



- ముగిసిన తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంప్

నవతెలంగాణ-ముషీరాబాద్
హాలిడేస్‌లో తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంప్‌నకు సంతోషంగా వచ్చిన పిల్లలు.. ఎంతో విజ్ఞానం, నైపుణ్యం సాధించి పిడుగుల్లా మెరిశారని వక్తలు అన్నారు. లేడి పిల్లలుగా ఎగిరి గంతులేశారని, విజ్ఞానం వినోదంతోపాటు సరదాగా గడిపారని తెలిపారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన 18 రోజులుగా నిర్వహించిన తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగింది.
ఈ సందర్భంగా భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పిల్లలు 18 రోజులుగా మొబైల్ ఫోన్స్, ట్యాబ్, టీవీలు, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా సమ్మర్ క్యాంపులో ఆకాశమంత విశాలమైన ప్రపంచంలో విహరించారని తెలిపారు. పాఠ్యాంశాలు కాదు ప్రపంచాన్ని పరిచయం చేశామన్నారు. పిల్లలకు అవకాశాలిస్తే అద్భుతాలు సృష్టిస్తారని బాలోత్సవం నిరూపించిందని అన్నారు. చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ.. నేడు పాఠశాలల్లోని ఏడంతస్తుల మేడల్లో.. లేదా ఇరుకు గదుల్లో పిల్లలు చదువుతున్నారని అన్నారు. అందువల్ల ఈ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా వ్యవసాయ క్షేత్రం అయిన రాజేంద్రనగర్‌కు పిల్లలను బస్సుల్లో తీసుకెళ్లి వ్యవసాయం, పండ్ల తోటలను చూపించి, వాటి గురించి వివరించామన్నారు. వ్యవసాయ పరిశోధనా అధికారులతో మాట్లాడించి పిల్లలకు పంటలు పండే విధానాన్ని చూపించినట్టు తెలిపారు. 80 శాతం మంది పిల్లలు వరి చేళ్లు చూడలేదని చెప్పడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించిం దన్నారు. ఆడ పిల్లలకు ఈ క్యాంపు పులి పిల్లలుగా ఆత్మ గౌరవ భరోసానిచ్చిం దన్నారు. కన్నీళ్లు కాదు ఆడపిల్లలు కన్నెర చేయాలని, ప్రశ్నించే తత్వాన్ని నేర్పిందని చెప్పారు.
జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పిల్లలు అన్ని రంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలన్నారు. ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ.. సుందరయ్య విజ్ఞాన నిలయం పిల్లల ఆనంద ఆలయంగా మారిందని, పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలని భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విజ్ఞాన కేంద్రంలో పిల్లల లైబ్రరీ నిర్వహిస్తామని తెలిపారు. బాలోత్సవం కార్యదర్శి ఎన్.సోమయ్య మాట్లాడుతూ.. పిల్లల్లో ఆత్మగౌరవం పెంపొందించి.. విజ్ఞానంతో సగర్వంగా సాగనంపుతున్నామని, 18 రకాల కార్యక్రమాలు ఈ సమ్మర్ క్యాంపులో నేర్పించారని తెలిపారు. మూఢనమ్మకాలు, మాయలు, మంత్రాలకు దూరంగా ఉండాలని బోధించామని చెప్పారు. ఇంగ్లీష్ మాత్రమే కాదు మాతృభాష అవసరాన్ని కూడా ఈ సమ్మర్ క్యాంపు గుర్తు చేసిందన్నారు. అనంతరం పిల్లలందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షులు కె.సుజావతి, మమత, పద్మ కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, తెలంగాణ బాలోత్సవం కమిటీ సభ్యులు నవీన్, గోపాల్, భవాని, మానస తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్.. నా దగ్గర ఆధారాలున్నాయ్

- బహిరంగ చర్చకు సిద్ధం : బీజేపీ ఎల్పీ నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
పౌర, సరఫరాల శాఖలో జరిగిన అవినీతి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీద చేసిన ఆరోపణలకు సంబంధించిన తన దగ్గర పూర్తి ఆధారాలున్నాయని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరోమారు నొక్కిచెప్పారు. దీనిపై బహిరంగంగా చర్చించేందుకు సిద్ధమని ప్రకటించారు. తాను చర్చకు ఒక్కడినే వస్తాననీ, వాళ్లు ఎంతమందైనా రావొచ్చని సవాల్ విసిరారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. తాను చేసిన విమర్శలపై కౌంటర్ ఇచ్చే సీన్ ఉత్తమ్‌కు లేదన్నారు. తాను పబ్లిసిటీ చేసుకోవడం కోసమే మాట్లాడుతున్నానని చేసిన ఆరోపణలను కొట్టిపడేశారు. గతంలో ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీద మాట్లాడినప్పుడు ఉత్తమ్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

అవినీతి ఏసీపీకి జ్యుడీషియల్ రిమాండ్

- తేలిన అక్రమాస్తులు రూ.4 కోట్లపైనే

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి
అవినీతి, అక్రమాలకు పాల్పడి ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించిన నగర నేర పరిశోధక విభాగం ఏసీపీ ఉమా మహేశ్వర్‌రావుకు 15 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ హైదరాబాద్ ఏసీబీ కేసుల ప్రత్యేక జడ్జీ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఆదాయానికి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై మంగళవారం ఉమామహేశ్వర్‌రావుకు చెందిన ఆస్తులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన ఆస్తులను లెక్కగట్టిన ఏసీబీ అధికారులు రూ.38 లక్షల నగదు, 600 తులాల బంగారం, మరికొంత వెండి ఆభరణాలు, ఇండ్లు, ఇతర ఆస్తులు కలిపి మొత్తం రూ.3.97 లక్షలపైగా ఆస్తులున్నట్టు తేల్చారు. అంతేగాక, ఉమామహేశ్వరరావు బ్యాంకు లాకర్లను ఇంకా తెరవాల్సి ఉందనీ, వాటి విలువ కూడా కలిపితే ఈ అవినీతి అధికారి ఆస్తుల విలువ మరింత పెరుగుతుందని ఏసీబీ డీజీ సీవీ.ఆనంద్ తెలిపారు. ఒకటెండ్రు రోజుల్లో ఆ లాకర్లను తెరుస్తామని తెలిపారు. అక్రమ ఆదాయ కేసులో అరెస్టు చేసిన ఉమామహేశ్వర్‌రావును ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచామనీ, నిందితునికి కోర్టు 15 రోజుల పాటు జ్యుడీషియరీ రిమాండ్ విధించినట్టు తెలిపారు. దీంతో ఉమా మహేశ్వర్‌రావును చంచల్‌గూడ జైలుకు తరలించామని తెలిపారు.



ప్రకృతి అవసరాలు జంతువుల మనుగడ విద్యార్థి దశ నుంచే తెలియజేయడం ద్వారా సమ సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫ్ ఫారెస్ట్ వాణి ప్రసాద్ ఐఏఎస్ తెలిపారు. బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ యోగా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన ప్రకృతి అవసరాలు ప్రకృతి మనుగడ ఇతర జీవరాసుల మనుగడ ప్రకృతితో ఉన్న అవినాభావ సంబంధంపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఆమె ప్రకృతిపై ఆధారపడి జీవించే ప్రతి జీవి అవసరాన్ని గుర్తించి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ పార్క్ ఫారెస్ట్ అధికారులతో పాటు ఉన్నత అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

'బెస్ట్ అవైలబుల్' స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటజీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి సంబం ధించి జిల్లాకు చెందిన అర్హులైన గిరిజన విద్యార్థుల కు 3,5,8వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఆర్.కోటజీ బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో 3వ తరగతిలో 20 సీట్లు, 5వ తర గతిలో 11 సీట్లు, 8వ తరగతిలో 10 సీట్లు మొత్తం 41 ఉన్నాయని ఆయన తెలిపారు. జూన్ 6 తర్వాత కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో దరఖాస్తు చేసిన అభ్యర్థులను తరగతిల వారీగా ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2లక్షలకు మించరాదని తెలిపారు. జూన్ 6న చివరితేదీ అని కులం, ఆదాయం నివాస ధృవీకరణ పత్రంతో పాటు చదివిన పాఠశాల స్టడీ సర్టిఫికెట్లు జతరపచాలని ఆయన కోరారు. ఆసక్తి కలిగిన వారు నేటి నుంచి దరఖాస్తులు నింపి వాటిని 4వ అంతస్తు స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్, కలెక్టర్ కాంప్లెక్స్, లక్డీకాపూల్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. చివరి తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులను స్వీకరించామని, మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్ 7780568955 లేదా 9849995875కు సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

'కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించండి'

- రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ సభ్యులు దమ్మిగారి కనకయ్య



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ సభ్యులు దమ్మి గారి కనకయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జేఏసీ కో-ఆర్డినేటర్ వెంకటేష్ ఇంద్రపల్లి ఆధ్వర్యంలో బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుంపుల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం తీన్మార్ మల్లన్న చాలా కృషి చేశారని ఆయన గుర్తు చేశారు.అనంతరం పంతం రాజేష్ మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నను గెలిపించి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పాలని ఆయన పట్టభద్రులను కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ బత్తుల కృష్ణ, జాయింట్ సెక్రెటరీ రామారావు, కో-కన్వీనర్లు మంజుల, విజయ కుమారి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం..

నవతెలంగాణ-ధూల్‌పేట్



ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ సీతారాం బాగ్, గోషా కట్ స్కూల్ ప్రాంతానికి చెందిన సత్ పాల్ 17 ఏండ్ల కొడుకు సుమిత్ సింగ్ ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు స్థానికంగా బంధు మిత్రులతో వాకాబు చేశారు. ఫలితం లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సుజాత అజ్మీరకు తెలుగులో డాక్టరేట్..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ సహాయ ఆచార్యులు సుజాత అజ్మీర కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. 'మూడ్ కృష్ణా నాయక్ జీవితం- సాహిత్యం' అనే అంశంపై తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిల్మానాయక్ పర్యవేక్షణలో డాక్టర్.సుజాత సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి పిహెచ్‌డి ప్రకటించారు. తెలుగు సాహిత్యంలో ఒక విస్మృ త గిరిజన కవి గురించి పరిశోధన చేసిన డాక్టర్.సుజాతను సిటీ కళాశాల ప్రిన్సి పాల్ ఆచార్య బాల భాస్కర్, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఎంపీజే ఆర్థిక సాయంతో ఇద్దరు ఖైదీల విడుదల

నవతెలంగాణ-ధూల్‌పేట్

శిక్షా కాలం ముగిసినప్పటికీ జైలులో మగ్గుతున్న ఇద్దరు ఖైదీలకు ఆర్థిక, న్యాయపరమైన సహాయం అందించి విడుదలకు ఏర్పాట్లు చేశామని మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సలీముల్ హిందీ తెలిపారు. సంస్థ ప్రతినిధులు సలీముల్ హింద్, షకీల్ హమీముద్దీన్ బృందం బుధవారం మహబూబ్నగర్ జిల్లా జైలును సందర్శించి జైలు సూపరింటెండెంట్‌ను కలిశారు. ఈ సందర్భంగా పురాని హవేలీ సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీజే తెలంగాణ శాఖ తరపున ఆర్థిక సహాయం అందించి ఇద్దరు ఖైదీల విడుదలకు కృషి చేశామన్నారు. ఈ ఖైదీలు మొదటిసారి నేరానికి పాల్పడి నిర్ణీత జైలుశిక్షను అనుభవించారని, కాని వారి కుటుంబీకులు పేదవారైన కారణంగా జరిమానా చెల్లించలేని స్థితిలో ఉన్నారన్నారు. కాబట్టి ఎంపీజే ఈ మొత్తాన్ని చెల్లించి ఖైదీల విడుదలకు తన వంతు సహకారాన్ని అందజేసిందన్నారు. 2008 నుండి తమ సంస్థ తరపున ఖైదీల విడుదలకు ఆర్థిక సాయం చేస్తూ వస్తోందన్నారు. మరిన్ని వివరాలకు బాధితులు ఎవరైనా ఉంటే హైదరాబాద్ పురానీహవేలిలోని సంస్థ కార్యాలయం నంబర్ 9010 320628, 040-245038185 లను సంప్రదించవచ్చన్నారు.

ఇదేం ఫ్రెండ్లీ పోలీసింగో...

- భార్య ముందే భర్త ప్రయివేట్ పార్టుపై మహిళా ఎస్ఐ దాడి
- స్టేషన్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిన బాధితులపై తిరిగి దాడి
- 17న రాత్రి ఠాణాలో రాత్రి 10.45 నుంచి 11.20 మధ్యసీసీ కెమెరాలలోని దశ్యాలను పరిశీలించండి
- డీసీపీతోపాటు, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు
- మలుపు తిరిగిన మధురానగర్ వైన్స్ దాడి ఘటన

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొంత మంది పోలీస్ సిబ్బంది తీరుతో పోలీస్‌శాఖకే మచ్చ వస్తోంది. ప్రజలతో స్నేహంగా ఉండాలని, ముఖ్యంగా ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయాలని ఉన్నతాధికారులు పదేపదే హితబోధ చేసినా కొందరు ఆవేమీ పట్టనట్టు వ్యవ హరిస్తున్నారు. బాధితులపైనే దాడులు చేసిన సంఘటనలు సంచలనం రేపుతున్నాయి. ఇదే తరహాలో మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులైన భార్య భర్తలను దుర్భా షలాడుతూ భార్య కండ్ల ముందే భర్త ప్రయివేటు పార్ట్స్‌పై ఒక మహిళా ఎస్ఐ దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దాడి జరిగిన ప్రదేశానికి బాధితులను పిలిపించి తిరిగి దాడి చేసేందుకు పోలీసులు పరోక్షంగా సహకరించారనే బాధితులు చేస్తున్న ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. ఈ నెల 17న మధురానగర్ వైన్స్ వద్ద జరిగిన గొడవ విషయంలో అసలు విషయాలను పోలీసులు కప్పిపుచ్చి, బాధితులపైనే కేసులు నమోదు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన విషయాన్ని వెస్ట్‌జోన్ డీసీపీ దష్టికి తీసుకెళ్లిన బాధితులు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.



బాధితుల కథనం ప్రకారం..

ఈ నెల 17వ తేదీన వెంగళ్‌రావునగర్‌కు కాలనీకి సినిమాటోగ్రాఫర్ అయిన ఎర్రోళ్ల రమేష్ మధురానగర్‌లోని మధురా వైన్స్ వద్దకు వెళ్లి క్యూ లైన్‌లో నిల్చొని ఆన్‌లైన్‌లో పేమెంట్ చేశాడు. అయితే అందులో ఉన్న సిబ్బంది మద్యం బాటిల్ ఇవ్వకపోవడంతో గొడవ జరిగింది. దుకాణంలో పనిచేసే సిబ్బంది బయటకు వచ్చి రమేష్ తలపై బాటిల్‌తో దాడి చేయడంతో ఆయనకు గాయమైంది. ఆయన భార్య షాహెద పక్కనే సూపర్‌మార్కెట్‌లో సరుకులు కొనుక్కొని వచ్చే వరకు భర్త తలలో నుంచి రక్తం వస్తుండగా తట్టుకోలేక దుకాణంలోకి చొరబడి దాడి చేసిందని, అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై కూడా దాడి చేశారని దాంతో ఇరువర్గాల ఫిర్యాదులతో పాటు పోలీసు కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుపై కూడా మూడు కేసులు నమోదు చేశామంటూ మధురానగర్ పోలీసులు ఆ రోజు వెల్లడించారు. అయితే ఇదంతా ఒక కట్టు కథ అని, పోలీసులు చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడం కోసం తమపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

జరిగింది ఇది : బాధితులు..

అయితే అసలు జరిగింది ఇది అని బాధితులు చెబుతున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం దుకాణం వద్ద డబ్బు చెల్లించినా బాటిల్ ఇవ్వకపోవడంతో గొడవ జరిగింది. సిబ్బంది వచ్చి రమేష్‌పై దాడి చేశారు. ఈ దాడిపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు దంపతులిద్దరు మధురానగర్ ఠాణాకు వెళ్లారు. అక్కడ ఎస్ఐ మాధవిరెడ్డిని కలిసి జరిగిన విషయం చెప్పారు. స్టేషన్‌లోకి వెళ్లగానే పరుష పదజాలంతో దుర్భాష లాడింది. ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్తే తీసుకోలేదు. అయితే ఎమ్మెల్సీ (మెడికో లీగల్ కేసు) చేసుకొని రండి అంటూ స్టేషన్ నుంచి పంపిం చేసింది. తలకు బలమైన గాయమయ్యింది, ఎవరైనా మీ సిబ్బందిని పంపించండని కోరడంతో వాళ్లపై ఎస్ఐ కోపోద్రిక్తురాలై మీరు వెళ్లి చేసుకొని రండంటూ గద్దించింది. దీంతో రమేష్ దంపతులు ఎస్ఆర్‌నగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లి ప్రాథమిక చికిత్స చేయించుకొని తిరిగి పోలీస్‌స్టేషన్‌కు బయలుదేరారు. ఇంతలో ఎస్ఆర్‌నగర్ కానిస్టేబుల్ ఫోన్ చేసి ఎక్కడున్నారంటూ మాట్లాడారు. తాము దవాఖాన నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నామని చెప్పారు. లేదు మీరు మధురావైన్స్ దుకాణం వద్దకు రావాలని, స్టేషన్‌కు అవసరం లేదంటూ మాట్లాడారు. దంపతులిద్దరు మధురానగర్ దుకాణం వద్దకు వెళ్లగానే సిబ్బంది మరోసారి దాడి చేశారు. ఆ దాడి దశ్యాలను వీడియో తీస్తున్న బాధితుడి భార్యతో అక్కడున్న సిబ్బంది అసభ్యకరంగా ప్రవర్తించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న భాషా అనే కానిస్టేబుల్ వైన్స్ సిబ్బందితో కలిసి మహిళ అని కూడా చూడకుండా బాధితుడి భార్యతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఆమె నుంచి సెల్‌ఫోన్‌ను లాక్కొన్నాడు. ఈ ఘటనపై మరోసారి పోలీస స్టేషన్‌కు వెళ్లిన రమేష్ దంపతులపై ఎస్ఐ మాధవిరెడ్డి విరుచుపడింది. అక్కడకు మీరెందుకు వెళ్లారంటూ గట్టిగటిగా అరుస్తూ వివరాలు చెప్పండంటూ సూచించింది. కులం పేరు చెప్పాలంటూ కులం పేరు చెబితేనే ఫిర్యాదు స్వీకరిస్తామంటూ చెప్పింది. తమది ఎస్సీ కులమని చెప్పగానే కులం పేరుతో దూషిస్తూ, నానా దుర్భాషాలాడిందని బాధితులు ఆరోపించారు. అంతటితో ఆగకుండా బాధితుడైన రమేష్‌ని ఆయన భార్య ముందటే కొడుతూ, ప్రయివేటు పార్టులపై మూడు సార్లు తన్నింది. ఆ ఘటనను వీడియో తీస్తుండగా ఆయన భార్య వద్ద సెల్‌ఫోన్ లాక్కొని స్టేషన్‌లో కూర్చొబెట్టింది. తమపై రెండు కేసులు నమోదు చేశారని, వైన్ షాపు యజమానిపై ఒక కేసు నమోదు చేశారంటూ బాధితుడు తెలిపారు. మరుసటి రోజు ఏసీపీ వచ్చిన తరువాత తనను బటయకు వదిలి పెట్టారని రమేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తూ, న్యాయం చేయాల్సిన పోలీసులు తమకు అన్యాయం చేసి, తమను మానసికంగా, శారీరకంగా హింసించారంటూ రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు న్యాయం చేయాలని కోరాడు. కావాలంటే 17వ తేదీ రాత్రి 10.45 నుంచి 11.20 వరకు పోలీస్‌స్టేషన్‌లోని సీసీ కెమెరాలలో రికార్డు అయిన దశ్యాలను పరిశీలిస్తే విషయాలు తెలుస్తాయన్నారు. , మద్యం దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తే ఎవరిది తప్పో తెలుస్తుందని కోరాడు.

విచారణ జరుగుతుంది
వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్

మధురానగర్ ఠాణా పరిధిలోని వైన్స్ వద్ద జరిగిన గొడవకు సంబంధించిన విషయంలో పోలీసులపై బాధితు లు కొన్ని ఆరోపణలు చేశారని, ఫోన్‌లో తనకు బాధితులు తెలిపారనివెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ తెలిపారు. దీనిపై ఇన్‌స్పెక్టర్‌ను విచారణ చేయాలని ఆదేశించామన్నారు.

స్థానికులే ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవాలి



నవతెలంగాణ-బంజారాహిల్స్

స్థానికంగా ఉండే ప్రజలే ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవాలని ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయ రెడ్డి, బంజారా హిల్స్ డివిజన్‌లోని ఉదయ నగర్ ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ స్థలమని సూచిక బోర్డు ఉన్నప్పటికీని చుట్టుపక్క వాళ్ళు కబ్జా చేసేందుకు ప్రహరీ గోడ నిర్మించడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు విజయ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశిస్తూ చట్టపరమైన చర్యలు తప్పని హెచ్చరించారు. స్థానిక ప్రజలు విజయ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ సమస్యల పట్ల స్పందించడం అభినందనీ యమన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- ఆర్వో, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జూన్ 4న జరుగనున్న హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా జరుపాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. బుధవారం ఆబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ సర్కిల్ ఆఫీసులో హైదరాబాద్(09) పార్లమెంట్ నియోజకవర్గంలోని గోషామహల్(65) అసెంబ్లీ సెగ్మెంట్ ఎంకోర్ డాటా ఎంట్రీ(డమ్మీ) రిహార్సల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేసి కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరగాలని సూచించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టవంతంగా పోలీసు పహారాను



ఏర్పాటు చేయాలన్నారు. గుర్తింపు కార్డు ఉన్నవారికి మాత్రమే లోపలికి అనుమతించాలని తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ ఏఆర్వో వి. విక్టర్, డిప్యూటీ కలెక్టర్ అండ్ ఏఆర్వోఏస్ విద్యాధర్, తహసిల్దార్, ఏఆర్వో ఎం. ప్రేమ్ కుమార్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి

- జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షులు గవ్వల భరత్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20శాతం నుంచి 42 శాతంకు పెంచి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షులు గవ్వల భరత్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యానగర్ బీసీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చే జూన్ నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు కులగణన చేయాలని నిర్ణయం తీసుకుంది. కులగణన చేసిన తర్వాతే దాని ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని కోరారు. ఇంకా కులగణన ప్రక్రియ ప్రారంభించలేదని ఇది పూర్తి కావడానికి 2నెలలు పడుతుందని రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరుపుతారని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే ఎన్నికలు జరపాలని కోరారు. ఒకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా బహిరంగ సభలలో ప్రతిరోజు కులగణన జరుపుతా



మని, దాని ప్రకారము విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని బడ్జెట్ కేటాయిస్తామని బీసీ ఎజెండా ఎత్తుకొని బీసీల అభిమానం చూర గోంటుంటే ఇక్కడ బీసీలకు అన్యాయం చేయడం తగు న్యాయమా అని ప్రశ్నించారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 45శాతం ప్రాతినిధ్యం కల్పించారు. జనరల్ స్థానాల లో కూడా బీసీ జిల్లా పరిషత్ చైర్మన్, ఎంపీపీ చైర్మెన్లు, మున్సిపల్ చైర్మెన్లు, మేయర్లు ఇస్తుంటే ఇక్కడ ఎన్నికల వాగ్దానం ప్రకారం రిజర్వేషన్లు పెంచ కుండా అన్యాయం చేయడం తగదన్నారు. కాంగ్రెస్ జనాభా ప్రకారం పెంచుతామని హామీ ఇచ్చారు. రిజర్వేషన్లు పెట్టకుండా ఎన్నికల ప్రక్రియ మొదలు పెడితే పెద్ద యెత్తున ఉద్యమం చేసి ప్రభుత్వంపై బీసీలు అందరం కలిసి తిరుగుబాటు చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక జారీచేశారు.

కిర్గిస్థాన్ విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

- కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట



కిర్గిస్థాన్‌లో చోటు చేసుకుంటున్న ఘటనలపై భారతీయ విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని వారిని భారతదేశానికి తిరిగి తీసుకొచ్చేందుకు అన్ని విధాలుగా కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జై శంకర్ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా లతో మాట్లాడుతున్నారని త్వరలోనే స్వదేశానికి వస్తారని జీవీకే ఎడ్యుటెక్ బృందానికి తెలియజేశారు. ఈ మేరకు మంగళ వారం ఇటీవల జరిగిన అల్లర్ల గురించి అడిగి తెలుసు కుని అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దని జీవీకే ఎడ్యుటెక్ డైరెక్టర్ విద్య కుమార్ తెలిపారు. ఏదైనా సలహాల కొరకు భారత ప్రభుత్వం భారత రాయబార కార్యాలయం హెల్ప్ లైన్ నెంబర్ 0555 710041 సంప్రదించగలరని సూచించారు.

నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం

నవతెలంగాణ-ధూల్‌పేట్

సందర్శకులలో విద్య అవగాహనను పెంపొం దించడంలో భాగంగా "అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో జరుపు కున్నారు. నెహ్రూ జూలాజికల్ పార్క్ డివై. క్యూరే టర్ ఎ. నాగమణి, క్లే మోడలింగ్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. సుమారు 800 మంది సందర్శకులు క్లే మోడలింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడ వారు అడవి జంతువులు పక్షుల నమూనాలను రూపొందించడానికి శిక్షణ ఇచ్చారు. చాలా మంది సందర్శకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం చాలా ఆసక్తికరంగా ఉందని ప్రతి జాతి ప్రాము ఖ్యత గురించి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ సహకారంతో వింగ్స్ ప్రాంతంలో మిల్లెట్స్ ఎగ్జిబిషన్ నిర్వహించబడింది. ఈ ఎగ్జిబిషన్‌లో 9 రకాల మిల్లెట్‌లను ప్రదర్శించారు. వాటి ప్రాముఖ్యతను రాజేంద్రనగర్ ఏసీటీఓ(ఓఎల్), ఐసీ ఏఆర్



- ఐఐఎంఆర్ డాక్టర్ మహేష్ కుమార్ వివరించారు. ఈ ప్రదర్శనను ఐఐఎంఆర్ వికాస్ రెడ్డి జూ పార్క్ ఈఓ దీపక్



తరుణ్‌తో సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యురేటర్ - 1 ఎ. సతీష్ బాబు, అసిస్టెంట్ క్యురేటర్ - 2 బి లక్ష్మణ్ నాయక్, పీఆర్ఓ హనిఫుల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ నావిగేటర్స్ కన్సల్టెన్సీ కంపెనీ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు నగర్‌లో ఏర్పాటు చేసిన గ్లోబల్ నావిగేటర్స్ కన్సల్టెన్సీ కంపెనీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. విదేశాలకు వెళ్లి చదువుకోవడానికి కన్సల్టెన్సీ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, శివ తదితరులున్నారు.

సీఎం సహాయ నిధి ఎల్‌వోసి చెక్కు అందజేత



నవతెలంగాణ మల్కాజిగిరి

మల్కాజిగిరి డివిజన్ శ్రీకృష్ణా నగర్ కృపా కంప్లెక్‌కు చెందిన సఫ్వాన్ సబేర్ అనారోగ్యంతో బాధపడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసి రూ.1,50,000 చెక్కును మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి లబ్దిదారుడు సఫ్వాన్ సబేర్ కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జేఏసీ వెంకన్న, మేకల రాము యాదవ్, వెంకటేష్ యాదవ్, శ్రీకాంత్, మణిరత్నం, ఆకారం సాయి తదితరులున్నారు.

లక్ష్మీదేవమ్మకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింగ్‌రావు పరామర్శ



నవతెలంగాణ-ఉప్పల్

స్వాతంత్య్ర సమరయోధుడు ఎంవీ.శ్రీహరి సతీమణి లక్ష్మీ దేవమ్మ ఇటీవల అనారోగ్యానికి గురైంది. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ. నర్సింగ్‌రావు బుధవారం రామంతపూర్‌లోని గోకుల్‌నగర్‌లో ఉన్న లక్ష్మీదేవమ్మ నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవమ్మ త్వరగా కోలుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు జే.చంద్రశేఖర్, ఎం. వినోద, ఉప్పల్ నాయకులు జే. వెంకన్న, వెంకటేశ్వర్లు, భీష్మాచారి ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యమే లక్ష్యం



- చెంగిచెర్ల డిపో మేనేజర్ కవిత

నవతెలంగాణ-బోడుప్పల్

ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యం, ప్రయాణికుల సురక్షితమే లక్ష్యంగా తెలంగాణ ఆర్టీసీ పని చేస్తున్నట్టు చెంగిచెర్ల డిపో మేనేజర్ కే.కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో టీజీఎస్ ఆర్టీసీ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం డిపోలో పని చేస్తున్న ఉద్యోగుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డీఎం. కవిత బుధవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆర్టీసీ ఉద్యోగులకు రక్త, బీపీ, మధు మేహ, ఈసీజీ తదితర ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈసీజీ, బీపీలు సమస్యాత్మకంగా ఉన్నవారితో పాటు రక్త సంబంధ వ్యాధులతో బాధ పడుతున్న వారిని తార్నాకలోని టీజీఎస్ ఆర్టీసీ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు డీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధ, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఆనందరావు, అసిస్టెంట్ మేనేజర్ (మెకానికల్) సుబ్రహ్మణ్యం, సూపరిండెంట్ రత్నమ్మ, డిప్యూటీ సూపరిండెంట్ బీఆర్‌వీ. లక్ష్మీ, వైద్య సిబ్బంది సాయి కిరణ్, రాజు, అంకిత, శ్రీలేఖ, సంధ్య, జీవన్, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్‌లోని రాఘవేంద్ర నగర్‌లో చేపడుతున్న డ్రయినేజీ పనుల కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.10 లక్షల వ్యయంతో ఓపెన్ డ్రయినేజీ పనులకు టెండర్ ఆహ్వానించగా కాంట్రాక్టర్లు సకాలంలో రాకపోవడంతో పనులు ఆలస్యం అయ్యాయని తెలిపారు. బుధవారం ట్రాక్టర్లు రావడంతో పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, ముత్యం రెడ్డి, మారయ్య, ప్రీతి రెడ్డి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకే పట్టం కడుదాం

- పట్టభద్రుల ఉప ఎన్నికల ప్రచారంలో తుంగతుర్తి రవి



నవతెలంగాణ-బోడుప్పల్

గత పాలకుల వైఫల్యాలపై తీన్మార్ మోగించి నిత్యం ప్రజల తరుపున పోరాటం చేసి ప్రశ్నించే గొంతుకగా తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన తీన్మార్ మల్లన్నను పట్టభద్రుల ఉప ఎన్నికల్లో గెలిపించి చట్ట సభల్లోకి పంపాల ని పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి కోరారు. ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల లో భాగంగా బుధవారం యాదాద్రి జిల్లా మొత్కురు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి పట్టభద్రులను ఓట్లాడిగారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న నిత్యం ప్రజా సమస్యలపై తనదైన శైలిలో యూ ట్యూబ్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించాడని అనేక సమస్యలను పరిష్కరించడానికి కృషి చేశారని తెలిపారు. అలాంటి వ్యక్తి చట్టసభల్లో ఉంటే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, బాలరాజు, పవన్ గౌడ్, అయిలేష్ యాదవ్, సురేందర్ రెడ్డి, కవిడ కుమార్, భాస్కర్, బండి శ్రీను, రంగన్న గౌడ్, అవిశెట్టి అవిలిమల్లు, గానగని నర్సింహ, సురేష్, కారుపోతుల వెంకన్న, అవిశెట్టి కిరణ్, శేఖరా చారి, బయ్యని రాజు, కోమటి మచ్చగిరి, రవి యాదవ్, పఠాన్, శరత్ గౌడ్, రాజు, శ్రీకాంత్, స్థానిక నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ పద్మరాములు



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ జె.పద్మరాములు కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొమ్మకు సుగుణ బాలయ్య, కొత్త చందర్ గౌడ్, నాయకులు కొత్త కిషోర్‌గౌడ్, రాపోలు వీరా రెడ్డి, కొత్త సుశాంత్ గౌడ్ ఉన్నారు.

భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘ సంస్కర్త



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి

నవతెలంగాణ-కాప్రా

శ్రీ భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘ సంస్కర్త అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఈసీఐఎల్ కమలానగర్ సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ సంఘసంస్కర్త శ్రీ భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి, ప్రముఖ కార్మికోద్యమ నాయకులు పర్స సత్యనారాయణ తొమ్మిదో వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు స్ఫూర్తి గ్రూపు బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా పర్సా సత్యనారాయణ చిత్రపటానికి కోమటి రవి, శ్రీ భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నవతెలంగాణ హైదరాబాద్ జనరల్ మేనేజర్ లింగారెడ్డి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కోమటి రవి మాట్లాడుతూ శ్రీ భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్‌లో అంటరాని కులంలో జన్మించగా అనేక వివక్షలకు గురయ్యా డని తెలిపారు. అయినప్పటికీ చదువును అభ్యసించి సంఘసంస్కర్తగా వెలుగొందారని చెప్పారు. బాలికల విద్య కోసం దాదాపు 23 స్కూళ్లను ఏర్పాటు చేసి విద్యాబోధన చేశారని, హైదరాబాద్ చాదర్‌ఘాట్ బ్రిడ్జి ఎదురుగా ఉన్న ఆది హిందూ భవన్ ఆయన నిర్మించిందే అని తెలిపారు. ఆనాటి నుండి నేటి వరకు ఆ పరంపర కొనసాగుతూనే ఉందన్నారు. తాము అంటరాని వాళ్లం కాదని తాము మూలపురుషులమని ఆయన ప్రబోధించా రన్నారు. ఆయన కేవలం తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా సంఘ సంస్కరణ ఉద్యమాల్లో భాగస్వామ్యం అయ్యారని చెప్పారు. అలాగే ప్రముఖ కార్మిక నాయకులు పర్సా సత్య నారాయణ సింగరేణి కార్మికుడిగా ప్రారంభించి శేషగిరి నాయకత్వంలో ముందుకు నడిచారని చెప్పారు. పాలకులు శేషగిరిరావును కాల్చి చంపిన తర్వాత కార్మికోద్యమాన్ని నిర్మించడంలో పర్సా ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. తర్వాత పాలకులు అరెస్ట్ చేసి జైల్లో పెట్టినా చాకచక్యంతో అక్కడి నుంచి తప్పించుకొని తెలంగాణ సాయుధ పోరాటంలో భాగస్వామ్యం అయ్యారని చెప్పారు 1952లో ఎమ్మెల్యేగా గెలిచారని.. అయినా నిరాడంబరం గా జీవించి కార్మికులలో మమేకమయ్యారని గుర్తు చేశారు. సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పర్స సత్యనారాయణ అందరికీ ఆదర్శప్రాయులన్నారు. నిజ జీవితంలో కూడా ప్రతీ ఒక్కరిని ప్రోత్సహిస్తూ పత్రికా రంగాన్ని అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేశారని చెప్పారు. భాగ్యరెడ్డి వర్మ తెలంగాణ సాంస్కృతిక రంగంలో చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. అనంతరం సభికులందరూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జయరాజు, శివ, రేణు, ఎల్లయ్య, రుక్కయ్య, శారద, గౌస్య, శోభ, ఉన్నికృష్ణ, శ్రీనివాస్, రవి, సత్యనారాయణ, భరత్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి



మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి జవహర్ నగర్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్లకు, ఇంటి పన్నులు వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇంజినీరింగ్ విభాగం వారికి అకాల వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించేలా అవగాహన కల్పించాలని సూచించారు. విధులను బాధ్యతతో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ మాధవ చారి, ఏఈ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దశదిన కర్మకు హాజరైన ఈటల రాజేందర్



నవతెలంగాణ-అల్వాల్

బొలారం బూర్గుంగూడ నివాసులు తోట మల్లారెడ్డి (83) ఇటీవల కన్నుమూశారు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులు కొంపల్లి చంద్రారెడ్డి గార్డెన్‌లో దశదిన కర్మను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరై మల్లారెడ్డి కుమారుడు టి.మధుసూధన్‌రెడ్డి, కుటుంబ సభ్యుకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.మణిక్య రెడ్డి, రాజమల్లా రెడ్డి, రాజిరెడ్డి, మైపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- కాప్రా తహశీల్దార్ సుచరిత
- అక్రమంగా నిర్మించిన ఇండ్లు కూల్చివేత
- నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు



నవతెలంగాణ - జవహర్‌నగర్

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్ట్ నమోదు చేస్తామని కాప్రా తహశీల్దార్ సుచరిత అన్నారు. బుధవారం ఉదయం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అరుంధతి నగర్‌లో సర్వేనెంబర్ 867, 868, 810లో అక్రమంగా నిర్మించిన ఇండ్లను, గుడిసెలను జవహర్ నగర్ పోలీసుల సహాయంతో కూల్చేశారు. ఈ సందర్భం గా తాహశీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు కొల్లగొట్టాలని చూస్తున్న వారిని వదిలిపెట్టబోమని అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ ధ్యేయంగా పని చేస్తున్నామని, పేద ప్రజలు ఎవరూ ప్రభుత్వ భూములు కొని మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి, అడ్మిన్ ఎస్సై ఇద్రిస్ అలీ, ఎస్సై అనీల్ కుమార్ యాదవ్, అనీల్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ రాధిక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి, రెవెన్యూ, పోలీస్, సిబ్బంది పాల్గొన్నారు.



మేడ్చల్ మున్సిపల్‌లో అవిశ్వాసానికి వేళాయే..



- వచ్చేనెల 7వ తేదీన అవిశ్వాసం పెట్టనున్నట్టు సమాచారం
- తదుపరి చైర్ పర్సన్ రేసులో పాలకుర్తి భవానీ రాఘవేంద్ర గౌడ్

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డిపై అవిశ్వాసం పెట్టేందుకు రంగం సిద్ధమ వుతున్నట్లుగా తెలుస్తోంది. మున్సిపల్ చైర్ పర్సన్ పై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ గత గురువారం కలెక్టర్ కార్యాలయంలో 16మంది కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా మరుసటిరోజే మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కౌడే మహేష్, జంగ హరికృష్ణ యాదవ్‌లు కాంగ్రెస్‌లో చేరారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం జూన్ 7వ తేదీన మేడ్చల్ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉన్నట్లుగా వార్తలు వినపడుతున్నాయి. మున్సిపాలిటీలో మొత్తం 23 మంది కౌన్సిలర్లు ఉండగా ఇందులో కాంగ్రెస్ వైపు 18 మంది కౌన్సిలర్లు ఉండగా బీఆర్ఎస్‌కు నలుగురు, బీజేపీకి ఒక్కరు మాత్రమే ఉన్నారు. ప్రస్తుత చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డిపై పలువురు కౌన్సిలర్లు అసహనంతో ఉన్నారు. దీంతో అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంది. ప్రస్తుత చైర్ పర్సన్ మర్రి దీపికా భర్త నర్సింహ రెడ్డి అవిశ్వాసం నుంచి గట్టెక్కిఎందుకు మలిపెద్ది సుధీర్‌రెడ్డితో కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు జరిపినా సఫలీకృతం కాలేదు. దీనికి మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాల కుర్తి రాఘవేంద్ర గౌడ్, కౌన్సిలర్ చాపరాజు, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్ వ్యతిరేకించడమే కారణంగా తెలుస్తోంది. మున్సిపల్ చైర్ పర్సన్ పదవిని దక్కించుకునేందుకు మున్సిపల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర గౌడ్ సతీమణి కౌన్సిలర్ పాలకుర్తి భవానీ ముందంజలో ఉన్నారు. ఇప్పటికే మెజార్టీ కౌన్సిలర్ల మద్దతు కూడగట్టినట్టుగా సమాచారం. ఆమె ఎన్నిక లాంఛనమే అని పలువురు చర్చించుకుంటున్నారు.

అల్వాల్ ప్రెస్ క్లబ్‌లో భాగ్యరెడ్డి వర్మ జయంతి

నవతెలంగాణ-అల్వాల్

దళితుల చైతన్యానికి ప్రతీక భాగ్యరెడ్డి వర్మ జయంతిని అల్వాల్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దళిత జాతి చైతన్యానికి, దళితుల వికాసానికి అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఇప్పటికీ చాదర్‌ఘాట్ రోడ్డులోని ఆది హిందూ భవన్‌లో ఆయన నెలకొల్పిన బాలికల పాఠశాలను ఆయన వారసులు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాములు, మధుసూదన్‌రెడ్డి, శ్రీరాములు, చంద్రశేఖర్, మల్లేష్, నరేందర్ రెడ్డి, ఉపేందర్, శివకుమార్, చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డి, అనీల్, రాజు, పాల్గొన్నారు.



ఉత్తమ ఫొటోగ్రఫీ బహుమతి గ్రహీత పోలోజు ప్రవళిక



- జీవవైవిద్యంపై రెండో బహుమతి
- అభినందనలు తెలిపిన పలువురు

నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

ప్రపంచ జీవవైవిధ్యం దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్ జూబ్లీహిల్స్ దగ్గర ఉన్న కేబీఆర్ నేషనల్ పార్కులో బుధవారం ఫొటోగ్రఫీ ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బయో డైవర్సిటీ అధికారులు కాళీ చరణ్, ఎస్ కాటేడి, ఐఎఫ్ఎస్ అధికారి మో హన్ చంద్ర, ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణి ప్రసాద్‌లు పాల్గొన్నారు. అనం తరం జీవవైవిధ్యంపై నిర్వహించిన ఫొటో ప్రదర్శనను వారు తిలకిం చారు. ఇందులో భాగంగా యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామానికి చెందిన పోలోజు ప్రవళిక ఉత్తమ ఫొటోగ్రఫీ రెండో బహు మతిని అందుకున్నారు. అనంతరం అధికారులు ఆమెను అభినందించి మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా ప్రవళిక అధికార బృందా నికి కృతజ్ఞతలు తెలిపారు.

'ఓక్రిడ్జ్ బాచుపల్లి' సీబీఎస్ఈపరీక్షలో అద్భుత ఫలితాలు

- బాచుపల్లిలోని గ్రేడ్ 12 కోహెర్ట్ మొత్తం 77.2 శాతం సగటు స్కోర్

నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి 2024 విద్యాసంవత్సరానికి సీబీఎస్ఈ పరీక్షలలో అద్భుత ఫలితాలు సాధించింది. సమగ్ర విద్యావిధానం, అంకితభావంతో విద్యా సాధనలో ముం దుంది. శేరిలింగంపల్లి ఓక్రిడ్జ్ బాచుపల్లిలోని గ్రేడ్ 12 కోహెర్ట్ మొత్తం 77.2 శాతం సగటు స్కోర్ సాధించింది. ఇందులో 67 శాతం మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారు. కామర్స్ స్ట్రీమ్‌లో యువ గణేష్ నార్నే అసాధారణంగా 95.4 శాతం స్కోర్‌తో టాప్ పెర్ఫార్మర్‌గా నిలిచారు. నేహా గిరీష్ కలగుడి 90.4 శాతం సాధించారు. సైన్స్ స్ట్రీమ్‌లో ఆదిత్య రామారావు 93 శాతంతో అగ్రస్థానంలో నిలిచారు. సామల కేదార్ రెడ్డి 92 శాతంతో ఉన్నారు. 12వ తరగతి టాపర్ యువ గణేష్ నార్నే మాట్లాడుతూ.. ముందుకు నడిపించిన ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఓక్రిడ్జ్ బాచుపల్లిలోని గ్రేడ్ 10 సగటు స్కోరు 81 శాతంగా ఉంది. ముఖ్యంగా 69 శాతం మంది విద్యార్థులు డిస్టింక్షన్లు సాధించారు. శ్రీరామ్ వేణు గోపాలన్ అసాధారణంగా 97 శాతం స్కోర్‌తో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. అనికా రస్తోగి, మనీత్ కౌర్ సంయుక్తంగా 95.6 శాతం స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచారు. 10వ తరగతి టాపర్ శ్రీరామ్ వేణుగోపాలన్ మాట్లాడుతూ..గణితంలో సరైన స్కోర్ రావడం పట్ల సంతోషిస్తున్నాన న్నారు. ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి ప్రిన్సిపల్ బల్జీత్ ఒబెరాయ్ మాట్లాడుతూ..తమ విద్యార్థులు సాధించిన అద్భుతమైన విజయాలు ఎనలేని గౌరవాన్ని తెచ్చాయన్నారు. ఇది ఎంతో గర్వంగా ఉందన్నారు. బోర్డు పరీక్షలలో తమ విద్యార్థుల అద్భుతమైన ప్రదర్శనతో పాఠశాల బలమైన సంస్కృతి హైలైట్ అయిందన్నారు. విజయం ఎప్పుడూ స్ఫూర్తిని పొందుతూనే ఉంటుందన్నారు. తమ విద్యార్థులు పెద్ద కలలు కనేలా ఇది చేస్తుందన్నారు. ఉన్నత ప్రమాణాలను నిర్వహించడానికి ఓక్రిడ్జ్ నిబద్ధత తిరుగులేనిదన్నారు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లిలోని సీబీఎస్ఈ హెడ్ షాలినీ సింఘాల్ మాట్లాడుతూ.. అసాధారణమైన ఫలితాలతో పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడం అభినంద నీయం అన్నారు. విద్యార్థులు గణితం, ఇన్ఫర్మేటిక్స్ ప్రాక్టీస్‌లలో పరిపూర్ణ స్కోర్లు వారి అసాధారణ సామర్థ్యాలకు, ఉన్నత ప్రమాణాలకు నిదర్శనమన్నారు.

నాలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఇబ్బందులు పడకుండా నాలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. బుధవారం డివిజన్ పరిధిలోని చంద్రగిరినగర్ ప్రాంతంలో జరుగుతున్న నాలా పనులను అధికారులు, బీజేపీ డివిజన్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. డివిజన్ అభివద్ధి కోసం ఎల్లవేళలా సేవకుడిలా పని చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ.కళ్యాణ్, బీజేపీ డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులు సాయినాథ్ నేత, జ్ఞాని ఈశ్వర్,సీనియర్ నాయకులు సింగారం మల్లేష్,సునీల్ పాటిల్,అన్నపూర్ణ, మురళి,మహేందర్ రెడ్డి,బస్తీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్‌లోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్, కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం వి.భాగ్యారెడ్డి వర్మ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్, కులాల అభివృద్ధి శాఖ అధికారి జి.వినోద్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భూ బకాసురులపై పోలీసులకు ఎమ్మార్వో ఫిర్యాదు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా చేసి, కాజేసేందుకు ప్లాన్ చేస్తున్నారని పేట్ బషీరాబాద్ పోలీసులకు కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో రెహమాన్ ఫిర్యాదు చేశారు. కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్ సర్వే నంబర్ 25/1, 25/2 లలో ఉన్న యాదిరెడ్డి బండ, రంగారెడ్డి బండ ప్రాంతాలలో ప్రభుత్వ భూమిలో క్వారీ గుంతలుగా ఉన్న ప్రభుత్వ భూమిని భూ బకాసురులు మట్టి వేసి, పూడ్చి రూములు నిర్మించి విక్రయాలకు పాల్పడుతున్నారు. ఈ తతంగంపై ఇప్పటికే అనేక సార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. తాజాగా ఈ వ్యవహారంపై కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో రెహమాన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. సంపంగి వెంకటేష్ , ఇందిరా రెడ్డి , రామ్ రెడ్డి , ఆలకుంట సురేష్ , గంగుల లక్ష్మయ్య , పసుపుల కొండయ్య , శ్రీకాంత్, బాలకష్ణ , దంగుల లక్ష్మి, లక్ష్మమ్మ , రాములమ్మ , ముతారి సుక్కమ్మ , వలపు వెంకటమ్మ, నాగమణి యాదమ్మ లపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా వీరిలో కొంతమంది పై గతంలో అనేకసార్లు కబ్జా కేసులో పోలీసులు నమోదు చేశారు. అయినప్పటికీ వారు పేట్ బషీరాబాద్ ప్రభుత్వ భూములు కబ్జా చేసే ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వీఎన్ఆర్‌కు ఘన నివాళులు



నవతెలంగాణ - కూకట్ పల్లి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివద్ధి సంస్థ మాజీ చైర్మెన్ వడ్డేపల్లి నర్సింగ్ రావు 12వ వర్ధంతి సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్‌లోని ఆయన విగ్రహానికి ఆయన కుమారుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గంలో వడ్డేపల్లి నర్సింగ్ రావు ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టారని, ఆయన స్పూర్తితోనే ముందుకు వెళ్ళాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ప్రారంభమైన నల్లగుట్ట శ్రీ లక్ష్మి నరసింహస్వామి జయంతి వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి సూపర్ మ్యాక్స్ పరిశ్రమ ఆవరణలో గల నల్లగుట్ట శ్రీ లక్ష్మి నరసింహస్వామి జయంతి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు గాజులరామారం డివిజన్ కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరితో పాటు హెచ్ఏఎల్ బోర్డు మాజీ మెంబర్, బీజేపీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డిలు హాజరై ఆలయ ధర్మకర్తలతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. స్వామి వారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని కోరారు. అనంతరం వారిని సన్మానించారు.ఈ కార్యక్ర మంలో ఆలయ ధర్మకర్త ఆముర ఇంద్రసేన గుప్తా,కమిటీ సభ్యులు యాదగిరి, నరసింహారెడ్డి,సురేష్,రాములు,రావుల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యుత్ మరమ్మతుల కారణంగా 11 కెవి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం కలుగుతుందని భాగ్యనగర్ ఏఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి ఫిడర్ పరిధిలోని షంషీగూడ సబ్ స్టేషన్ నుండి వెలువడే 11 కెవి జన్మభూమి ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11:00 గంటల నుండి 12: 30 గంటల వరకు జన్మభూమి కాలనీ, శివమ్మ కాలనీ, దత్తాత్రేయ కాలనీ, కమలమ్మ బస్తీ, పీజేఆర్ నగర్ బ్లాక్ 60 నుండి 70 వరకు, 33/11కెవి హెచ్ఎంటీ హిల్స్ సబ్ స్టేషన్ నుండి 11కెవి పోలీస్ స్టేషన్ వరకు మధ్యాహ్నం 1:30 నుండి 3:00 గంటల వరకు జల వాయు విహార్, అడ్డగుట్ట రోడ్ నెం 10,11,12, సమతానగర్ లలొ 11 కెవి హెచ్ఎంటీ హిల్స్ ఫీడర్ 33/11కెవి కేపీహెచ్బీ సబ్ స్టేషన్ నుండి మధ్యాహ్నం 3:30 నుండి 5:00 గంటల వరకు, అడ్డగుట్ట రోడ్డునెం 1,2,3 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

'బిట్స్'లో అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్), పిలానీ వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్స్ విభాగం, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ డొమైన్‌లలో విస్తత శ్రేణిలో ఎంటెక్., ఎంబీఏ, ఎంఎస్సీ, బీటెక్ ప్రోగ్రామ్‌లలో చేరేందుకు అడ్మిషన్లను ప్రారంభించింది. ఈ ప్రోగ్రామ్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ జూన్ 17గా యాజమాన్యం ప్రకటించింది. ఈ పోర్ట్‌ఫోలియో 15 ఎంటెక్., 8 ఎంబీఏ, 3 బీటెక్, 3 పీజీ డిప్లొమా, 1 పీజీ సర్టిఫికెట్, 2 ఎంఎస్సీ ప్రోగ్రామ్స్ ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లలో పాల్గొనేవారు కేస్ స్టడీస్, బిజినెస్ సిమ్యులేషన్‌లతో సహా అనుభవపూర్వక అభ్యాస అసైన్‌మెంట్ల ద్వారా నైపుణ్యాలను పొందేందుకు మేనేజ్‌మెంట్, అనలిటిక్స్, ఫైనాన్స్ ల్యాబ్‌లతో సహా బిట్స్ పిలానీ అత్యాధునిక ల్యాబ్‌లను కూడా ఉపయోగించుకోవచ్చు.

విద్యార్థులు మత్తు పదార్థాలను దరిచేరనియ్యకండి

- డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బనగిరి చైతన్య రెడ్డి
- బాలానగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్‌కు డీవైఎఫ్ఐ వినతిపత్రం



నవతెలంగాణ - బాలానగర్

విద్యార్థులు మత్తు పదార్థాలను దరిచేరనియ్యవద్దనిడీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బనగిరి చైతన్య రెడ్డి సూచించారు. కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీ, బస్తీలో యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, మత్తు పదార్థాలను అరికట్టేందుకు బుధవారం బాలానగర్ సీఐ నవీన్ కుమార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో, బస్తీలలో నిర్మానుష్య ప్రదేశాలను ఎంచుకుని కొందరు యువకులు మత్తు పదార్థాలను సేవిస్తూ స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. అట్టి వారిపై, గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో యువత, తల్లిదండ్రులతో కలిసి మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా పోలీసులు సైతం భాగస్వామ్యం కావాలని, యువతకు తమ వంతు అవగాహన కల్పించి మాదకద్రవ్యాల నిర్మూలనకు కషి చేయాలని, ముఖ్యంగా నిర్మానుషమైన ప్రదేశాలలో ముఖ్యంగా రాత్రి వేళలో గస్తీ నిర్వహించాలని సీఐను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకునేందుకు పెట్రోలింగ్ పెంచుతామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాంతి భద్రతకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గుట్టమీద కార్తిక్, డీవైఎఫ్ఐ నాయకులు నగేష్ సతీష్ కుమార్, ఎస్. మల్లేష్, శ్రీను, రాజు, అభి, అరుణ్, అనిల్, మాజీ డీవైఎఫ్ఐ నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

సానుభూతితో రోగిని స్పర్శించడం మరవద్దు



- శ్రీ శ్రీ హొలిస్టిక్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆలూరి తుషార

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మొగ్గదశలో ఉన్న మీరు ఎంపిక చేసుకునే ఈ మార్గం సవాళ్ళతో కూడకున్నదేకాక ఎనలేని సంతప్తిని, అమితమైన సంతోషాన్ని అందించే దివ్య పథమని శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆలూరి తుషార అన్నారు. హెూలిస్టిక్ హాస్పటల్‌లో భావి వైద్యులు కావాలని ఆకాంక్షించే బాలబాలికలకు స్పూర్తిని నింపే లక్ష్యంతో " బడ్డింగ్ డాక్టర్స్ - ఇగ్నైటింగ్ యంగ్ మైండ్స్ " పేరిట 'మే' నెల 21, 22 తేదీలలో నిర్వహించిన వినూత్న వర్క్ షాప్ లో వివిధ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన బాలబాలికలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. వైద్య వత్తి కి హదయస్థానంలో ఉండవలసింది సహానుభూతి అన్నారు. వైద్యులుగా రూపొందే మీ శోభస్కర ప్రస్థానంలో మీరు అర్ధం చేసుకోవలసింది వైద్యం అంటే కేవలం వ్యాధి నిర్ధారణ చెయ్యడం, చికిత్స చెయ్యడం మాత్రమే కాదు, వ్యాధులతో మన దగ్గరకు వచ్చిన వారి శారీరక రుగ్మతతో పాటు మానసిక వేదనను, కుంగుబాటును కూడా పరిగణనలోకి తీసుకుని వారికి సానుభూతితో స్వాంతన కలిగించడం అని చెప్పారు. కష్టతరమైన కేసుల చికిత్సల ధ్యాసలో నిద్రాహారాల్ని పట్టించుకోకుండా గంటల తరబడి పని చెయ్యవలసిన పరిస్థితి ఎదురవవచ్చునన్నారు. ఎంత కష్టపడి ప్రయత్నించినప్పటికి చివరికి రోగికి నయంకాకపోవ చ్చు అని.. ప్రాణం దక్కక పోవచ్చు అని.. ఎన్ని సవాళ్ళను ఎదుర్కోవలసి వచ్చినప్పటికి సానుభూతితో రోగిని స్పర్శించడం మరవొద్దన్నారు. సహానుభూతి మీకు దారిదీపం, అదిమీకు రోగితో గాఢమైన అనుబంధాన్ని నిర్మిస్తుందన్నారు. అనంతరం శ్రీ సంత్ స్వరూప్ శర్మ మహోజ్జ్వల సంచాలనతో ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా, అర్థవంతంగా జరిగిన ఈ వర్క్ షాప్ లో హాస్పటల్ చైర్మెన్ డా.వి.ఎస్. రామచంద్ర తో పాటు హాస్పటల్ లో సేవలందిస్తు న్న పలువురు వైద్యులు బాలబాలికలకు మార్గనిర్దేశ నం చేశారు. బాలబాలికల తల్లిదండ్రులు కూడా ఎంతో ఆసక్తితో ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శరత్ బాబు తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించేందుకు గాను 11కేవీ ఫీడర్‌ల విద్యుత్ అంతరాయం వివరాలను బుధవారం వెల్లడించారు. 33/11కేవీ సోమశిల సబ్ స్టేషన్ నుంచి వెలువడే 11కేవీ మాధవరం నగర్ ఫీడర్ ఉదయం 11 గంటల నుండి 12.30 గంటల వరకు, మాధవరం నగర్, కమలా ప్రసన్న నగర్, ఆల్విన్ కాలనీ ఫేజ్-1, దీనబంధు కాలనీ ప్రాంతాల్లో, రెండోది 33/11కేవీ విజయ్ నగర్ కాలనీ సబ్ స్టేషన్ నుండి వెలువడే 11కేవీ ఆల్విన్ కాలనీ ఫీడర్ మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 03 గంటల వరకు, సాయి నగర్, ఫేజ్-1, సాయికల్యాణ్ మండపం ప్రాంతం, రాఘవేంద్ర కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులకు సూచించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సెక్యూరిటీ గార్డ్‌లకు వెంటనే వేతనాలివ్వాలి

- సీఐటీయూ మేడ్చల్ జిల్లా నాయకులు ఎం.శంకర్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సెక్యూరిటీ గార్డ్‌లకు వెంటనే వేతనాలివ్వాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా నాయకులు ఎం శంకర్ అన్నారు. బుధవారం కూకట్ పల్లి మండల పరిధిలోని కెపిహెచ్‌బీ పీఎస్ఆర్ మాల్‌లో ఎంబిజీ ఫెసిలిటీ సర్వీసెస్ సెక్యూరిటీ కంపెనీ వారు గత సంవత్సర కాలం నుంచి కొంతమంది సెక్యూరిటీ గార్డ్‌లతో పని చేయించుకున్నారు. అయితే 15 మంది సెక్యూరిటీ గార్డ్‌లకు వేతనాలు ఇవ్వట్లేదని ఆయనతో పాటు కూకట్ పల్లి మండల కార్యదర్శి కే కష్ణా నాయక్‌లు పాల్గొని నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వెంటనే పీఎస్ఆర్ మాల్ కేపీహెచ్‌బీ కాంట్రాక్టర్ ఎంబిజి ఫెసిలిటీ సర్వీస్ వారు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని ఏప్రిల్ నెల వేతనాలు 15 మంది సెక్యూరిటీ గార్డ్‌లకు ఈనెల ఇవ్వలేదని వారికి వెంటనే వేతనాలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టర్ మొండికేయడంతో కేపిహెచ్‌బీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని, పోలీసు అధికారులు వారితో మాట్లాడి వేతనాలు చెల్లించేలా చేయాలని కోరారు. దీనికి 25వ తారీకు అందరికీ వేతనాలు చెల్లిస్తానని యాజమాన్యం నుండి హామీ వచ్చింది. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సతీష్ , సీఐటీయూ నాయకులు షాబుద్దీన్, రాములు, నరసింహ, కార్మికులు అజయ్, సాగర్, ఆజం , అన్సారి, మోహన్, పురేందర్, నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు.. బస్వయ్య కన్నుమూత



నవతెలంగాణ-సిటీడెస్క్

వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు కొప్పు బస్వయ్య (110) అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. మంచికి మారు పేరుగా అందరినీ ఆప్యాయతతో పలకరించే గొప్ప వ్యక్తి మరణించడంతో గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా సాయం కోసం తన దగ్గరికి వెళ్లే వారికి తప్పకుండా సాయం చేసేవారని గ్రామస్తులు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని విలపించారు. బస్వయ్య జీవించి ఉన్నంత కాలం ఆయన కొడుకులు ఉమ్మడి కుటుంబంగా ఉన్నారని, భవిష్యత్‌లో కూడా అలాగే ఉండాలని ఆయనను అభిమానించేవారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా మృతుడు బస్వయ్యకు భార్య కొప్పు ఎల్లమ్మ, కుమారులు కృష్ణయ్య, లక్ష్మయ్య, శంకరయ్య, రాములు, కోడళ్ళు కిష్టమ్మ వెంకటమ్మ, లక్ష్మమ్మ సుజాత, కూతుళ్లు జంగమ్మ, బాలమ్మ ఉన్నారు. అల్లుడు పాపయ్య, మనుమలు రవి, మహేష్, రాజు, అంజన్, విష్ణు, భరత్, శ్రీశైలం, తేజ, కార్తీక్, శ్రీకాంత్, జగపతి, వెంకటయ్య, సుధాకర్, ఈశ్వర్, ధనంజయ్య, హరీష్, సాయి, విక్కీ, నిహాన్ష్, దీక్షిత్, మోక్షిత్, ప్రిన్స్ మహేష్ ఉన్నారు. మనుమరాళ్లు అలివేల, సౌజన్య, చందన, మనీష, స్వాతి, రజిత, అరుణ, పావనీ, గంగా, పూజ, స్వాతి, దీప, బాలమణి, నందిని, చుట్కీ, నిహాన్విక, ఉన్నారు. మొత్తం 70మందికి పైగా ఉన్నారు.

నర్సులను అమ్మ అని పిలవడమే సముచితం



డా.మమతా రఘువీర్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నర్సులను సిస్టర్ అని పిలవడం కంటే అమ్మ అని పిలవడమే సముచితంగా ఉంటుందని అంతర్జాతీయ గుర్తింపు పొందిన డా.మమతా రఘువీర్ అన్నారు. శ్రీ శ్రీ హెూలిస్టిక్ హాస్పటల్‌లో బుధవారం జరిగిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవం, మాతదినోత్సవ వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిచారు. ఆధునిక కాలంలో స్త్రీలు ఇంటా, బయట పనితో పాటు పిల్లల సంరక్షణను చేసుకోడానికి ఒత్తిడికి లోనవుతున్నారని, వారు తమ ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలని కోరారు. నర్సుల వత్తి చాలా మహోన్నతమైన వత్తి అని, రోగికి బాధ నివత్తి అయ్యాక ముందు స్మరించుకునేది నర్సులనేనన్నారు. సభకు డా. ఆలూరి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. హాస్పటల్ చైర్మెన్ డా.వి.ఎస్.రామచంద్ర, మేనేజింగ్ డైరెక్టర్ డా.తుషార నర్సులకు, సమావేశంలో పాల్గొన్న తల్లులకు శుభాకాంక్షలు తెలిపారు. హాస్పటల్‌లో ప్రసవించిన కొంతమంది తల్లులను వీరపనేని కామాక్షమ్మ సత్కరించి శుభాశీస్సులందించారు. అనంతరం అత్యుత్తమ సేవలందించిన నర్సులను సన్మానించారు.

క్యాన్సర్ సంరక్షణలో ఏఐఓ విప్లవాత్మక పురోగతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ లోని సిటిజన్స్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద ఉన్న అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్ (ఏఓఐ) క్యాన్సర్ సంరక్షణలో విప్లవాత్మక పురోగతిని సాధించినట్టు వెల్లడించింది. కార్సినోమా అనోరెక్టమ్‌తో బాధపడుతున్న 58 ఏండ్ల మహిళా రోగికి ఆవిష్కరణ, శ్రేష్ఠతతో, ఏఓఐ నిపుణుల బృందం, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వినీత రెడ్డి నేతత్వంలో విజయవంతంగా చికిత్స అందించింది. కార్సినోమా అనోరెక్టమ్ అనేది పాయువు, పురీషనాళాన్ని ప్రభావితం చేసే ఒక రకమైన క్యాన్సర్. దీనికి చికిత్స అందించటం ప్రత్యేకమైన సవాలుగా నిలుస్తుంది. అయినప్పటికీ, మల్టీడిసిప్లినరీ విధానం, అత్యాధునిక సాంకేతికతతో, ఏఓఐలోని రేడియేషన్ బృందం రోగి అవసరాలకు అనుగుణంగా వ్యక్తిగతీకరించిన సంరక్షణను అందించింది. రోగి మొదట్లో పురీషనాళ రక్తస్రావం (పీఆర్) సమస్యతో వచ్చారు. నిష్ణాతులైన డాక్టర్ వినీతారెడ్డి మార్గదర్శకత్వంలో రోగికి ఏకకాలిక కీమోరేడియేషన్ జరిగింది. అనుసరించి కీమోథెరపీ చేయటంతో కణితి పూర్తిగా తగ్గిపోయింది. ఈ కారణం చేత శస్త్ర చికిత్సను నివారించగలిగారు. లేదంటే, అబ్డోమినల్ పెరినియల్ రిసెక్షన్ (పురీషనాళం, పాయువుతో పాటుగా ఉదరం ఉపరితలంపై జతచేయబడిన పేగు చివరను తొలగించడం, శాశ్వత కోలోస్టోమీ చేయాల్సి ఉండేది). ఈ చికిత్స అందించి ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలమే అయింది. ఎంఆర్, కోలనోస్కోపీ చేసినప్పటికీ, వ్యాధికి సంబంధించిన ఎటు వంటి రుజువూ ఇప్పుడు కనిపించలేదు. డాక్టర్ వినీత రెడ్డి మాట్లాడుతూ.. 'రెక్టల్ క్యాన్సర్ పరంగా మెరుగైన ఫలితాలను సాధించడానికి ప్రత్యేక చికిత్సా విధానం అవసరం. మా బృందం ట్రూబీమ్ ర్యాపిడ్ ఆర్క్ రేడియేషన్ థెరపీతో సహా అధునాతన పద్ధతులను ఉపయోగించి, కణితిని ఖచ్చితంగా లక్ష్యంగా చేసుకుని చికిత్స అందించింది. చికిత్సా ఎంపికలను మెరుగుపరచడంలో, రోగి ఫలితాలను వృద్ధి చేయటం మార్గనిర్దేశం చేస్తుంది' అని అన్నారు.

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం

నవతెలంగాణ-కొత్తూరు

కొత్తూరు మున్సిపాలిటీలో ఈనెల 19న ఇంటి నుండి బయలుదేరి అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభించింది. కొత్తూరు సీఐ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం పారిశ్రామికవాడలోని బిందు సారియ పరిశ్రమలో పనిచేస్తున్న సుజిత్ దాస్ ఈనెల 19న ఇంటి నుండి బయలుదేరి తిరిగి ఇంటికి చేరుకోలేదు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న కొత్తూరు పోలీసులు బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా కొత్తూరు పోలీసు బృందం పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తెచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

10

నవతెలంగాణ

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

గురువారం | మే 23, 2024 | www.navatelangana.com

పనిచేస్తున్న ప్రొఫెసర్లకు ఏరియర్స్ ఇవ్వాలి

- ఓయూ ఔట అధ్యక్షుడు ప్రొ.బి.మనోహర్

నవతెలంగాణ-ఓయూ

ప్రస్తుతం పనిచేస్తున్న ప్రొఫెసర్లకు కూడా ఏరియర్స్ ఇవ్వాలని ఓయూ ఔట అధ్యక్షుడు ప్రొ.బి.మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి , రాష్ట్ర సీఎస్‌కు ఆయన ప్రత్యేకంగా లేఖ రాశారు. ఓయూ మాజీ వీసీ పదవీ విరమణకు వారం రోజుల ముందు పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్లకు ఏరియర్స్ ఇచ్చి ప్రస్తుతం పనిచేస్తున్న ప్రొఫెసర్లకు ఏరియర్స్ ఇవ్వక పోవడం ఏంటని ప్రశ్నించారు. ఎలాంటి ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా ఏరియర్స్ చెల్లించడం పై స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం పనిచేస్తున్న ప్రొఫెసర్లు కూడా ఏరియర్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ ప్రొఫెసర్లపై ప్రొ.తిరుపతి రావు కమిటీ జనవరిలో రిపోర్టు సబిమిట్ చేసినా నేటి వరకు అక్రమంగా ప్రమోషన్ పొందిన ప్రొఫెసర్లపై నేటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని , సదరు రిపోర్టు బహిర్గతం చేసి చర్యలు తీసుకోవాలని లేదంటే న్యాయ స్థానాన్ని ఆశ్రయించనున్నట్టు చెప్పారు.



జూబ్లీ హిల్స్‌లోని కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్క్‌లో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

మద్యం లోడ్ వ్యాన్ బోల్తా











మద్యం లోడుతో వెళ్తున్న వ్యాన్ డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిన ఘటన బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోయిన్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ ప్రాంతానికి చెందిన బసలింగప్ప తనతో పాటు ఇద్దరు సహాయకులతో కలిసి కొంపల్లిలోని మద్యం గోడౌన్ నుంచి సుమారు రూ. 32 లక్షల విలువ చేసే మద్యం సీసాలతో కూడిన కార్టన్ బాక్స్‌లను లోడ్ చేసుకొని బంజారాహిల్స్‌లోని మద్యం దుకాణాలకు బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో బోయిన్‌పల్లి ఎమ్ఎస్ఆర్ గార్డెన్ సమీపంలోకి రాగానే డీసీఎం వ్యాన్ టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పిన వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో మద్యం సీసాలతో పాటు కార్టన్ బాక్స్‌లు కిందపడిపోయాయి. అది గమనించిన వాహనదారులతో పాటు పాదచారులు ఒక్కసారి అక్కడకు చేరుకొని మద్యం సీసాలను తీసుకొని పరారికి యత్నించారు. వెంటనే డీసీఎం డ్రైవర్‌తో పాటు అతని సహాయకులు మద్యం సీసాలను పట్టుకెళ్తున్న వారిని నిలువరించారు. సమాచారం అందుకున్న బోయినపల్లి పోలీసులతో పాటు ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బారీకేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నివారించారు. మెడ్చల్ జాతీయ రహదారి కావటంతో గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓయూ వీసీగా దాన కిషోర్ బాధ్యతలు





నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా లాంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా బాధ్యతలు తీసుకోవటం గౌరవంగా భావిస్తున్నానని సీనియర్ ఐఏఎస్ అధికారి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దాన కిషోర్ అన్నారు. బుధవారం ఓయూ వీసీ కార్యాలయంలో యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఓయూ పరిపాలనా భవన్‌కు చేరుకున్న ఆయన మాజీ వీసీ ప్రొ. రవిందర్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. రిజిస్ట్రార్ ప్రొ.పప్పుల. పి. లక్ష్మీనారాయణ, ఓఎస్డీ బి. రెడ్యానాయక్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకున్న పరిధి మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిరంతర ఉత్సాహం, ఉత్తేజంతో పాటు విభిన్న రంగాల్లో నాయకత్వాన్ని అందించిన ఘనత ఉస్మానియా సొంతమన్నారు. తాను ఎన్నో కీలక పదవులు చేపట్టినప్పటికీ ఉస్మానియా ఇన్‌చార్జి ఉపకులపతిగా బాధ్యతలు తీసుకోవటం భిన్నమైన అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. ఆయనతో పలువురు డీన్లు, ఆయా విభాగాల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు కాసేపు ముచ్చటించి శుభాకాంక్షలు తెలియజేశారు.

జూన్ 2 లోపు రెగ్యులర్ వీసీలను నియమించాలి



- పీడీఎస్‌యూ నేతలు

నవతెలంగాణ -ఓయూ

రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో రెగ్యులర్ వీసీలను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 లోపు నియమించాలని పీడీఎస్‌యూ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్ లో పీడీఎస్‌యూ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పి.డి.ఎస్.యూ నేతలు ఎస్ .నాగేశ్వర రావు, ఎస్.సుమంత్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలలో ఇన్‌చార్జీల పాలనను గతంలో వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇన్‌చార్జ్ వీసీ లను నియమించడం విద్యార్థి లోకాన్ని విస్మయానికి గురిచేసిందన్నారు. తక్షణమే రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ నియామకం పై దృష్టి కేంద్రీకరించాలని డిమాండ్ చేశారు. తాజాగా నియమించిన వీసీలు ఐ.ఏ.ఎస్ అధికారులుగా ప్రభుత్వంలోనీ ఆయా శాఖలలో బాధ్యతలు నిర్వహించే వారు కావడం వల్ల విశ్వవిద్యాలయాల పరిపాలన బాధ్యతలు జోడుగా నిర్వహించడం విద్యార్థుల సంక్షేమానికి ఆటంకం అవుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర విశ్వవిద్యాలయాల అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ లోపు ప్రొఫెసర్లను వైస్ ఛాన్సలర్లుగా నియమించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వ విద్యాలయాలు గత పదేండ్లలో కేసీఆర్ పాలనలో తీవ్రమైన సమస్యలకు నిలయాలుగా మారాయని అన్నారు. కేసీఆర్ నియమించిన వీసీ లు అవినితి చిరునామాగా, విద్యార్థుల సంక్షేమానికి వ్యతిరేకంగా పాలన చేశారన్నారు. యూనివర్సిటీలలో తీవ్ర నిర్బంధాన్ని అమలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ బాటలో నడుస్తుందా అనే సందేహం కలుగుతోందన్నారు. విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమస్యల పరిష్కారం కేంద్రంగా, టీచింగ్, నాన్ టీచింగ్ వర్గాల సమస్యల పరిష్కారం కోసం యూనివర్సిటీలో నిరంతరం అందుబాటులో ఉండేవారు వీసీ గా ఉంటే వర్సిటీకి ఉపయోగకరమని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్లను రెగ్యులర్ వైస్ ఛాన్సలర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి. డి.ఎస్.యూ ఓయూ నాయకులు ప్రశాంత్, సంతోష్,కార్తీక్, మధు, సురేఖ, ప్రవీణ్, మహేష్, శ్రీకాంత్, బాలు పాల్గొన్నారు.

పూలు పాలు అమ్ముడే కాదు మల్లారెడ్డి భూకబ్జాలు చేసిండు



- పేట్ బషీరాబాద్ భూ బాధితులు

నవతెలంగాణ - బంజారాహిల్స్

పూలు పాలు అమ్ముడే కాదు భూకబ్జాలు చేస్తాడని మల్లారెడ్డి పేరుందని పేట్ బషీరాబాద్ భూ బాధితులు ఆరోపించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో భూ బాధితులు శ్రీనివాస్ రెడ్డితో పాటు రాజేష్, ఎండీ బషీర్‌లు మాట్లాడారు. పేట్ బషీరాబాద్ లోని 82 సర్వే నంబర్‌లో ఎకరం 29 గుంటల కన్నా.. ఎక్కువ ఉంటే మీకు సారీ చెప్పి రాజకీయాల నుంచి వెళ్లిపోతనని మాజీ మంత్రి మల్లారెడ్డి చెప్పారని అన్నారు. అయితే రెవెన్యూశాఖ వారు ఆదివారం చేసిన సర్వేలో 82 సర్వే నంబర్‌లో మల్లారెడ్డికి చెందిన ఎకరం 29 గుంటలతో పాటు.. తమకు చెందిన 33 గుంటలు సైతం తేలిందని తెలిపారు. తమకు సంబంధించినది 33 గుంటలలో తమకు పొజిషన్ ఇప్పించాలనీ ప్రభుత్వాన్ని రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి మల్లారెడ్డి,ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి ముందే ఈ సర్వే జరిగిందని, మల్లారెడ్డి మాట మీద నిలబడి నిజాయితీని చాటుకోవాలనీ వారు కోరారు. 2016 లో మల్లారెడ్డి బీఆర్ఎస్‌లో చేరిన తర్వాత తమ పార్టీషన్ తీసేసి తమపైన కేసు పెట్టించాడని, అప్పుడు పోలీసులను ఆశ్రయిస్తే కోర్టుకు వెళ్లమన్నారన్నారు. కోర్టు నుంచి నాట్ టు ఇంటర్ ఫియర్ అనే ఆర్డర్ తీసుకొచ్చినా కోర్ట్ ఆర్డర్ ఉన్నా అప్పట్లో తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాల మేరకే తమ దగ్గరున్న భూ దస్తావేజులు తీసుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆధారాలు చూపి ల్యాండ్‌లో బ్లూ షీట్స్ వేసుకున్నామని వారు చెప్పారు. కానీ పోలీసుల ముందే తాము వేసిన బ్లూ షీట్స్ తొలగిస్తూ తమపై దాడులు చేయడమే కాకుండా పోలీసుల ముందే తమను చంపేస్తామని బెదిరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగ రెడ్డి,రామారావు, రణధీర్, సుదమ్మ తదితరాలు పాల్గొన్నారు.



రూ. 7,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

నవతెలంగాణ-ఓయూ

ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల రూ. 7,500 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని సచివాలయంలోని ఆర్థిక శాఖ పేషీలో వినతిపత్రం సమర్పించినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కోసం ఎదురు చూస్తున్నారని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని కోరారు. అటు ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు మాత్రం పూర్తి ఫీజు చెల్లిస్తేనే విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు రవి కిరణ్ పాల్గొన్నారు.

ఓయూ వీసీని కలిసిన విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన దానం కిషోర్‌ను బుధవారం ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు , క్రీడాకారులకు జరుగుతున్న అన్యాయాల గురించి వివరించారు. ఐయూటీ ఫండ్, ఉస్మానియా యూనివర్సిటీ లో జరిగిన అవకతవకల గురించి సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై వైస్ ఛాన్సలర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అశోక్ నాయక్, వెంకటప్ప, సతీష్, జగదీష్, శ్రావణ్, వినోద్, ప్రవీణ్, ప్రసాద్, చందు జంపన్న పాల్గొన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డివర్మ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఓయూ

దళితోద్యమ తొలిపొద్దు భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి కార్యక్రమం ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (ఏఎంఎస్ఏ) అధ్యక్షులు నామ సైదులు ఆధ్వర్యంలో బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఘనంగా నిర్వహించారు. నామ సైదులు మాట్లాడుతూ భాగ్యరెడ్డివర్మ దక్కన్ పీఠభూమిలో భాగ్యనగరం నడిబొడ్డున జన్మించిన ధ్రువతార అని, సామాజిక ఉద్యమకారులకు తొలి గురువు అన్నారు. సాధారణ దళిత మాల కుటుంబానికి చెందిన మాదిరి వెంకటయ్య, రంగమాంబ దంపతులకు హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లో భాగ్యరెడ్డి వర్మ 1888 మే 22న జన్మించారని తెలిపారు. యుక్త వయసులో సుల్తాన్ బజార్‌లో ఆర్య సమాజంలో కొంతకాలం పని చేశాడని, ఆర్య సమాజం నిర్వాహకులు కిషన్ రావు ఆయన సేవలను గుర్తించి వర్మ అనే బిరుదు ఇచ్చారని తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ ఆ రోజుల్లో రెడ్డి కులానికి ఇచ్చే గౌరవాన్ని చూసి రెడ్డి అంటే పరిపాలదక్షుడిగా గౌరవం ఉంటుందని వారి కన్నా తమ జాతులు తక్కువ కాదని ఆయన పేరులో రెడ్డి చేర్చుకున్నాడని తెలిపారు.

హిందూ సమాజంలో అస్పృశ్యత వ్యక్తుల మధ్య వ్యత్యాసం గమనించిన భాగ్యరెడ్డి వర్మ అణగారిన వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి దళిత బాలికలకోసం 26పాఠశాలలో నెలకొల్పాడని గుర్తు చేశారు. బస్తీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఒకవైపు విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తూనే సాంఘిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. జగన్ మిత్రమండలి, ఆది హిందూ సోషల్ లీగ్ లీగ్ లీగ్ సంస్థలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎం శ్రీకాంత్ యాదవ్, ఉదయ్,గోపి బసవరాజు, శ్రీను, దామోదర్, పాల్గొన్నారు.



బోధన ,బోధనేతర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి : ప్రొ.మల్లేశ్

నవతెలంగాణ-ఓయూ

దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఓయూ ఇన్‌చార్జి వీసీ ఎం. దానకిశోర్‌ను బోధన, బోధనేతర ఉద్యోగ సంఘాల నేతలు బుధవారం కలిసి కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌తో పాటు అద్యాపకుల పదవీ విరమణ వయస్సును 65 ఏండ్లకు పెంచేందుకు ప్రభుత్వంతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు దానకిశోర్ సానుకూలంగా స్పందించారని ఉస్మానియా విశ్వవిద్యాలయ టీచర్స్ అసోసియేషన్ ఔటా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ జి. మల్లేశం తెలిపారు. సీపీఎస్ తో పాటు వయోపరిమితి పెంపు కోసం ప్రభుత్వంతో మాట్లాడతానని చెప్పినట్లు వెల్లడించారు. ఓయూ ఇన్‌చార్జి ఉపకులపతిగా పదవీబాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి దానకిశోర్ కు ఔటా తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్ తో పాటు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జనసభ మెరుపు ధర్నా





నవతెలంగాణ-బంజారా హిల్స్

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపునకు డిమాండ్ చేస్తూ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర బీసీ జనసభ బుధవారం మెరుపు ధర్నా చేపట్టింది. అడ్డుకోబోయిన పోలీసులకు ఆందోళనకారుల మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో అక్కడ కాసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఎదురయ్యాయి. దాదాపు 2 గంటలపాటు ధర్నా కార్యక్రమాన్ని ప్ల కార్డులు చేత పట్టుకుని అంబేద్కర్ విగ్రహం వద్ద కూర్చొని శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి విజయభేరీ సభలో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతుల మీదుగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్ కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలన్నారు. కానీ లోక్ సభ ఫలితాల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్, అధికార యంత్రాంగానికి సీఎం ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కులగణన, సామాజిక న్యాయం పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ది పొందిన కాంగ్రెస్..మరోసారి బీసీలను మోసం చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. కులగణన చెయ్యకుండా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఆగమేఘాల మీద స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏం ఉందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఒక చిత్తు కాగితమేనా అని నిలదీశారు. అయినా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమైతే.. జూన్ 8న ఇందిరాపార్కు దగ్గర వేలాది మందితో మహాధర్నా కార్యక్రమం చేస్తామని, అప్పుడు కూడా మొండిగా వెళ్తితే.. జూన్ 15న సెక్రటేరియట్ ను దిగ్బంధనం చేయనున్నట్టు రాజారాం యాదవ్ ప్రకటించారు. దశాబ్దాల సామాజిక వర్గాల న్యాయమైన డిమాండ్ సాధన కోసం తెలంగాణ ఉద్యమ తరహాలో మరో పోరాటానికి అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రాంకోటి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తి గౌడ్, టి.జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల క్రిష్ణ, బీసీ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ ఎల్చాల దత్తాత్రేయ, ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు రాజు ముదిరాజ్, నల్లగొండ జిల్లా యాదవ్ సంఘం అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్ యాదవ్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ నేత, బీసీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.కర్నాటి శ్రీనివాస్, విద్యార్థి, నిరుద్యో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి రాజుతోపాటు దాదాపు 200 మంది పాల్గొన్నారు.



మాజీ వీసీ ప్రొ.రాథోడ్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-ఓయూ

దేశంలోనే మొట్టమొదటి సారిగా వ్యాయామ విద్య విభాగం నుంచి పాలమూరు యూనివర్సిటీ మాజీ వీసీగా ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ తన పదవి కాలం ముగించుకొని బుధవారం విజయవంతంగా తిరిగి ఉస్మానియా యూనివర్సిటీలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో విధులలో చేరారు. ఈ సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్, స్కాలర్ , ఎంపీఈడీ విద్యార్థులతో పాటు టీచింగ్. నాన్ టీచింగ్ స్టాఫ్ అందరు కలిసి ప్రొ. లక్ష్మీకాంత్ రాథోడ్ కి శుభాకాంక్షలు తెలుపుతూ వారికి ఆహ్వానం పలికారు.


తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం


తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం

వర్షాకాలానికి ముందు
విద్యుత్ స్తంభాల భద్రతే ప్రధానం




నవతెలంగాణ-అల్వాల్

హైదరాబాద్ నగరంలో వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తమైంది నగర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ స్తంభాల భద్రతపై ముఖ్యంగా దృష్టి పెట్టింది. గతంలో వర్షాలు కురిసిన సమయంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు కారణమైన సంఘటనలు దృష్టిలో పెట్టుకొని వచ్చే వర్షాకాలానికి ముందుగానే ఎలాంటి అపాయాలు సంభవించకుండా విద్యుత్ శాఖ కార్యక్రమాలు చేపడుతోంది.

ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారులు నగర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ స్తంభాల స్థితిగతులను పరిశీలిస్తున్నారు. అవసరం ఉన్న వాటికీ మరమ్మత్తు చేయడం లేదా కొత్తగా స్థాపిస్తారని తెలుస్తోంది. ఎక్కడైనా తీగలు గుచ్చు గా ఉంటే వాటిని బిగిం చడం విద్యుత్ మార్గాలు చెట్ల కొమ్మలకు తాకుతూ ఉంటే వాటికి మరమ్మతులు చేయడం జరుగు తుంది. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండా లంటే ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఇదిలా ఉండగా ప్రస్తుతం ఆల్వాల్ వెంకటాపురం ఎస్‌బీఐ బ్యాంక్ వెనుక గల కొత్త బస్తీలో ఉన్న కరెంట్ స్తంభం ఎప్పుడో 30 ఏండ్ల కింద ఏర్పాటు చేసిందని తెలుస్తోంది. కరెంట్ స్తంభం లోని ఇనుప రాడ్లు బయటకు తేలి ఉన్నాయని ప్రమాదకరంగ మారే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. తక్షణమే నూతన కరెంట్ స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తెలంగాణ బాలోత్సవం
సమ్మర్ క్యాంప్ సంబరాలు

తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో 18 రోజులుగా నిర్వహించిన తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంపు ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు సంబరాలను హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.














నేడు బుద్ధ పూర్ణిమ (బుద్ధ జయంతి అని కూడా పిలుస్తారు). ఈ రోజు బౌద్ధమత స్థాపకుడు ప్రిన్స్ సిద్ధార్థ గౌతమ జన్మదినాన్ని జరుపుకుంటారు.

గౌరవనీయమైన II అదనపు .జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సంగారెడ్డి వద్ద
I.A.NO. 2023 లో 223
IN
O.S.NO. 2023 లో 279

మధ్య:
కె. చంద్రశేఖర్ రెడ్డి & మరొకరు. ...పిటిషనర్లు/వాది
మరియు
శ్రీమతి జి. వినీత & మరొకరు. ...ప్రతివాదులు/ప్రతివాదులు

కు,
D2 M/s. అభిరుచి ఆగ్రో ఫార్మ్స్, దాని ప్రతినిధి. పార్టనర్ శ్రీ.ఎం.వీర వెంకట సుబ్బా రావు, తండ్రి.లేట్ పెదపావన్న, చిరునామా ప్లాట్ నెం.38, రోడ్ నెం.71, జూబ్లీ హిల్స్, హైదరాబాద్.

నోటీసు

మా క్లయింట్లు కె.చంద్రశేఖర్ రెడ్డి & కె.శ్రావణి ధరణిలో మీకు వ్యతిరేకంగా మరియు మరొకరికి వ్యతిరేకంగా సై.నెం.372 విస్తీర్ణంలో భూమికి సంబంధించి టైటిల్ మరియు పర్యవసానమైన ఇంజక్షన్ & రెక్టిఫికేషన్ డిక్లరేషన్ కోసం పై దావా వేసినట్లు గమనించండి. 0-33gts, ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో మెదక్ జిల్లా పటాన్‌చెరు మండలం చిన్న కంజర్ల గ్రామంలో గౌరవనీయమైన II అదనపు జూనియర్ సివిల్ జడ్జి వద్ద: సంగారెడ్డి వద్ద ఉంది మరియు CPC యొక్క ఆర్డర్ 39 రూల్ 1 & @ కింద IA నం.223 ప్రకారం దరఖాస్తు 2023లో. పైన పేర్కొన్న IA మీ ప్రదర్శన కోసం 20-06-2024న పోస్ట్ చేయబడింది. ఆ రోజున మీరు గౌరవనీయులైన II అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఇక్కడ: సంగారెడ్డి ముందు 10.30 A.M. వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా విఫలమైతే మీరు లేనప్పుడు కేసు నిర్ణయించబడుతుంది.

// కోర్టు ఆదేశం ప్రకారం//
జె. రామ్ రెడ్డి,
పి. వివేకానంద్,
ఎం. వినోద్ కుమార్,
న్యాయవాదులు
సంగారెడ్డి

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY
O.S.NO.279 OF 2023

Between :
K.Chandra Shekar Reddy & Another ... Plaintiffs
AND
Smt.G.Vinitha & Another ...Defendants

To,
D.2 M/s. ABHIRUCHI AGRO FARMS, Rep By its. Partner Sri.M.Veera Venkata Subba Rao, S/o.Late Pedapapanna, R/o. Plot No.38. Road No.71, Jubilee Hills, Hyderabad.

NOTICE

Take notice that our clients K.Chandrashekar Reddy & K.Shravani filed the above Suit Suit for Declaration of Title and Conse quential Injunction & Rectification of Entries in Revenue Records in Dharani against you and another in respect of land in Sy.No.372 extent Ac.0-33gts, situated at Chinna Kanjarla Village, Patancheru Mandal, Medak District now in Sangareddy District before the Hon'ble II Additional Junior Civil Judge, At: Sangareddy. The above suit is posted on 20-06-2024 for your appearance. On that day you may appear before Hon'ble II Additional Junior Civil Judge, At: Sangareddy by 10.30 A.M. either in person or through advocate failing which the case will be decided in your absence.

// BY ORDER OF THE COURT//
J. RAM REDDY,
P. VIVEKANAND,
M. VINOD KUMAR,
ADVOCATES
SANGAREDDY

BEFORE THE HON'BLE JUDGE PRL FAMILY COURT CCC AT SECUNDERABAD
F.C.O.P. NO. 96 OF 2024

BETWEEN:
Smt. Jayalaxmi Jayalingam @ Laxmi Devi ....PETITIONER
AND
1. Tilaka Bai
2. GE/EM for Garrison Engineer (UTILITY), MES Ministry of Defence, E/M Mudford, Secunderabad
3. The Pension Officer, PCDA (P) Ministry of Defence, Allahabad.
.......RESPONDENTS

NOTICE

Please take notice that the above named petitioner filed the OP for Divorce, on the file of Hon'ble Judge Principal Family Court, Secunderabad against you. The Hon'ble Court is pleased order paper publication. The above case is posted to 10-06-2024 for your appearance. If you failed to appear before the above Hon'ble court on 10-06-2024 at 10-30 A.M. either in person or through your advocate the matter will be decided exparte, as per Law.

By order of court.
(B.K.M. CHAKRAVARTHY)
B. Mamatha, ADVOCATES
401, PRAGATHI RESIDENCY
EAST MARREDPALLY, SEC'BAD
9396478844, 9885022458
E.MAIL: mamtachakri@gmail.com

గౌరవనీయమైన II అదనపు .జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సంగారెడ్డి వద్ద
O.S.NO. 2023 లో 279

మధ్య:
కె. చంద్రశేఖర్ రెడ్డి & మరొకరు. ...వాదిదారులు
మరియు
శ్రీమతి జి. వినీత & మరొకరు. ...ప్రతివాదులు

కు,
D2 M/s. అభిరుచి ఆగ్రో ఫార్మ్స్, దాని ప్రతినిధి. పార్టనర్ శ్రీ.ఎం.వీర వెంకట సుబ్బా రావు, స/ఆ. లేట్ పెదపావన్న, చిరునామా ప్లాట్ నెం. 38, రోడ్ నెం.71, జూబ్లీ హిల్స్, హైదరాబాద్.

నోటీసు

// కోర్టు ఆదేశం ప్రకారం//
జె. రామ్ రెడ్డి,
పి. వివేకానంద్,
ఎం. వినోద్ కుమార్,
న్యాయవాదులు
సంగారెడ్డి

IN THE COURT OF THE X JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.S.No. 3736 OF 2022

BETWEEN:
IDBI Bank Ltd
Basheerbagh Branch,
Hyderabad.
Rep by its Asst. General Manager ...Plaintiff
and
Mr.Kota Sukesh Mohan and another ...Defendants
To
1. Mr.Kota Sukesh Mohan s/o Sri.Kota Karan, aged 42 yrs, 7-151/8, Bala Sarswathi Nagar, Malkajgiri, Hyderabad-500 047
2. Mrs. Kota Sujatha, w/o Sri.Kota Karan, aged 64 yrs, 7-151/8, Bala Sarswathi Nagar, Malkajgiri, Hyderabad - 500 047
(Defendants No. 1&2)

Please take notice that the above suit filed against you for recovery of money **Rs.13,83,929.56** is posted to **12-06-2024** for your appearance at 10.30 A.M. You can appear either in person or through an advocate before the said court on the said date, failing which, the matter will be will be decided ex-parte.

(By Court Order)
SRINIVAS CHITTURU)
ADVOCATE
3-4-533, BARKATPURA
HYDERABAD-500 027
COUNSEL FOR PLAINTIFF
Date: 12-05-2024

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client **INTI PARVATHI** W/o. Murali Presently R/o.Plot No.279, East Part, Judges Colony, Mansoorabad, L.B. Nagar, Hyderabad, submit that in the month of February, 2024, while travelling from Malkajgiri to Keesaragutta temple, she lost her bag containing other papers and Original Sale deed bearing document No.5421 of 1996, dated 28-08-1986, in respect of Plot No.75, admeasuring 300 sq. yards in survey nos. 13, 14, 16 Part and 18, situated at Kundhanapally Village, Medchal Taluk, erstwhile Ranga Reddy District.

Her father Late V. Sanyasi Rao has purchased and he is the owner of the said plot and my client is his daughter and she lost the said original document. My client put all her possible efforts in search, but all went in vain. So if any person or persons if found the above said documents may be pleased to handover them to my client or to the undersigned and such person will be suitably compensated.

Sd/-
E.VENUGOPAL
Advocate
Flat No.402, Madhavaram Elegance, Phase-IV, C.B.I.COLONY, VANASTHALIPURAM, HYD-70.
Phone: 9848870359

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR: NIZAMABAD
ARB No.32 of 2024

Between:
Kapil Chits (Kakatiya) Pvt. Ltd., Nizamabad-III Branch. ...Disputant
And
Nunugonda Sai Kiran & Others ...Opponents

TO,
3.Puppala Niranjan, S/o. Gangadhar, Age: 39yrs, Occ: Business, R/o.H.No:4-10, Dabilpur, Behind: Lingareddy, New House, Dist: Medchal-50140. Cell No: 9912509309.
4.Banoori Sateesh, S/o.Narsimlu, Age: 38yrs, Occ: Business, R/o. H.No:13-6-337/6, K.P.H.S Colony, Karwan, Kulsumpura High School Asifnagar, Hyderabad-500006. Cell:9030685143.
...Opponent No.3 & 4.

NOTICE

WHEREAS the disputant Chit Fund Company, has instituted the above said dispute for recovery of money and the same is posted for your appearance in the said Court **on the 12-06-2024 by 11:00 A.M.** If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparte.

//BY ORDER OF THIS OFFICE//
Sd/-
DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, NIZAMABAD

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.No.1477 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit CardDivision Koti, Hyderabad, rep.by its Sr. Manager(Law)&Authorized Officer ...Plaintiff
And
Sri.K.Anand Kumar ...Defendant

To
Sri.K.Anand Kumar, S/o. K.Venkateswar, Aged about 52Yrs Occ: Business, R/o.Plot No.38, H.No.11-3-215/F1, Venkateswara Colony, Saroornagar, Hyd-35.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,46,456-74ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 07-06-2024.

In case of your failure to attend before the Court **on 07-06-2024 at 10-30 A.M.** either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, HYD-50.

IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.No.4580 of 2023

Between:-
Union Bank of India [A Govt.of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law)&Authorized Officer, ...Plaintiff
And
Sri.V.Rajender Chary ...Defendant

To
Sri.V.Rajender Chary, S/o. V.Nageshwara Rao, Aged about 45 Yrs, Occ: Employee, R/o.H.No. 10-5-76/29 North Lallaguda Thukaram Gate, Opp of Railway Station Mylaranilayam, Secundara bad -500017

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,31,686-46ps_towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 06-06-2024.

In case of your failure to attend before the Court **on 06-06-2024 at 10-30 A.M.** either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, HYD-50.

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE AT SANGAREDDY
I.A.NO.223OF 2023
IN
O.S.NO.279 OF 2023

Between :
K.Chandra Shekar Reddy & Another ...Petitioners/Plaintiffs
AND
Smt.G.Vinitha & Another ...Respondents/Defendants

To,
D2 M/s. ABHIRUCHI AGRO FARMS, Rep By its. Partner Sri.M.Veera Venkata Subba Rao, S/o.Late Pedapapanna, R/o. Plot No.38. Road No.71, Jubilee Hills, Hyderabad.

NOTICE

Take notice that our clients K.Chandrashekar Reddy & K.Shravani filed the above Suit for Declaration of Title and Conse quential Injunction & Rectifi cation of Entries in Revenue Records in Dharani against you and another in respect of land in Sy.No.372 extent Ac.0-33gts, situated at Chinna Kanjarla Village, Patancheru Mandal, Medak District now in Sangareddy District before the Hon'ble II Additional Junior Civil Judge, At: Sangareddy and an application under Order 39 Rule 1 & @ of CPC vide IA No.223 of 2023. The above said IA is posted on 20-06-2024 for your appearance. On that day you may appear before Hon'ble II Additional Junior Civil Judge, At: Sangareddy by 10.30 A.M. either in person or through advocate failing which the case will be decided in your absence.

// BY ORDER OF THE COURT//
J. RAM REDDY,
P. VIVEKANAND,
M. VINOD KUMAR,
ADVOCATES
SANGAREDDY.

IN THE COURT OF THE XXIV ADDL. DISTRICT JUDGE, CITY CIVIL COURT: AT: HYDERABAD.
I.A.NO.465Of 2022
IN
O.S.NO.571 Of 2022

Between:
Gunguru Elizabeth Kumar ...Petitioner/Plaintiff
AND
Francis Nitin David & another, ...Respondents/Defendants

To,
Abdul Nabi, S/o.Baqeeth Bin Abdullah, Aged about 50 yrs, Occ: Business, R/o.H.No.10-1-11 25, A.C.Guards, Hyd T.S. ...Respondent No.2 /Defendant No.2

Sir,
Please take notice that the plaintiff filed the above suit for partition, separate possession and consequential relief of declaration to declare Development Agreement-Cum-GPA Doct.No.477/2020, dated 12-02-2020, as null and void against the defendants in respect of "A" suit property i.e. H.No.10-1-936, admeasuring 37 sq.yards, consisting ground 1 floor, situated at A.C.Guards, Khairtabad, Hyderabad, and "B" suit property i.e., H.No.6-3-213, admeasuring 227 sq.yards, or 190 sq.mtrs., out of 484 sq.yards, situated at Premnagar, Chinthalbasthi, Khairtabad, Hyderabad. The petitioner filed above I.A.No.465 of 2022 in O.S.No.571 of 2022 for injunction. That you are respondent No.2 and the above I.A. is posted t**o 19-06-2024 at 10.30 A.M.** for your notice and appearance, if you fails to appear on the said date and time, the matter will be decided in your absence.

(BY ORDER OF COURT)
Kasoju Yadagiri
Advocate
Sri Sai Nilayam, 9-1-33/29/A, Langerhouse, Hyderabad-8.
Cell: 9848827443

CAUTION NOTICE

Under the instruction of my clients namely 1) Mrs. Dharma Chaturya D/o.Mr. Dharma Ravider Reddy aged about: 24 years, Occ: Partner in Dharma Consultancy. 2) Mrs. Dharma Laxmi W/o. Mr. Dharma Ravider Reddy aged about: 46 years, Occ: Partner in Dharma Consultancy both are R/o. Plot No.54/A, Arvind Nagar Ramanthapur, Medchal, Malkajgiri. Instructed to publish in newspaper and placed the documents i.e., Affidavit showing no outstanding to any Bank official and amendment partition deed. Before me basing upon the documents facts and circumstances due to misunderstanding between the partners and the business in running loss style as Dharma Consultancy reinder in field of legal and tax services which was registered under the firm registration. Through this publication public is been aware that the above Dharma Consultancy is dissolved and no further continue in future by name Dharma Consultancy.

MOHD MUJAHID QURESHI, B.Com, LLB.Advocate
#. 2-3-474/41/A, Akash Nagar, Amberpet - 500013., Hyd.
Ph: 9701893760

IN THE COURT OF THE XXIV ADDL. DISTRICT JUDGE, CITY CIVIL COURT: AT: HYDERABAD.
O.S.NO.571 OF 2022

Between:
Gunguru Elizabeth Kumar ...Plaintiff
AND
Francis Nitin David & another, ...Defendants

To
Abdul Nabi, S/o.Baqeeth Bin Abdullah, Aged about 50yrs, Occ:Business, R/o.H.No.10-1-112 5, A.C.Guards, HydT.S. ...Defendant No.2

Sirs,
Please take notice that the plaintiff filed the above suit for partition, separate possession and consequential relief of declaration to declare Development Agreement-Cum-GPA Doct.No.477/2020, dated 12-02-2020, as null and void against the defendants in respect of "A" suit property i.e. H.No.10-1-936, admeasuring 37 sq.yards, consisting ground + 1 floor, situated at A.C. Guards, Khairtabad, Hyderabad, and "B" suit property i.e., H.No.6-3-213, admeasuring 227 sq yards, or 190 sq.mtrs., out of 484 sq.yards, situated at Premnagar, Chinthalbasthi, Khairtabad, Hyderabad. That you are defendant No.2 and the above suit is posted **to 19-06-2024 at 10.30 A.M.** for your notice and appearance, if you fails to appear on the said date and time, the matter will be decided in your absence.

(BY ORDER OF COURT)
Kasoju Yadagiri
Advocate
Sri Sai Nilayam, 9-1-33/29/A, Langerhouse, Hyderabad-8.
Cell: 9848827443

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE CUM XIV ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT: HAYATHNAGAR
O.S.No.300 OF 2024

BETWEEN:
1.B.Shailaja, W/o Late.Bathula. Vijaya Kumar, Aged about: 54 yrs, OCC: House Wife,
2.B.Suman Sai, S/o.Late.Bathula. Vijay Kumar, Aged about: 26 yrs, OCC:Pvt.Job,
3.B.Sai Kiran, S/o.Late.Bathula, Vijaya Kumar, Aged about: 25yrs, OCC:Pvt.Job,
4.B.SreeBhavani,D/oLate.Bathula. Vijaya Kumar, Aged about: 23 yrs, OCC: Student, All are same R/o. H.No.18-8-361, MahankaliTemple, Uppuguda, Charminar, Falaknuma, Hyderabad.
...Petitioners/Plaintiffs
AND
1.The Tahasildhar, Abdullpurmet Mandal, R.R.Dist.
2.All Concerned
...Respondents/Defendants

Please take Notice that the Plaintiff herein filed the above suit for Declaration of Legal Heirs of Late Bathula. Vijaya Kumar, S/o.Late. Bathula. Krishna and The Tahasildhar Abdullapurmet Mandal, R.R.District. And All Concerned against you and same is coming up for Defendant No.2 appearance and stand Posted to 05-06-2024 before the above said Hon'ble Court.

You are hereby therefore requested to appear before the above said Hon'ble Court **on 05-06-2024 at 10.30. A.M.** either in Person or through your Advocate, failing which, the matter will be heard and determined in accordance with the law.

SCHEDULE OF THE PROPERTY

ALL THAT THE piece and parcel of open land bearing Purchased Plot No.31, admeasuring 200 Sq. Yards, Plot No. 35, admeasuring 200 Sq Yards, Plot No. 46, admeasuring 220 Sq. Yards, Plot No. 47, admeasuring 200 Sq.Yards, Plot No.52, admeasuring 204 Sq. Yards and Plot No.52-A, admeasuring 204 Sq.Yards, total admeasuring 1228 Sq.Yards or 1026.75 Sq. Mt/s., in Survey No. 71/, situated at Munuganoor Village, Hayath nagar Revenue Mandal, R.R. District, Under Munuganoor Gramapanchayat Registration, Sub-District. Vanastnalipuram, and bounded by:**BOUNDARIES FOR PLOT No.31:-NORTH::** Plot No. 22-A; **SOUTH:** 25 ft., Wide Road; **EAST** :Plot No. 31-A;**WEST** :Plot No.30

BOUNDARIES FOR PLOT No.35:-NORTH: 25 ft., Wide Road;**SOUTH:** Plot No.38;**EAST** :Plot No.34;**WEST** :Plot No.36

BOUNDARIES FOR PLOT Nos. 46 & 47:-NORTH: 25 ft., Wide Road;**SOUTH:** 25 ft., Wide Road;**EAST** :: Plot Nos.45 & 48; **WEST:** 25 ft., Wide Road;

BOUNDARIES FOR PLOT Nos.52 & 52-A:-NORTH: 25 ft., Wide Road;**SOUTH:** 25 ft., Wide Road;**EAST** :Plot No.52-B; **WEST** :25 ft., Wide Road;

//BY ORDER OF THE COURT//
M/s.K.SRINIVAS REDDY
Advocate
Plot No.25, D.No. 11-14-304 Sirinagar Colony, L.B.Nagar, Hyd

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ - బడంగ్‌పేట్

విద్యుత్ మరమ్మతుల కారణంగా మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలోని కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని విద్యుత్ శాఖ ఏ.ఈ.సత్యనారాయణ బుధవారం తెలిపారు. జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న 11 కెవి శ్రీ రామ కాలనీ ఫీడర్ లో ఉదయం 11:00గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు బృందావన్ కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీ, రిలయన్స్ కాలనీలలో విద్యుత్‌కు అంతరాయం కల్గుతుందన్నారు. 11 కెవి జల్‌పల్లి ఫిడర్‌లో మధ్యాహ్నం 2:00 నుండి 3:30 వరకు జలపల్లి విలేజ్, బేవర్లీస్ వెంచర్, సదత్ కాలనీ, పటేల్ కాలనీ, బాలాజీ కాలనీ, వెంకటేశ్వరా కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ ఏ.ఈ తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్

నవతెలంగాణ - హయత్‌నగర్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు నిరంతరం చేపడుతున్న డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులకు నల్గొండ జిల్లాకు చెందిన మట్టపల్లి సంతోష్, మహబూబ్ నగర్‌కు చెందిన పాశం రఘు, అహ్మదాబాద్‌కు చెందిన గుజ్జర్ సుఖ్ వీర్ సింగ్‌లు పట్టుబడినట్టు తెలిపారు. వీళ్ల మద్యం సేవించి రెండు సార్లు పట్టుబడడంతో వారికి రెండు రోజుల జైల్ శిక్షను 6వ స్పెషల్ ఎంఎం కోర్ట్ ఎల్బీనగర్ జడ్జి గోపిక నాగ శ్రావ్య విధించినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఎలోర్డా కప్ పోటీల్లో బంగారు పతకం

• బాక్సర్ నిఖత్ జరీన్‌ను సన్మానించిన కమిషనర్ రోనాల్డ్ రోస్

నవతెలంగాణ - సిటీబ్యూరో

ఎలోర్డా కప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన బాక్సర్ నిఖత్ జరీన్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సన్మానించారు. ఇటీవల కజకిస్తాన్‌లో జరిగిన ఎలోర్డా కప్ పోటీల్లో 52 కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించిన బాక్సర్ నిఖత్ జరీన్‌ను బుధవారం తన ఛాంబర్‌లో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. విజేతగా నిలిచి బంగారు పతకం సాధించినందుకు అభినందించారు. ముమ్ముందు హైదరాబాద్ పేరు ప్రతిష్టలు దిశ, దిశల వ్యాపించేలా, దేశ గౌరవం ఇనుమడించేలా బాక్సింగ్ క్రీడలో మరింత రాణించాలని కమిషనర్ అభిలాషించారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని, క్రీడారంగ అభివృద్ధికి జీహెచ్ఎంసీ ఎంతో కృషి చేస్తుందన్నారు. బాల బాలికల క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక సమ్మర్ కోచింగ్ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆర్. ప్రేమ్ రాజ్, మాజీ ట్రెజరర్ కె.మహేశ్వర్, తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాబురావు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మూత్రాశయ క్యాన్సర్ పట్ల అవగాహనా కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఇండో అమెరికన్ హాస్పిటల్), మెర్క్ స్పెషాలిటీ ప్రయివేటు లిమిటెడ్ మద్దతుతో "ఆర్ట్ ఎగైనెస్ట్ క్యాన్సర్" పేరిట మూత్రాశయ క్యాన్సర్‌పై అవగాహన పెంచడానికి ఒక పెయింటింగ్ ఎగ్జిబిషన్ నిర్వహించింది.

ఈ నెల 21, 22 తేదీల్లో ఇండో అమెరికన్ హాస్పిటల్‌లో రెండు రోజుల పాటు ఈ ప్రదర్శన జరిగింది. మే నెలను మూత్రాశయ (బ్లాడర్) క్యాన్సర్ అవగాహనా మాసంగా ఆచరిస్తుంటారు. "బ్లాడర్ క్యాన్సర్‌పై అవగాహన పెంచడానికి మా కొనసాగుతున్న ప్రయత్నాలలో భాగంగా 'ఆర్ట్ ఎగైనెస్ట్ క్యాన్సర్'ని నిర్వహించేందుకు మేం సంతోషిస్తున్నాం. ఈ పోరాటంలో మాతో చేరాలని మేం ప్రతి ఒక్కరినీ కోరుతున్నాం" అని ఇండో అమెరికన్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ కూరపాటి కృష్ణయ్య అన్నారు. "సంక్లిష్ట సందేశాలను స్పష్టంగా వెల్లడించే ప్రత్యేకమైన సామర్థ్యం కళకు ఉంది. ఈ ప్రదర్శన మూత్రాశయ క్యాన్సర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఒక శక్తివంతమైన వేదికగా ఉపయోగపడుతుందని నమ్ముతున్నాం" అని అన్నారు. మెడికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సెంథిల్ రాజప్ప మాట్లాడుతూ "ఎరుపు, గులాబీ, నారింజ లేదా గోధుమ రంగుతో సహా మూత్రం రంగులో మార్పు మూత్రాశయ క్యాన్సర్ సాధారణ లక్షణాల్లో ఒకటి. దీన్ని ముందుగా గుర్తించడం విజయవంతమైన చికిత్సలో కీలక పాత్ర పోషిస్తుంది.

ఈ ఎగ్జిబిషన్‌తో, ఈ లక్షణాలను గుర్తించడం, సకాలంలో వైద్య సహాయం పొందడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పడమే మా హాస్పిటల్ లక్ష్యంగా పెట్టుకుంది" అని అన్నారు.

రక్తదానంతో ప్రాణదానం : కార్పొరేటర్





నవతెలంగాణ - నాగోల్

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి తోటి వారి ప్రాణాలను కాపాడాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. బీజేవైఎం యువ నాయకుడు కేసీరెడ్డి ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదాన శిబిరాలను నిర్వహించడం ద్వారా ఆసుపత్రుల్లో రక్త కొరతను కొంతమేరకు నియంత్రించగలుగుతామన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారిని కార్పొరేటర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేసీరెడ్డి పద్మ రెడ్డి, రావుల శ్రీనివాస్ గౌడ్, ప్రీతం రెడ్డి, రాము గౌడ్, డాక్టర్ తదితరులు పాల్గొన్నారు.



అరుణోదయ కాలనీలో
కార్పొరేటర్ కళ్లెం పర్యటన

నవతెలంగాణ - వనస్థలిపురం

హయత్‌నగర్ డివిజన్‌లోని అరుణోదయ కాలనీలో తరచూ ఏర్పడుతున్న లో ప్రెషర్ నీటి సమస్యను స్థానిక హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డికి దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ బుధవారం అరుణోదయ కాలనీలో పర్యటించి.. నీటి సమస్యను పరిశీలించారు. తర్వాత వెంటనే కార్పొరేటర్ సంబంధిత జలమండలి అధికారికి ఫోన్ చేసి.. అరుణోదయ కాలనీలో చాలా రోజులుగా ఉన్న లో ప్రెషర్ సమస్యను వివరించారు. ఈ లో ప్రెషర్ నీటి సమస్య వలన కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట అరుణోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

సమస్యలు పునరావృతం కాకుడదు



• ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌లోని కాలనీలలో కాలనీ వాసులు, అధికారులు, నాయకులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. తర్వాత సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌లోని హరిపురి కాలనీ, జనప్రియ గార్డెన్, సరోజినీనగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. 2 రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి రోడ్లు గుంతల మయం అయ్యాయని, డ్రైనేజీ పొంగిపొర్లడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో జీహెచ్ఎంసీ ఏఈ ఈశ్వర్, వాటర్ వార్క్స్ ఏఈ రామకృష్ణ రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఊర్మిల రెడ్డి, గొడుగు శ్రీనివాస్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, సాజిద్, రాంనర్సింహా గౌడ్, కంచర్ల శేఖర్, వెంకటేష్ గౌడ్, మహేందర్ రెడ్డి, కాలనీ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఛానల్ కథనాలు
కలచి వేస్తున్నాయి..

• ప్రభుత్వం స్పందించకుంటే సీఎం నివాసం ఎదుట నిరసనకు దిగుతా
• బాధితురాలు మాధవి



నవతెలంగాణ - బంజారాహిల్స్

ఓ ఛానల్‌లో ప్రసారమవుతున్న కథనాలు తనను తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తున్నాయని ఓ మహిళ కన్నీరు మున్నీరైంది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు కంభంపాటి మాధవి తన గోడును వెల్లబోసుకుంది. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, సమస్యల పరిష్కారానికి దోహదపడే మీడియా.. వ్యక్తిగత విషయాలపై అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. వ్యక్తిగత జీవితాలను అబాస్పాలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. గేమింగ్ యాక్ట్‌లో కేసు నమోదైన తనపై ఓ యూట్యూబ్ ఛానల్ ఇష్టారీతిన కథనాలు ప్రసారం చేసి తమ కుటుంబ పరువును తీస్తుందని ఆరోపించారు. ఇప్పటికే తనపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ సామాజిక మాధ్యమాలలో పెట్టిన వీడియోలు తమను తీవ్ర ఆవేదన గురి చేయడమే కాక ఆత్మహత్యకు ప్రేరేపించేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ఛానల్‌కు వెళ్లి వేడుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందంటూ రోధించింది. ఇప్పటికైనా ప్రభుత్వం.. ఉద్దేశపూర్వకంగా పౌరుల వ్యక్తిగత జీవితాల్లోకి ప్రవేశిస్తున్న యూట్యూబ్ ఛానల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ముఖ్యమంత్రి నివాసం వద్ద నిరసనకు దిగుతానని ఆమె అన్నారు.





మామిడి పచ్చడికి
ధరల ఘాటు..

భారీగా పెరిగిన ధరలు..

ఒక్కో మామిడి కాయకు రూ.15 నుంచి రూ.20
ఎండు మిర్చి కేజీ రూ.200
అల్లం కేజీ రూ.160
వెల్లుల్లి కేజీ రూ.270

నవతెలంగాణ - చైతన్యపురి

గత ఏడాదితో పోలిస్తే మామిడి కాయ దిగుబడి భారీగా తగ్గింది. దీనికి తోడు ఇటీవల కురిసిన ఈదురు గాలితో కూడిన వర్షాలకు పంటలు దెబ్బతీశాయి. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో మార్కెట్లో మామిడి ధరలు భగ్గున మండుతున్నాయి. పావు కేజీ కాయకు రూ.15 నుంచి 20 వరకు ధర పలుకుతోంది. అంతేకాదు ఎండు మిర్చి కేజీ ధర రూ.200, అల్లం కేజీ రూ.160, వెల్లుల్లి కేజీ ధర రూ.270 వరకు పలుకుతోంది. ఇక ఆయిల్ ధరలు కూడా భారీగా పెరిగాయి. పల్లి నూనే కేజీ రూ.180 పలుకుతుండగా... పొద్దు తిరుగుడు నూనే రూ.140 నుండి 160 వరకు పలుకుతోంది.

పోపు గింజలు కూడా ఖరిదే..

మార్కెట్లో కొనుగోలు చేసిన కాయలను కట్ చేసే ప్రక్రియ కూడా ఖరీదుగా మారింది. ఒక్కో కాయకు రూ.5 ఛార్జీ చేస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన ఈ ధరల ఘాటుకి పోపు గింజలు కూడా మాడిపోతున్నాయి. పెరిగిన ఈ ధరలతో మెజార్టీ వినియోగదారులు పచ్చళ్లు పెట్టడం కంటే మానుకోవడమే ఉత్తమమని భావిస్తున్నారు. గతంలో వంద కాయలు పచ్చడి పెట్టిన వారు.. ప్రస్తుతం 50 కాయలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.

దిగుబడి తగ్గింది : యాదయ్య.



ఏటా చెట్టు విరగబడి కాసేది. ఈ సారి పూత లేదు, కాత లేదు. దిగుబడి లేకపోవడంతో ఇప్పటి వరకు ఇంటి మామిడి చెట్టు కాయలతో పచ్చడి పెట్టిన తాము కూడా ఈ సారి మార్కెట్లో లభించే కాయలపై ఆధారపడాల్సి వచ్చింది. మార్కెట్లో కూడా ఆశించిన స్థాయిలో కాయలు లేవు. పుల్లటి కాయలు దొరకడమే గగణమైంది. ఒక వేళ లభించినా వాటి ధరలు అమాంతం పెంచేశారు.

20 కాయలతోనే సరిపెట్టుకున్నా..



శ్రీనివాస్, చైతన్యపురి

మార్కెట్లో మామిడి ప్రియమైంది. కాయల ధర కేజీ రూ.80 నుంచి రూ.100 పలుకుతోంది. ఇక పచ్చడి కాయలు దొరకడమే గగనమైంది. ఒకే చెట్టు కాయలు లభించడం లేదు. మిక్సింగ్ ఉంటుంది. పులుపు కూడా తక్కువే. వీటితో పచ్చడి పెడితే త్వరగా పాడవుతుంది. గతంలో 100 కాయల వరకు పెట్టేవాళ్లం. కానీ ఈ సారి 20 కాయలతో సరిపెట్టుకున్నాం. కారం ధరలు కూడా అమాంతం పెరిగింది. కేజీ ఎండు మిర్చి రూ.200 పై మాటే. త్రిమ్యాంగో కారం కావాలంటే కేజీకి రూ.600 చెల్లించాల్సిందే.





పచ్చళ్లకు ధరల ఘటెక్కింది.. ప్రస్తుతం వేసవి మామిడి సీజన్ కావడంతో ప్రతి ఇంట్లోనూ మామిడి కాయ పచ్చడి పెట్టడం సర్వసాధారణం. ఏడాదంతా నిల్వ ఉండేలా ఏర్పాటు చేసుకునే ఈ పచ్చడి పెట్టకునేందుకు పేద, మధ్య తరగతి ప్రజలు మార్కెట్లో పెరిగిన ధరలతో చుక్కలు చూస్తున్నారు. అంతేకాదు ఇంట్లో పచ్చళ్లు పెట్టి దేశ, విదేశాల్లో స్థిరపడిన తమ పిల్లలకు పార్శిళ్లు పంపేవారు సైతం.. ఈ సారి వెనుకాడుతుండటం గమనార్హం..

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ - హయత్‌నగర్

కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ దయాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శైలజాపురి కాలనీలో బొల్లు మంజుల(37) నివాసం ఉంటుంది. మంజుల తన భర్తతో గొడవ పడి.. భర్త ఇంట్లో నుండి వెళ్లిపోగానే ఎవరూ లేని సమయంలో పాల కోసం ఉపయోగించే రసాయనాలను సేవించింది. గమనించిన వారు ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కానీ చికిత్స పొందుతూ మంజుల మృతిచెందింది. ఈ మేరకు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేసవిలో స్కిన్ ఎలర్జీలకు ఇలా?

వేడి గాలులు, ఎండ తీవ్రత మళ్లీ పెరిగిపోయాయి. ఈ క్రమంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు చర్మ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఈ సీజన్‌లో స్కిన్ ఇన్‌ఫెక్షన్ ముప్పు కూడా పెరుగుతుంది. చర్మంపై ఎర్రటి దద్దుర్లు, దురద, మంట, చర్మం నల్లబడటం వంటి సమస్యలు చాలా మంది ఎదుర్కొంటారు. ఈ సమస్యలన్నింటి నుండి రక్షణ పొందాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

వేసవిలో చర్మ కాంతి తగ్గిపోతుంది. సూర్యరశ్మి, దుమ్ము, అలర్జీ వల్ల చర్మ వ్యాధులు రావచ్చు. కొందరికి శరీరంపై ఎర్రటి దద్దుర్ల సమస్య కూడా పెరుగుతుంది. ఇది ఎక్కువగా వీపు వెనుక, ముఖం, చేతులపై కూడా కనిపిస్తుంది. ఈ రకమైన సమస్యను ఎదుర్కొంటున్నట్లైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. తీవ్రమైన ఎండలో ఎక్కువసేపు ఉండటం వల్ల చర్మం దెబ్బతిని ఇలాంటి సమస్యలు వస్తాయి.

ఎండలో బయటకు వెళ్లేటప్పుడు ముఖాన్ని, శరీరాన్ని కప్పి ఉంచాలి. బయటికి వెళ్లడానికి 15 నిమిషాల ముందు సన్‌స్క్రీన్ అప్లై చేసుకోవాలి. వీలైతే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు వెళ్లడం మానుకోవాలి. బయటకు వెళ్లడం తప్పనిసరి అయితే పదే పదే నీరు తాగుతూ ఉండాలి. అలాగే సీజనల్ పండ్లను తినాలి. వాటర్ కంటెంట్ ఉన్న పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. ఈ సీజన్‌లో చర్మంపై ఎలాంటి మచ్చలు కనిపించినా.. అకస్మాత్తుగా వీపుపై దద్దుర్లు కనిపించినా.. వెంటనే వైద్యులను సంప్రదించాలి. సకాలంలో చికిత్స చేస్తే చర్మవ్యాధులు తీవ్రతరం కాకుండా నివారించవచ్చు.

పనీర్‌తో పసందుగా...

పనీర్ అంటే ఇష్టపడని వారు చాలా తక్కువ. ఇందులో ఉండే ప్రొటీన్‌లు, క్యాలరీల కారణంగా దీనిని తిన్న తర్వాత మీరు చాలా సేపు కడుపు నిండిన అనుభూతిని పొందుతారు. ఇది కొవ్వును వేగంగా కరిగిస్తుంది. అలాగే పనీర్‌తో చేసిన ఈ వంటకాలు బరువు తగ్గడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఇందులో గుండె సంబంధిత ఆరోగ్యాన్నిచ్చే పోషకాలు ఉన్నాయి. ఒమెగా 3, ఒమెగా 6 ఫ్యాటీ ఆమ్లాలు ఉంటాయి. అలాగే దీనిలో పీచు అధికంగా ఉంటుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. పనీర్ తింటే త్వరగా పొట్ట నిండిన ఫీలింగ్ వస్తుంది. కాబట్టి పనీర్ తింటూ బరువు తగ్గవచ్చు. మహిళలు పనీర్ అధికంగా తింటే మంచిది. ముఖ్యంగా మెనోపాజ్ దశకు దగ్గరలో ఉన్న మహిళలకు చిరాకు, ఒత్తిడి రాకుండా ఉంటాయి. పనీర్‌తో చేసిన వంటకాలు చాలా రుచిగా ఉండటమే కాదు.. ఆరోగ్యానికీ మేలు చేస్తాయి.



పనీర్ పెప్పర్ ఫ్రై

కావలసిన పదార్థాలు : పనీర్ - 200 గ్రాములు, ఉల్లిపాయ (తరిగిన) - 3, పచ్చిమిర్చి - 4, క్యాప్సికమ్- ఒకటి, నల్ల మిరియాలు - ఒక స్పూన్, జీలకర్ర - ఆఫ్ స్పూను, లవంగాలు - 2, దాల్చిన చెక్క - 2, దనియాలు - ఆఫ్ స్పూను, ఎర్ర మిర్చి - 4, కరివేపాకు - 2 టేబుల్ స్పూన్లు, పసుపు - కొద్దిగా, నూనె సరిపోయేంత, రుచికి తగినంత ఉప్పు

తయారీ విధానం : ముందుగా స్టౌ మీద పాత్రలో నూనె వేసి ఎండుమిర్చి, జీలకర్ర, లవంగాలు, నల్ల మిరియాలు, కొత్తిమీర, కరివేపాకు వేసి వేయించాలి. చిన్న మంటలో 2 నిమిషాలు వేయించి, తీసివేసి మరో పాత్రలో ఉంచి చల్లారనివ్వాలి. తర్వాత అదే పాత్రలో నూనె వేసి ఉల్లిపాయలు వేయించాలి. ఇప్పుడు ఉప్పు, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి బాగా వేయించాలి. క్యాప్సికమ్‌ను సన్నగా తరుగుకొని అందులో వేసుకోవాలి. సన్నటి మంట మీద ఉడికించాలి. మరో వైపు వేయించిన మసాలా దినుసులను మిక్సీ జార్‌లో వేసి మెత్తగా రుబ్బుకోవాలి.



తర్వాత స్టౌ మీద ఒక పాత్రలో రుబ్బిన మసాలా దినుసులు వేసి కలపాలి. అందులో పనీర్ వేసి కలపాలి. పసుపు వేసుకోవాలి. 2 నిమిషాలు వేయించాలి. పనీర్‌ను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. పనీర్ త్వరగా ఉడుకుతుంది. దీన్ని బాగా కలపండి, 2 నుంచి 3 నిమిషాలు ఉడికిన తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి. మీకు నచ్చే రుచికరమైన పనీర్ పెప్పర్ ఫ్రై రెడీ.

పనీర్ మసాలా దోసె

కావలసిన పదార్థాలు : దోస పిండి - రెండు కప్పులు, పనీర్ - 150 గ్రాములు(తురుముకోవాలి), అల్లం - అరస్పూను, వెల్లుల్లి - అరస్పూను, పచ్చిమిర్చి - 1, ఉల్లిపాయ - 1, టమాట - 1, బీన్స్ - కొద్దిగా, క్యాప్సికమ్ - 3 టేబుల్ స్పూన్లు, క్యారెట్ - 1, ఉప్పు - తగినంత, ధనియాల పొడి - అరస్పూను, గరం మసాలా పొడి - పావు స్పూను, పసుపు - పావుస్పూను, కొత్తిమీర - 1 టేబుల్ స్పూన్, టొమాటో కెచప్ - 1 స్పూన్, వెన్న - 3 టేబుల్ స్పూన్లు, నూనె, రుచికి తగిన ఉప్పు

తయారీ విధానం : ముందుగా దోసె పిండిని రడీ చేసుకోవాలి. ఈ పిండిలో, క్యారెట్ తురుము వేసినట్టుగా పనీర్ తురుమును కొద్దిగా వేసుకోవాలి. తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టుకొని... నూనె, వెన్న వేసుకోవాలి. అందులో అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఉల్లిపాయలు, బీన్స్, క్యాప్సికమ్, క్యారెట్ వేసి (చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి) రెండు నిమిషాలు వేయించాలి. దీని తర్వాత టొమాటో వేసి వేయించాలి. అందులో పసుపు , గరం మసాలా, కొత్తిమీర, కారపు పొడి వేసి వేయించాలి. దీనికి తురిమిన పనీర్ వేసి మరో రెండు నిమి షాలు వేయించాలి. చివరగా కొత్తిమీర తరుగు వేసి కలపాలి. మరో వైపు స్టవ్ మీద దోస పాన్ పెట్టి అందులో దోస పిండి వేయాలి. దోసె పైన వెన్న లేదా నెయ్యి వేసి టొమాటో కెచప్ కూడా వేసుకోవచ్చు. తర్వాత వేయించిన మసాలాను దోసెలో నింపుకోవాలి. కొద్దిసేపు వేడి చేయండి. ఈ దోసెలో ఒకవైపు మాత్రమే ఉడికిస్తే పనీర్ మసాలా దోసె రెడీ.



పనీర్ జిలేబి

కావలసిన పదార్థాలు : పనీర్ తురుము - పావు కిలో, పంచదార - ఒక కప్పు, కార్న్ పౌడర్ - పావు కప్పు, కుంకుమ పువ్వు - రెండు రేకులు, యాలకుల పొడి - పావు స్పూను, నెయ్యి - సరిపడా, బేకింగ్ సోడా - అర స్పూను, పిస్తా, జీడిపప్పు - గుప్పెడు, గోధుమపిండి - రెండు స్పూన్లు

తయారీ విధానం : ఒక గిన్నెలో కార్న్ పొడి, గోధుమపిండి, బేకింగ్ సోడా వేసి కొద్దిగా నీళ్లు పోసుకుని పల్చగా కలుపుకోవాలి. ఉండలు లేకుండా చూసుకోవాలి. ఆ మిశ్రమంలోనే పనీర్ తురుమును కూడా వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ఒకసారి మిక్సీ పడితే అది పేస్టులా అవుతుంది. దాన్ని జిలేబిలా వేయడానికి వీలుగా ఒక కవర్లో వేయాలి. ఆ కవర్ చివరన చిన్న రంధ్రం పెట్టాలి. స్టవ్ మీద కళాయి పెట్టి డీప్ ఫ్రై చేయడానికి వీలుగా నెయ్యి వేయాలి. పనీర్ జిలేబిని నేతిలోనే వేయిస్తారు. కవర్‌ను కోన్‌లా చేసి నెయ్యిలో జిలేబిలా వేసుకోవాలి. వాటిని రంగు మారేవరకు దోరగా వేయించాలి. మరో పక్క స్టవ్ మీద పంచదార, యాలకుల పొడి, నీళ్లు, కుంకుమపువ్వు వేసి లేత పాకం పట్టుకోవాలి. ఫ్రై అయిన జిలేబిలను నెయ్యిలో తీసి ఆ పాకం గిన్నెలో వేయాలి. తరువాత తీసి ప్లేట్లో వేసుకోవాలి. పైన పిస్తా, జీడిపప్పు ముక్కలను తురిమి చల్లాలి. అంతే పనీర్ జిలేబి రెడీ అయినట్టే. సాధారణ జిలేబితో పోలిస్తే ఇది చాలా రుచిగా ఉంటుంది. సాధారణ జిలేబి కాస్త సన్నగా ఉంటే ఇది మందంగా ఉంటుంది.



పనీర్ పులావ్

కావలసిన పదార్థాలు : బాస్మతి బియ్యం - రెండు కప్పులు, అల్లం వెల్లుల్లి పేస్టు - ఒక స్పూను, యాలుకలు - ఐదు, ఉప్పు - రుచికి సరిపడా, గరం మసాలా - అర స్పూను, నల్ల మిరియాలు - అర స్పూను, పసుపు - ఒక స్పూను, బిర్యానీ ఆకు - ఒకటి, పనీర్ - 150 గ్రాములు, దాల్చిన చెక్క - ఒకటి, పాలు - మూడు స్పూన్లు, ఉల్లిపాయలు - రెండు, నెయ్యి - మూడు స్పూన్లు, పెరుగు - ఒక కప్పు, పుదీనా - ఒక కట్ట, కారం - ఒక స్పూను, జీడిపప్పులు - గుప్పెడు, కుంకుమ పువ్వు - మూడు రేకులు

తయారీ విధానం : పనీర్ పులావ్ చేసేందుకు పనీర్‌ను కొద్దిగా పెద్దముక్కలు చేసుకోవాలి. ఒక గిన్నెలో ఈ పనీర్ ముక్కలను వేసి చిటికెడు ఉప్పు, పెరుగు, పసుపు, కాస్త నూనె, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి మ్యారినేట్ చేయాలి. అరగంట పాటు పక్కన పెట్టేయాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నెయ్యిని వేయాలి. ఉల్లిపాయలను సన్నగా తరిగి వేయించాలి. అవి బ్రౌన్ రంగు వచ్చేవరకు వేయించాలి. తర్వాత ఆ ఉల్లిపాయలను తీసి పక్కన పెట్టు కోవాలి. ఆ మిగిలిన నూనెలో దాల్చిన చెక్క, యాలకులు, మిరియాలు, బిర్యానీ ఆకు వేసి వేయిం చాలి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను కూడా వేసి వేయించాలి. ఇప్పుడు పసుపు, ఉప్పు, బియ్యం వేసి కలుపుతూ ఉండాలి. మంటను తగ్గించాలి. ఈ లోపు ముందుగా మ్యారినేట్ చేసుకున్న పనీర్ ను మరొక కళాయిలో వేసి గోధుమ రంగులోకి మారేవరకు నెయ్యిలో వేయించాలి. ఆ వేయించిన పనీర్‌ను ఈ బియ్యంలో వెయ్యాలి. అన్నింటినీ కలిపి కలుపు కోవాలి. యాలుకల పొడిని కూడా వేయాలి. గరం మసాలా, కారం కూడా వేసి కలుపుకోవాలి. ఇప్పుడు నాలుగు కప్పుల నీళ్లను వేసి మూత పెట్టాలి. పైన పుదీనా, కొత్తిమీర తరుగును చల్లుకోవాలి. దించేముందు కుంకుమ రేకుల నీటిని పైన వేసుకొని ఐదు నిమిషాలు మూత పెట్టి ఉంచాలి. తర్వాత స్టవ్ కట్టేయాలి. అంతే టేస్టీ పనీర్ పులావ్ రెడీ అయినట్టే.



తలనొప్పి తగ్గాలంటే..

తలనొప్పి ప్రతీ ఒక్కరిలో సర్వసాధారణంగా వచ్చే సమస్య. మనలో చాలా మంది ఏదో ఒక సమయంలో ఈ సమస్యను ఎదుర్కొనే ఉంటారు. ఇందుకు నిద్రలేకపోవడం మొదలు ఎన్నో కారణాలున్నాయి. మనలో చాలా మంది తలనొప్పి రాగానే వెంటనే మందులు వేసుకుంటారు. అయితే ట్యాబ్లెట్ వేసుకుంటే వెంటనే ఉపశమనం లభించినా వాటివల్ల కలిగే దుష్ప్రభావాలూ అదే స్థాయిలో ఉంటాయి. అందుకే తలనొప్పిని వీలైనంత వరకు సహజ మార్గాల ద్వారానే



తగ్గించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. పెయిన్ కిల్లర్స్‌కి అలవాటు పడడం ఏమాత్రం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ తలనొప్పిని తగ్గించే ఆ నేచురల్ టిప్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

- ఉదయం నిద్రలేవగానే తలనొప్పిగా ఉండే వెంటనే మనలో చాలా మంది చేసే పని టీ తాగడం. అయితే టీకి బదులు తులసి టీ తాగడం వల్ల మెరుగైన ఫలితం పొందొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం కొన్ని తులసి ఆకులను తీసుకొని నీటిలో మరిగించి తీసుకోవాలి. దీనివల్ల తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
- తలనొప్పికి డీహైడ్రేషన్ కూడా ఒక కారణం. తగినంత నీరు తీసుకోకపోతే తలనొప్పి సమస్య వేధిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే కచ్చితంగా ప్రతీ రోజూ 3 నుంచి 4 లీటర్ల నీటిని తీసుకోవాలని సూచిస్తున్నారు.
- నిద్రలేమి కూడా తలనొప్పికి దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి కచ్చితంగా రోజు 7 నుంచి 8 గంటల నిద్ర ఉండేలా చూసుకోవాలి.
- స్మార్ట్ ఫోన్ వాడకం పెరగడం, గంటలతరబడి కంప్యూటర్ల ముందు కూర్చోవడం కూడా ఒక కారణం. అయితే ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే గ్యాడ్జెట్ల వినియోగాన్ని తగ్గించాలి.
- ఒత్తిడితో కూడుకున్న జీవితం కూడా తలనొప్పికి కారణమవుతుంది. అందుకే ఒత్తిడిని దూరం చేసుకునేందుకు యోగా, మెడిటేషన్ వంటి వాటిని అలవాటుగా మార్చుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

వర్షాలకు ముందే మేడిగడ్డకు మరమ్మతులు

(మొదటిపేజీ తరువాయి)

పిల్లర్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలంలో వరద తాకిడికి బ్యారేజీ తట్టుకునే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఇరిగేషన్ అధికారులకు సూచించారు. బ్యారేజీ పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ గేట్ల కింది భాగంలో పేరుకుపోయిన ఇసుకను వెంటనే తీసేయాలని ఆదేశించారు. ముఖ్యంగా భారీ వర్షాల కారణంగా వరద తాకిడికి తట్టుకునే విధంగా బ్యారేజీ పూర్తి గేట్లను ఎత్తివేయాలని ఆదేశాలు జారీ చేశారు. గోదావరి ప్రాణహిత జలాలు వృథాగా పోకుండా మేడిగడ్డకు 17 కిలోమీటర్ల దూరంలో తండేపల్లి పంప్ హౌస్ వద్ద జియో ట్యూబ్ గోడలు నిర్మించాలని సూచించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో జియో ఫిజికల్, జియో టెక్నికల్, జియో డిస్ట్రక్టివ్ పరీక్షలను నిపుణులు నిర్వహించారు. రాబోయే వరదలకు కుంగిన ఏడవ బ్లాక్ లోని 19, 20, 21 పిల్లర్లు తట్టుకుంటాయా లేదా అనే విషయాన్నీ పరీక్షించారు. నిపుణుల బృందం పరీక్షలు, పరిశీలన ద్వారా కనుగొన్న వివరాలను రాష్ట్రంలో ప్రభుత్వానికి సంబంధిత శాఖల వారికి పూర్తిగా నివేదించి తదుపరి చర్యలను సూచించేందుకు జలసౌధలో ఇరిగేషన్ సెక్రెటరీ, ఈఎన్సీ అధికారులతో సమావేశం కానున్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ నాగరాజు, డీఈ సురేష్ లతోపాటు అధికారులు పాల్గొన్నారు.

జూన్ 6 నుంచి మేడిగడ్డపై విచారణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల విఫలంపై జస్టిస్ పినాకిని చంద్రఘోష్ న్యాయ విచారణలో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. జూన్ ఆరు నుంచి పూర్తిస్థాయి విచారణకు కమిషన్ సన్నద్ధమవుతున్నది. ఇందుకు ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదికను ఊతం చేసుకోనుంది. దీని ఆధారంగా అధికారులు, రాజకీయనాయకులు, ప్రజాప్రతినిధులకు నోటీసులు ఇచ్చి విచారణకు హాజరు కావాలని కోరనుంది. ఈమేరకు సన్నాహాలు జరుగుతున్నాయి. వచ్చే నెల తొలి రోజుల్లో మళ్లీ జస్టిస్ ఘోష్ హైదరాబాద్ రానున్నారు. ఈమేరకు షెడ్యూల్ ఖరారైనట్టు తెలిసింది.ప్రాజెక్టు నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన ఇంజినీర్లతో తొలుత విచారణ చేపట్టనున్నారు. ఈనేపథ్యంలోనే కాళేశ్వరానికి సంబంధించి సమగ్ర నివేదికను మరోసారి జస్టిస్ పినాకిని చంద్రఘోష్‌కు అందించాలనీ, ఎలాంటి వివరాలు, నివేదికలు దాచడానికి వీల్లేదనిసాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల బొజ్జా లేఖ ద్వారా ఆదేశించారు. ఈ రాసిన లేఖపై ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. అనిల్‌కుమార్ ఇతర ఇంజినీర్లతో భేటి అయి చర్చించారు. ఆమేరకు సమాచారాన్ని గుదిగుచ్చి నివేదిక రూపంలో గురువారం సాయంత్రానికి తయారుచేయాలని చెప్పినట్టు తెలిసింది. ప్రాథమిక ప్రణాళిక నుంచి నిర్మాణం పూర్తయ్యేవరకు ప్లానింగ్, టెక్నికల్, ఆర్థిక అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను నివేదికలో పొందుపరచాలని సాగునీటి శాఖ అధికారులకు చెప్పారు. అవసరమైతే ఎల్అండ్‌టీ అధికారుల సహకారం తీసుకోవచ్చని సూచించినట్టు సమాచారం. ఆ నివేదికను ఈనెల 25న ముఖ్యకార్యదర్శితోపాటు జస్టిస్ ఘోష్ కార్యాలయానికి అందజేయనున్నారు. గత నాలుగేండ్ల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై పత్రికా, ప్రసారసాధనాలు, ప్రింట్ మీడియాలో వచ్చిన క్లిప్పింగులతోపాటు వీడియో క్లిప్పింగులను న్యాయ విచారణ కమిషన్‌కు తోడ్పడుతున్న కమిటీ సేకరిస్తున్నది. జూన్ ఆరు నుంచి ప్రారంభమయ్యే విచారణ నాటికి ఈ సమాచారాన్ని అంతా ఘోష్ కార్యాలయం సిద్ధం చేయనున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ సాగునీటి శాఖ మంత్రి టి.హరీశ్‌రావుతోపాటు సర్వీసు నుంచి డిస్మిస్ అయిన రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, మాజీ ఈఎన్సీ జనరల్ సి.మురళీధర్ తదితరులను విచారణకు పిలవనున్నట్టు విశ్వసనీయ సాగునీటి శాఖ అధికారవర్గాలు తెలిపాయి. కేసీఆర్‌ను పిలిచే ముందే సమగ్ర సమాచారాన్ని సేకరించిపెట్టుకోవాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా మేడిగడ్డ బ్యారేజీ దగ్గరకు సీడబ్ల్యూసీ బృందం బుధవారం వెళ్లింది. అక్కడ భూగర్భ పరీక్షలు నిర్వహించినట్టు సమాచారం.

ఆరు గ్యారంటీల పేరిట కాంగ్రెస్ మోసం

నవతెలంగాణ-నర్సంపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధిక్కార స్వరం ఏనుగుల రాకేష్ రెడ్డి కావాలో.. బ్లాక్ మెయిలర్ తీన్మార్ మల్లన్న కావాలో చదువుకున్న విద్యావంతులు ఆలోచించి ఓటేయాలని అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా నర్సంపేటలోని పద్మశాలీ గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రాడ్యుయేట్ల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒకే ఒక్క ఉచిత బస్సు హామీ తప్పా మిగతా ఐదింటిని అమలు చేయకుండా మోసగించిందన్నారు. గ్యారంటీలను నమ్మి మోసపోతే గోసపడతామంటూ నాడు తాము చెప్పామని, అది ఇప్పుడు కళ్లారా చూస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 6న తాను మొదటి సంతకంతో రైతు భరోసా పేరిట రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి.. ఐదు నెలలు ముగుస్తున్నా చేయలేదని ఆరోపించారు. కౌలు రైతుకు, రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామని చెప్పారని, ఎంత మంది ఖాతాలో జమయ్యాయో చెప్పాలన్నారు. కేసీఆర్ రైతుబంధు రూ.12 వేలు ఇస్తామంటే తాము రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్‌ను నమ్మి రైతులు ఓటేశారన్నారు. నిరుద్యోగులకు రూ.4వేలు, మహాలక్ష్మీ పథకంలో ఆడపిల్లలకు రూ.2,500 ఎంతమందికి వచ్చాయో చెప్పాలన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్న కాంగ్రెస్ నేతల మాటలు ప్రజలు గుడ్డిగా నమ్మారని, ఆరు నెలలు దగ్గరకు వస్తున్నా హామీలు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. నాడు కేసీఆర్ పాలనలో నాట్లు వేస్తున్నప్పుడు రైతుబంధు ఇస్తే, నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓట్లు వేసే ముందు ఇస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి నేడు మాట మార్చిందని, బోనస్ కాస్తా బోగస్ అయిందన్నారు. మొదటి యేడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పటివరకు ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారో చెప్పాలన్నారు. భారత దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని నోటిఫికేషన్లను ఇచ్చి రెండు లక్షల ఉద్యోగాలను నాటి కేసీఆర్ ప్రభుత్వం భర్తీ చేసిందని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని పైగా 30వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. నాటి ప్రభుత్వంలో కొన్ని లీగల్ కారణంగా నిలిచిపోయిన ఉద్యోగాలకు కోర్టు అనుమతి ఇస్తే వాటిని తాను ఇచ్చినట్టుగా చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నాడు తాము చేసిన అభివృద్ధిని చెప్పుకోకపోవడం వల్లనే ఓటమి పాలయ్యామన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయకపోతే కూలిపోయేది లేదనీ, కానీ అసెంబ్లీలో హామీల అమలు కోసం చదువుకున్న యువతకు ఉద్యోగాల నోటిఫికేషన్లకై ప్రశ్నించే గళం విప్పే వ్యక్తిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న చరిత్ర విప్పితే అన్నీ నేరాలేనని, 56 కేసులతో చెంచల్‌గూడ జైల్ జీవితం అనుభవించిన వ్యక్తికి సీటు ఇవ్వడం ఆ పార్టీకే చెల్లిందని చెప్పారు. ఉన్నత విద్యావంతుడు, ప్రభుత్వంపై ధిక్కారస్వరం విప్పే ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి మీడియాల రవీందర్ రావు, బీఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మెన్ గుగులోతు రామస్వామి, నాయకులు మునిగాల వెంకట్ రెడ్డి, గుంటి కిషన్, జెడ్పీటీసీ, ఎంపీపీ, బీఆర్ఎస్ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై సీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బుధవారం అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు ఆ మూడు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్లమెంట్ ఇంచార్జ్ లతో సీఎం జూమ్ సమావేశం నిర్వహించారు. ఇది తీన్మార్ మల్లన్న ఎన్నిక మాత్రమే కాదు.. కాంగ్రెస్ పార్టీ ఎన్నిక అనీ, ఈ ఉప ఎన్నికలో ఆయన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇన్చార్జ్‌లు ఈ ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేయాలని ఆదేశించారు. ఈనెల 27న పోలింగ్ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు, నాయకులను సన్నద్ధం చేయాలని కోరారు. ప్రతీ ఎమ్మెల్యే తమ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్ లను సందర్శించాలని సూచించారు. నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తీన్మార్ మల్లన్న ప్రభుత్వానికి వారధిగా పని చేస్తారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఆయన గెలుపు ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

సోనియాను ఎలా పిలుస్తారు?

- రైతు సమస్యలపై త్వరలో ఉద్యమ ఎజెండా : కేంద్ర మంత్రి జీ. కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ వారోత్సవాలకు కాంగ్రెస్ నేత సోనియాగాంధీని ఏ ప్రాతిపదికన పిలుస్తారని సీఎం రేవంత్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. 1500 మంది ప్రాణాలను బలిగొన్నందుకు సోనియాను పిలుస్తారా? ఆ కార్యక్రమం పార్టీ కార్యక్రమమా? ప్రభుత్వ కార్యక్రమమా? ఆమె ఏమైనా ఆ పార్టీ అధ్యక్షురాలా? అసలు ఏ హోదాలో పిలుస్తారు? అని నిలదీశారు. నాడు దెయ్యంలా కనిపించిన సోనియా ఇప్పుడు దేవత ఎలా అయ్యిందని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. ఆమెని పిలవడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దేశాన్ని మోసం చేయడమే కాంగ్రెస్ చరిత్ర అని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సోనియమ్మ దయాదాక్షిణ్యాలతో తెలంగాణ రాలేదనీ, రాష్ట్ర ప్రజలు కొట్లాడి సాధించు కున్నారని చెప్పారు. సోనియా వారసత్వ రాజకీయాలకు మాత్రమే నాయకురాలని విమర్శించారు. కేంద్రం తెచ్చింది నల్లచట్టాలు కావనీ, వాటి వల్ల రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. త్వరలో రాష్ట్రంలో నెలకొన్న రైతు సమస్యలపై పోరాడేందుకు ఉద్యమ ఎజెండా తీసుకుని ముందుకుపోతామని ప్రకటించారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేసిందని విమర్శించారు. కౌలు రైతులకు ఇస్తామన్న రూ.15 వేల సహాయం ఏమైందని ప్రశ్నించారు. వరి పంటకు రూ.500 బోనస్‌తో నిండా ముంచారని విమర్శించారు. సన్న ఒడ్లకు మాత్రమే బోనస్ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏ వడ్లనైనా కొనడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలులో రైతులకు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అడ్డు కట్ట వేయడం దుర్మార్గమన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి మొలకెత్తుతున్నా కొనుగోళ్ల ప్రక్రియ మాత్రం నత్తనడకన సాగుతున్నదని విమర్శించారు. క్యాబినెట్ మీటింగ్ పూర్తయిన తర్వాత కూడా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం ఎందుకు జరుగుతున్నదని ప్రశ్నించారు. 50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు అవసరమయ్యే ఖర్చు మొత్తాన్ని కేంద్రమే భరిస్తున్నదని వివరించారు. నాడు కేసీఆర్ వరి వేస్తే ఉరి అని బెదిరిస్తే.. నేడు సన్న, దొడ్డు ఒడ్లు అంటూ రేవంత్‌రెడ్డి రైతులను భయపెట్టిస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీకి చిత్త శుద్ధి ఉంటే క్వింటాల్‌కు ఇస్తామన్న బోనస్ ఎందుకివ్వడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. సన్న బియ్యాన్ని ప్రోత్సహించాలనుకుంటే వెయ్యి రూపాయల బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని సూచించారు. ఆగస్టులో రుణమాఫీ చేస్తామనటం సరిగాదనీ, అప్పటి వరకు వర్షాలు రాకుండా ఉంటాయా? అని ప్రశ్నించారు. ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి వ్యతిరేకతను మూటగట్టుకున్నదన్నారు.

అబద్ధాలకు అంతే లేదు

(మొదటిపేజీ తరువాయి)

దేశంలోని మొత్తం నిరుద్యోగుల్లో నిరుద్యోగ యువత 82.9 శాతంగా ఉన్నారు. భారత్‌లో నిరుద్యోగ సమస్య యువతలోనే అధికంగా ఉన్నదని, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని విద్యావంతులైన యువత, మహిళల్లో ఇది ఎక్కువగా ఉన్నదని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) తన తాజా నివేదికలో తెలిపింది. మొత్తం నిరుద్యోగుల్లో విద్యావంతులైన యువత వాటా 2000లో 11.5 శాతంగా ఉంటే 2022 నాటికి 65.7 శాతానికి పెరిగింది. విద్యావంతులైన (సెకండరీ స్థాయి లేదా ఆ పైన) నిరుద్యోగ యువతలో పురుషుల (62.2 శాతం) కంటే మహిళలే (76.7 శాతం) ఎక్కువగా ఉన్నారు.

అదానీ కోల్ స్కాం

(మొదటిపేజీ తరువాయి)

విద్యుత్ కంపెనీలను మోసం చేస్తున్నారని తెలిపింది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరెప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్‌పీ) నుంచి పొందిన డాక్యుమెంట్ల పరిశీలన ఆధారంగా చేసుకుని ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ) ఈ కథనం ప్రచురించింది. నాసిరకం బొగ్గును సరఫరా చేయడం ద్వారా అదానీ భారీ లాభాలను ఆర్జిస్తున్నారు. తక్కువ గ్రేడ్ బొగ్గును విద్యుత్ కోసం ఉపయోగించడం అంటే ఎక్కువ ఇంధనాన్ని కాల్చడం ద్వారా గాలి నాణ్యతను ఫణంగా పెడుతున్నారు. మరోవైపు అదానీ మోస పూరితంగా బంపర్ లాభాలను పొందుతున్నారు.

జనవరి 2014లో అదానీ ఒక కిలోగ్రాముకు 3,500 కేలరీలు కలిగి ఉన్న ఇండోనేషియా బొగ్గును కొనుగోలు చేసినట్లు ఇన్‌వాయిస్‌లు చూపిస్తున్నాయి. అదే షిప్‌మెంట్‌ను తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టాంగెడ్‌కో)కి 6,000 కేలరీల బొగ్గుగా విక్రయించారు. ఇది అత్యంత విలువైన గ్రేడ్‌లలో ఒకటి. రవాణా ఖర్చుల తర్వాత అదానీ తన ధరను ఈ ప్రక్రియలో రెండింతలు పెంచినట్లు స్పష్టమవుతోంది. దీన్ని రుజువు చేయడానికి 2014లోని 22 షిప్‌మెంట్‌ల డాక్యుమెంటేషన్లను సరిపోల్చినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ తెలిపింది.

ఇండోనేషియాలోని తక్కువ కాలరీల ఉత్పత్తికి పేరుగాంచిన మైనింగ్ గ్రూప్ నుంచి అదానీ బొగ్గును కొనుగోలు చేశారు. దీన్ని దక్షిణాదిలోని ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలకు ఖరీదైన బొగ్గుగా సరఫరా చేసింది. దీంతో విద్యుత్ సంస్థలు నష్టపోవడమే కాక.. ఈ బొగ్గుతో వెలుపడిన కాలుష్యంతో లక్షలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. "విద్యుత్ రంగ ప్రయోజనాలకు అనుకూలంగా ప్రజారోగ్యాన్ని ఫణంగా పెడుతున్నారు." అని న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్‌లోని విశ్లేషకుడు సునీల్ దహియా అన్నారు.

2021-2023 మధ్యకాలంలో మార్కెట్ ధరలకు మించి భారత్‌కు దిగుమతి చేసుకున్న బొగ్గు కోసం మధ్యవర్తులకు ఐదు బిలియన్ డాలర్ల (రూ.45వేల కోట్లు)కు పైగా చెల్లించినట్లు నివేదికలు రావడంతో ప్రతిపక్ష పార్టీలు అదానీపై విచారణకు డిమాండ్ చేసిన విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ గుర్తు చేసింది. ఆర్థిక నేరాల పరిశోధనాత్మక విభాగమైన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) 2016లో బొగ్గు ధరలపై విచారణ ప్రారంభించింది. బొగ్గు ధరలను 68 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.566 కోట్లు) పెంచి చూపించిన ఆరోపణకు సంబంధించి అదానీపై విచారణ జరిపింది.

అదానీ 2013లో ఇండోనేషియాలో 28 డాలర్లకు ఒక్క టన్ను కొనుగోలు చేయగా.. దీన్ని భారత్‌లో 92 డాలర్లకు విక్రయించిందని ఎఫ్‌టీ రిపోర్ట్ చేసింది. అదే బొగ్గులో కిలోకు 3,500 కేలరీలు ఉండగా..దాని నాణ్యతను 6,000 కేలరీలకు పెంచి చూపింది. తక్కువ గ్రేడ్ రకం బొగ్గును అధిక నాణ్యత కలిగిన బొగ్గుగా చూపించడంతో పాటుగా ధరను అమాంతం పెంచి ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు అంటగట్టడం ద్వారా అదానీ కంపెనీ భారీగా లబ్ది పొందిందని ఎఫ్‌టీ విశ్లేషించింది. ఆ బొగ్గు వాడకంతో కాలుష్యం బాగా పెరిగింది. మరోవైపు విద్యుత్ కంపెనీల ఆదాయాలు కరిగిపోయాయి. ఉత్పత్తి వ్యయాలు పెరగడంతో ఆ భారం ఆటోమెటిక్‌గా ప్రజలపై పడిందని స్పష్టమవుతోంది.



ఆటలు

క్వాలిఫయర్ రౌండ్‌కు రాజస్థాన్

బౌలింగ్‌లో మెరిసిన ఆవేశ్, బౌల్ట్
బెంగళూరుపై నాలుగు వికెట్ల తేడాతో గెలుపు
ఫైనల్ బెర్త్‌కు రేపు సన్‌రైజర్స్‌తో ఢీ



అహ్మదాబాద్: ఎలిమినేటర్-1లో రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు రాణించడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు అవేశ్ ఖాన్(3/44), అశ్విన్(2/19)లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బెంగళూరు జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని రాజస్థాన్ 19 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఓపెనర్ జైస్వాల్(45), టామ్ కోలర్(20)కి తోడు రియాన్ పరాగ్(36), హెట్‌మైర్(26) బ్యాటింగ్‌లో రాణించారు.

టాస్ ఓడిన బెంగళూరును ట్రెంట్ బౌల్ట్ కట్టడి చేశాడు. తొలి ఓవర్లో రెండు, మూడో ఓవర్లో 3 పరుగులే ఇచ్చాడు. అయితే.. సందీప్ శర్మ, అవేశ్ ఖాన్‌లను టార్గెట్ చేసిన కోహ్లి(33), డూప్లెసిస్(17)లు బౌండరీలతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. దాంతో, శాంసన్ పవర్ ప్లేలోనే బౌల్ట్‌కు మూడో ఓవర్ వేసిన బౌల్ట్ బెంగళూరు కెప్టెన్ డూప్లెసిస్‌ను ఔట్ చేసి రాజస్థాన్‌కు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత కామెరూన్ గ్రీన్ (27), పాటిదార్(34)లు ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కానీ, స్పిన్నర్ అశ్విన్ వరుస బంతుల్లో గ్రీన్(27), గ్లెన్ మ్యాక్స్‌వెల్(0)లను పెవిలియన్ పంపి బెంగళూరును దెబ్బతీశాడు. వికెట్ కీపర్ దినేశ్ కార్తిక్(11) నిరాశపరిచినా.. చివర్లో మహిపాల్ లొమ్‌రోర్(32) బౌండరీలతో చెలరేగాడు. స్వప్నిల్ సింగ్ రాణించడంతో స్కోర్‌బోర్డు పరుగెత్తింది. స్వప్నిల్ సింగ్(9) మెరుపులతో రాజస్తాన్ నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు నష్టపోయి 172పరుగులు చేసింది. ఆవేశ్‌ఖాన్‌కు మూడు, అశ్విన్‌కు రెండు, సందీప్ శర్మ, బౌల్ట్, చాహల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జైస్వాల్(45), టామ్(20) తొలి వికెట్‌కు 46పరుగులు జోడించారు. ఆ తర్వాత కెప్టెన్ సంజు(17) నిరాశపరిచినా.. రియాన్(36) ఆదుకున్నాడు. ధృవ్ జురెల్(8) త్వరగా ఔటైనా.. హెట్‌మైర్(26), రువాన్ పావెల్(16నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు. బెంగళూరు బౌలర్లు సిరాజ్‌కు రెండు, ఫెర్గుసన్, కరణ్ శర్మ, గ్రీన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ గెలుపులో రాజస్తాన్ జట్టు క్వాలిఫయర్-2లోకి ప్రవేశించింది. 24న చెన్నై వేదికగా సన్‌రైజర్స్-రాజస్తాన్ జట్ల మధ్య క్వాలిఫయర్-2 మ్యాచ్ జరగనుంది.

స్కోర్‌బోర్డు...

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు : విరాట్ కోహ్లి (సి)సబ్ ఫెర్రీరియా (బి)చాహల్ 33, డుప్లెసిస్ (సి)రువాన్ పావెల్ (బి)బౌల్ట్ 17, గ్రీన్ (సి)రువాన్ పావెల్ (బి)అశ్విన్ 27, రజత్ పటీధర్ (సి)రియాన్ పరాగ్ (బి)ఆవేశ్ ఖాన్ 34, మ్యాక్స్‌వెల్ (సి)జురెల్ (బి)అశ్విన్ 0, లోమ్రోర్ (సి)రువాన్ పావెల్ (బి)ఆవేశ్ ఖాన్ 32, దినేశ్ కార్తీక్ (సి)జైస్వాల్ (బి)ఆవేశ్ ఖాన్ 11, స్వప్నిల్ సింగ్ (నాటౌట్) 9, కరణ్ శర్మ (సి)రువాన్ పావెల్ (బి)స్వప్నిల్ శర్మ 5, అదనం 4. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 172పరుగులు.

వికెట్ల పతనం: 1/37, 2/56, 3/97, 4/97, 5/122, 6/154, 7/159, 8/172

బౌలింగ్: బౌల్ట్ 4-0-16-1, సందీప్ శర్మ 4-0-48-1, ఆవేశ్ ఖాన్ 4-0-44-3, అశ్విన్ 4-0-19-2, చాహల్ 4-0-43-1.

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)కార్తీక్ (బి)గ్రీన్ 45, టామ్ కోహ్లర్ (బి)ఫెర్గుసన్ 20, సంజు శాంసన్ (స్టంప్)కార్తీక్ (బి)కరణ్ శర్మ 17, రియాన్ పరాగ్ (బి)సిరాజ్ 36, ధృవ్ జురెల్ (రనౌట్)కోహ్లి/గ్రీన్ 8, హెట్‌మైర్ (సి)డుప్లెసిస్ (బి)సిరాజ్ 26, రువాన్ పావెల్ (నాటౌట్) 16, అశ్విన్ (నాటౌట్) 0, అదనం 6. (19ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 174పరుగులు.

వికెట్ల పతనం: 1/46, 2/81, 3/86, 4/112, 5/157, 6/160

బౌలింగ్: సిమ్రన్‌జీత్ సింగ్ 2-0-19-0, సిరాజ్ 4-0-33-2, యశ్ దయాల్ 3-0-37-0, ఫెర్గుసన్ 4-0-37-1, కరణ్ శర్మ 2-0-19-2, గ్రీన్ 4-0-28-1,



స్వతంత్ర దేశంగా పాలస్తీనాను గుర్తించాం

నార్వే, ఐర్లాండ్, స్పెయిన్‌ల ప్రకటన

ఖండించిన ఇజ్రాయిల్ | **ఆ దేశాల నుంచి రాయబారులు వెనక్కి**

కొపెన్‌హేగన్ (డెన్మార్క్) : పాలస్తీనాను స్వతంత్ర దేశంగా తాము గుర్తిస్తున్నట్లు నార్వే, ఐర్లాండ్, స్పెయిన్‌లు బుధవారం ప్రకటించాయి. చారిత్రాత్మకమైన ఈ చర్య పట్ల పాలస్తీనియన్లలో తీవ్ర హర్షాతిరేకాలు వ్యక్తం కాగా, ఇజ్రాయిల్ తీవ్రంగా ఖండించింది. వెంటనే నార్వే, ఐర్లాండ్‌ల నుండి తమ రాయబారులను వెనక్కి రావాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

అయితే పాలస్తీనా గుర్తింపునకు సంబంధించి లాంఛనప్రాయమైన ప్రకటన ఈ నెల 28న వెలువడనుంది. గాజాపై ఇజ్రాయిల్ విరుచుకుపడి మారణహోమం సృష్టిస్తున్న నేపథ్యంలో వేలాదిమంది సామాన్యుల ఊచకోతపై అంతర్జాతీయంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పాలస్తీనియన్ల సుదీర్ఘకాల ఆకాంక్ష నెరవేరే దిశగా ఇదొక సానుకూల పరిణామం.

మొట్ట మొదటగా నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించకపోతే పశ్చిమాసియాలో శాంతి నెలకొనదని వ్యాఖ్యానించారు. స్వతంత్ర దేశంగా వుండేందుకు పాలస్తీనాకు ప్రాథమిక హక్కు వుందన్నారు. స్వతంత్ర దేశంగా పాలస్తీనాకు అన్ని హక్కులు, బాధ్యతలు వర్తిస్తాయన్నారు. ఒక దేశంగా పాలస్తీనా వ్యవహరించేందుకు వుండాల్సిన కీలక అర్హతలను, ప్రమాణాలను కలిగివుందని ప్రపంచ బ్యాంక్ కూడా 2011లోనే గుర్తించిందని అన్నారు. ఐర్లాండ్ ప్రధాని సిమన్ హారిస్ ఇందుకు సంబంధించి ప్రకటన చేస్తూ, స్పెయిన్, నార్వేలతో కలిసి ఈ చర్య తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఐర్లాండ్‌కు, పాలస్తీనాకు ఇదొక చారిత్రక, కీలకమైన రోజని వ్యాఖ్యానించారు. రెండు దేశాల ఏర్పాటు ద్వారా పాలస్తీనా సమస్యను పరిష్కరించే దిశగా ఈ చర్య సాయపడుతుందని పేర్కొన్నారు. 1967 నాటి సరిహద్దుల ప్రాతిపదికగా పాలస్తీనా దేశాన్ని గుర్తించామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇతర దేశాలు కూడా తమ బాటను అనుసరించాలని భావిస్తున్నామన్నారు. జర్మనీ కూడా రెండు దేశాల ఏర్పాటుకు మద్దతును పునరుద్ఘాటించింది. ఈ మేరకు జర్మనీ విదేశాంగ శాఖ ప్రతినిధి ప్రకటించారు. ఆ మూడు దేశాలు తీసుకున్న చర్యను జోర్డాన్ స్వాగతించింది.

ఇజ్రాయిల్ ఖండన

ఈ ప్రకటనలపై ఇజ్రాయిల్ మండిపడింది. తక్షణమే ఐర్లాండ్, నార్వేల నుండి తమ రాయబారులు వెనక్కి రావాలని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ ఆదేశాలు జారీ చేశారు. "పాలస్తీనియన్లకు, మొత్తంగా ప్రపంచ దేశాలకు ఒక సందేశం పంపాలని ఐర్లాండ్, నార్వే భావిస్తున్నాయి, తీవ్రవాదానికి బహుమతి ఇస్తున్నారు." అని కట్జ్ వ్యాఖ్యానించారు. ఈ గుర్తింపు వల్ల గాజాలో వున్న బందీలను విడిపించే ప్రయత్నాలకు దెబ్బ తగులుతుందన్నారు. కాల్పుల విరమణ ప్రయత్నాలు ఇబ్బందుల్లో పడతాయన్నారు.

పాలస్తీనాను గుర్తించే ప్రణాళికల్లో వున్నట్లు గత వారాల్లో అనేక యురోపియన్ దేశాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియా ప్రాంతంలో శాశ్వత శాంతి నెలకొనాలంటే రెండు దేశాల ఏర్పాటే పరిష్కార మార్గమని స్పష్టం చేశాయి. తాజాగా ఈ మూడు దేశాలు తీసుకున్న నిర్ణయంతో ఇతర ఇయు దేశాలు కూడా పాలస్తీనాను గుర్తించే ప్రక్రియ వేగవంతం అవుతుందని ఆశిస్తున్నారు. ఇజ్రాయిల్‌ను ఏకాకిని చేసేందుకు ఐక్యరాజ్య సమితిలో ప్రయత్నాలకు వూతం లభిస్తుందని భావిస్తున్నారు.

ఇదిలావుండగా, గాజాలో యుద్ధాన్ని ఆపాలని ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని కోరుతూ ఇజ్రాయిల్‌వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలకు చెందిన విద్యావేత్తలు, అడ్మినిస్ట్రేటర్లు ఒక పిటిషన్‌పై సంతకాలు చేశారు.

గత 24గంటల్లో గాజాలో 62మంది పాలస్తీనియన్లు మరణించగా, 138మంది గాయపడ్డారు. ఉత్తర గాజాలో చివరగా పనిచేస్తున్న రెండు ఆస్పత్రులు అల్ అవదా, కమల్ అద్వాన్‌లను ఇజ్రాయిల్ బలగాలు చుట్టుముట్టాయని, లోపల 200మందికి పైగా రోగులు వున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఇప్పటివరకు గాజాలో 35,709మంది మరణించగా, 79,990మంది గాయపడ్డారు.

అమెరికా సంచలనం

బంగ్లాదేశ్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలుపు

హోస్టన్(అమెరికా): టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యమిస్తున్న అమెరికా జట్టు ఆసియా జట్టు బంగ్లాదేశ్‌కు ఝలక్ ఇచ్చింది. ఇరుజట్ల మధ్య జరుగుతున్న మూడు టి20ల సిరీస్‌లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన తొలి టి20లో అమెరికా జట్టు ఐదు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తుచేసింది. బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 153పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని అమెరికా జట్టు 19.3ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 156పరుగులు చేసి గెలిచింది. హెూస్టన్ వేదికగా జరిగిన తొలి టి20లో టాస్ గెలిచిన ఆతిథ్య అమెరికా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ స్వల్ప వ్యవధిలోనే ఓపెనర్లు లిటన్ దాస్(14), సౌమ్య సర్కార్(20) వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ నజ్ముల్ హుసేన్ షాంటో(3) కూడా పూర్తిగా విఫలమయ్యాడు. ఆ తర్వాత తౌహిద్ హృదోయ్ ఇన్నింగ్స్ చక్కదిద్దాడు.

హాకీలో శుభారంభం

షూటౌట్‌లో అర్జెంటీనాపై గెలుపు



బ్యూనస్‌ఎయిర్(అర్జెంటీనా): యూరోప్ పర్యటనలో భాగంగా జరుగుతున్న ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్-2023-24 సీజన్‌లో భారత్ శుభారంభం చేసింది. పురుషుల హాకీజట్టు అర్జెంటీనాపై గెలుపొందగా.. మహిళల జట్టు అర్జెంటీనా చేతిలో పరాజ యాన్ని చవిచూసింది. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పురుషుల జట్టు షూటౌట్‌లో గెలిచింది. నాలుగు క్వార్టర్లు ముగిసేసరికి భారత్-అర్జెంటీనా జట్లు 2-2గోల్స్‌తో సమంగా నిలిచాయి. అనంతరం పెనాల్టీ షూటౌట్‌లో భారత్ 5-4గోల్స్ తేడాతో అర్జెంటీనాను ఓడించింది. భారతజట్టు గెలుపులో గోల్‌కీపర్ శ్రీజేష్ కీలకపాత్ర పోషించాడు. తొలి మూడు పెనాల్టీ షూటౌట్‌లను ఇరుజట్లు గోల్స్ చేయడంతో సడెన్ డెత్‌లో భారత్ గెలిచింది. హర్మన్‌ప్రీత్, శ్రీజేశ్, సుఖ్‌జీత్ గోల్స్ చేయగా.. లలిత్ గోల్ చేయడంలో విఫలమయ్యాడు. శ్రీజేశ్ ఒక గోల్‌ను అడ్డుకోవడంతో 3గోల్స్ పూర్తయ్యేసరికి ఇరుజట్లు 2-2తో సమంగా నిలిచాయి. ఆ తర్వాత సడెన్ డెత్‌లకు దారితీసింది. ఈ పర్యటనలో భాగంగా 26న బెల్జియంతో తలపడనుంది.


నిరాశపరిచిన మహిళలు..

ఇక భారత మహిళలజట్టు అర్జెంటీనా చేతిలో చిత్తుగా ఓడింది. ఈ పర్యటనలో భాగంగా బుధవారం అర్జెంటీనాతో తలపడిన భారత మహిళల హాకీ జట్టు 0-5గోల్స్ తేడాతో పరాజయాన్ని చవిచూసింది. అర్జెంటీనా తరఫున జులీటా(53, 59వ ని.), అగస్టినా(13వ ని.), వలెంటినా(24వ ని.), విక్టోరియా(41వ ని.) ఒక్కో గోల్ కొట్టారు. భారత మహిళలజట్టు నూతన కోచ్ హరేంద్ర సింగ్ నేతృత్వంలో తొలిసారి యూరప్ పర్యటనకు వచ్చింది.

వియత్నాం కొత్త అధ్యక్షుడిగా టో లామ్



హనోయ్ : వియత్నాం కొత్త అధ్యక్షుడిగా ఉన్నత భద్రతాధికారి టో లామ్ నియమితులు కానున్నారు. వియత్నాం నేషనల్ అసెంబ్లీ ఈ నియామకాన్ని ధృవీకరించింది. దేశ రాజకీయ వ్యవస్థను, వ్యాపార సంస్థలను తీవ్రంగా కుదిపివేసిన అవినీతి వ్యతిరేక ప్రచారం నేపథ్యంలో గత అధ్యక్షుడు రాజీనామా చేశారు. ఫలితంగా ఉన్నత స్థాయిలో ప్రభుత్వంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. వియత్నాం అధ్యక్ష పదవి కేవలం నామమాత్రమే. కానీ దేశాధినేతగా ఆయన నిర్వహించే ఈ కొత్త పాత్ర ఆయనను మరింత బలమైన స్థితిలో వుంచుతుంది. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ తదుపరి ప్రధాన కార్యదర్శిగా అయేందుకు ఇది ఉపయోగపడుతుందని సింగపూర్‌కి చెందిన విశ్లేషకుడు గియాంగ్ వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నుగుయెన్ ఫూ ట్రాంగ్ 2021లో మూడోసారి ఎన్నికయ్యారు. అయితే వృద్ధాప్యం (80) కారణంగా ఆయన 2026లో మరోసారి బాధ్యతలు చేపట్టకపోవచ్చు. కమ్యూనిస్టు పార్టీ ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన ముప్పు అవినీతి అని ట్రాంగ్ భావిస్తారు. వియత్నాం ఉన్నత భద్రతాధికారిగా లామ్ నేతృత్వంలో ట్రాంగ్ అవినీతి వ్యతిరేక పోరాటాన్ని చేపట్టారు. లామ్ నాలుగు దశాబ్దాల పాటు ప్రజా భద్రతా వ్యవహారాల మంత్రిత్వ శాఖలో పనిచేశారు. 2016లో మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం వియత్నాం పోలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎదిగారు.


కార్తికేయ

భజే వాయు వేగం రిలీజ్‌కి రెడీ

యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ పై హీరో కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటిస్తున్న సినిమా 'భజే వాయు వేగం'. ఐశ్వర్య మీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'హ్యాపీ డేస్' ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్రను పోషిస్తున్నారు.

ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు ప్రశాంత్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అజయ్ కుమార్ రాజు.పి. కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఈ నెల 31న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

అయితే ఈ సినిమాను నేషనల్ వైడ్‌గా ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని తన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ద్వారా రిలీజ్ చేస్తున్నారు. 'బేబి', 'గుంటూరు కారం', 'హనుమాన్', 'గామి', 'ఓం భీమ్ బుష్', 'టిల్లు స్క్వేర్' వంటి సూపర్ హిట్ సినిమాల డిస్ట్రిబ్యూటర్‌గా సక్సెస్ ఫుల్ జర్నీ చేస్తున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తమ టీమ్‌లో జాయిన్ కావడాన్ని 'భజే వాయు వేగం' మేకర్స్ హ్యాపీగా అనౌన్స్ చేశారు. అలాగే ఈ సినిమా సాధించబోయే ఘనవిజయంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు.

కార్తికేయ గుమ్మకొండ, ఐశ్వర్య మీనన్, రాహుల్ టైసన్, తనికెళ్ల భరణి, రవిశంకర్, శరత్ లోహితస్వ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి మాటలు: మధు శ్రీనివాస్, ఆర్ట్: గాంధీ నడికుడికర్, ఎడిటర్: సత్య జి, సినిమాటోగ్రఫీ: ఆర్.డి రాజశేఖర్, మ్యూజిక్ (పాటలు) - రధన్, మ్యూజిక్ అండ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ - కపిల్ కుమార్, కొరియోగ్రఫీ - విశ్వ రఘు, కో ప్రొడ్యూసర్ - అజయ్ కుమార్ రాజు.పి, ప్రొడ్యూసర్: యూవీ కాన్సెప్ట్స్, దర్శకుడు: ప్రశాంత్ రెడ్డి చంద్రపు.

నవచిత్రం

త్వరలో సెట్స్‌పైకి సెన్సేషనల్ ప్రాజెక్ట్


వైవీఎస్ చౌదరి

ఎన్నో అద్భుతమైన చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక మార్క్‌ని క్రియేట్ చేసుకున్నారు దర్శకుడు వైవీఎస్ చౌదరి. దర్శకుడిగానే కాకుండా రచయితగా, నిర్మాతగా అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించి తన అభిరుచిని చాటుకున్నారు. 'శ్రీ సీతా రాముల కళ్యాణం చూతము రారండి, సీతారామ రాజు, లాహిరి లాహిరి లాహిరిలో, సీతయ్య, దేవదాసు' లాంటి బ్లాక్‌బస్టర్స్‌తో ప్రేక్షకులను అద్భుతంగా అలరించిన దర్శకుడు వైవిఎస్ చౌదరి నుంచి మరో సెన్సేషనల్ ప్రాజెక్ట్ రాబోతుంది. నేడు (గురువారం) దర్శకుడు వైవిఎస్ చౌదరి పుట్టిన రోజు. అలాగే ఆయన అభిమాన దర్శకులు, దర్శకేంద్రులు కె. రాఘవేంద్రరావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ సంవత్సరంలోనే ఓ సెన్సేషనల్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టబోతున్నారు వైవిఎస్ చౌదరి. ప్రతిభగల కొత్త నటీనటులతో.. న్యూ ఏజ్ యూనిక్ కంటెంట్‌తో, హై టెక్నికల్ వాల్యూస్‌తో ఈ ప్రాజెక్ట్ ఉండబోతోంది. ఈ సినిమాకి సంబధించిన పూర్తి వివరాలు త్వరలోనే తెలియజేయనున్నారు.

ఆహా అనేలా సీజన్ 3



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు, ప్రేమికుల నుంచి ప్రశంసలు పొందిన సింగింగ్ రియాలిటీ షో 'ఆహా తెలుగు ఇండియన్ ఐడల్'. ఇప్పటికే రెండు సీజన్స్‌తో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ఈ రియాలిటీ షో మూడో సీజన్‌తో మన ముందుకు రానుంది. జూన్ 7 నుంచి ఇండియన్ ఐడల్ సీజన్ 3 ఆహాలో ప్రేక్షకులను అలరించనుంది. ఇండియన్ ఐడల్ సీజన్ 3 గ్రాండ్ లాంచ్ ఈవెంట్ బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో...హోస్ట్ శ్రీరామ్ చంద్ర మాట్లాడుతూ, "ఇండియన్ ఐడల్ 3' సీజన్‌లో మళ్లీ రావటం చాలా చాలా సంతోషంగా ఉంది. ఈ సీజన్‌కు సంబంధించిన ఆడిషన్స్ జరిగినప్పుడు కేవలం సింగర్స్ మాత్రమే కాదు.. చాలా మంది సంగీత కళకారులు ఇందులో పార్టిసిపేట్ చేశారు. ఈ సీజన్ 3తో గొప్ప టాలెంట్‌ను తీసుకురాబోతున్నారు' అని తెలిపారు.

"ఆహా తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 2 చేసిన తర్వాత సీజన్ 3కి కాల్ వస్తుందని నేను అనుకోలేదు. అయితే నాకు ఆహా నుంచి కాల్ వచ్చింది. సీజన్ 3కి చక్కగా ఆడిషన్స్ ముగిశాయి. మంచి కంటెస్టెంట్స్ వచ్చారు. గత సీజన్స్‌లాగా ఈ సీజన్‌లోనూ చాలా మంచి ఆణిముత్యాలు దొరికారు. వాళ్లు ఈ వేదికను ఎలా ఉపయోగించుకుని ప్రతిభను చాటుకుంటారో చూడాలి. ఇండియన్ ఐడల్ సీజన్ 3 చాలా చాలా బావుంటుంది' అని సింగర్ గీతా మాధురి చెప్పారు. 'ఇండియన్ ఐడల్ సీజన్3లో యంగ్ టాలెంటెడ్ సింగర్స్ మాత్రమే కాదు, ఏదో సాధించాలనే తపన ఉన్నవాళ్లు వచ్చారు. సీజన్ 3 చాలా మందిని ఇన్‌స్పైర్ చేస్తుంది' అని సింగర్ కార్తీక్ చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్.తమన్ మాట్లాడుతూ, 'గత రెండు సీజన్స్ కంటే ఇండియన్ ఐడల్ సీజన్ 3లో వరల్డ్ వైడ్ మ్యూజిక్ కంటెస్టెంట్స్ వచ్చారు. అందరిలో నుంచి 12 మంది టాప్ సింగర్స్‌ను ఎంపిక చేశాం. సీజన్ 3 నుంచి గొప్ప టాలెంట్ మన ముందుకు రాబోతుంది. ఇది మాకు ఓ గొప్ప ఎక్స్‌పీరియెన్స్' అని అన్నారు.

పుష్ప పుష్ప.. నా కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్ సాంగ్


దీపక్ బ్లూ

'ఇప్పటివరకూ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు మూడు వందలకు పైగా పాటలు పాడాను. వీటిల్లో 'పుష్ప పుష్ప..' పాట నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్ కావడం చాలా ఆనందంగా ఉంది' అని సింగర్ దీపక్ బ్లూ చెప్పారు.

అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్ లో ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పుష్ప-2 ది రూల్'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఇటివలే ఈ చిత్రం నుంచి విడుదలైన 'పుష్ప పుష్ప..' సాంగ్ సెన్సేషనల్ హిట్ అయ్యింది. ఈ చార్ట్ బస్టర్ నెంబర్‌ని సింగర్ దీపక్ బ్లూ పాడారు. ఈ సాంగ్ ప్రస్తుతం టాప్ ట్రెండ్‌లో కొనసాగుతున్న నేపథ్యంలో సింగర్ దీపక్ బ్లూ మీడియాతో ముచ్చటించారు.

- గత 12 ఏళ్ళుగా పాడుతున్నాను. తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు మూడు వందలకు పైగా పాటలు పాడాను. వీటిల్లో రీసెంట్‌గా రిలీజైన 'పుష్ప..పుష్ప' పాట సెన్సేషనల్ హిట్ కావడం చాలా ఆనందంగా ఉంది. నా కెరీర్‌లోనే ఇదొక బిగ్గెస్ట్ హిట్ సాంగ్ అని గర్వంగా చెప్పుకుంటాను.
- ఈ ప్రయాణంలో తొలి పాట అవకావం ఇచ్చిన విజయ్ ఆంటోనీకి, తర్వాత దర్శకుడు తేజకి కృతజ్ఞతలు. దేవిశ్రీ ప్రసాద్ కంపోజిషన్‌లో 'నాన్నకు ప్రేమతో'లో పాడిన లవ్ దెబ్బ. అది చాలా పెద్ద హిట్ అయ్యింది. అలాగే తమన్ కంపోజిషన్‌లో పాడిన 'బ్రూస్లీ' మెగా మీటర్ పాట కూడా చాలా పెద్ద హిట్ అయ్యింది. తమన్‌కి దాదాపు 35 పాటలు పాడాను. బీరువా (చెలియా చెలియా), పండగ చేస్కో (లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్) కిక్ 2, చుట్టాలబ్బాయి, డిక్టేటర్, ఇటీవల వారసుడు సినిమాలో కూడా పాడాను.
- దేవికి మొదట లవ్ దెబ్బ పాడాను. తర్వాత సరిలేరు నీకెవ్వరు లో ప్రోమో సాంగ్ పాడాను. పుష్ప పాట కోసం ఓ పవర్ ఫుల్ వాయిస్ కోసం చూస్తున్న క్రమంలో నన్ను ఎంపిక చేశారు. ఈ పాటని చాలా ఎంజాయ్ చేస్తూ పాడాను. తెరపై చూడటానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. దేవిశ్రీ, తమన్ ఇద్దరూ క్లారిటీ ఉన్న సంగీత దర్శకులు. వారితో పని చేయటం ఆనందంగా ఉంది.
- ఇక సంగీత దర్శకుడిగా ఒక ఇండిపెండెంట్ ఆల్బమ్ చేయాలని ఉంది. అలాగే నాకు మెలోడి పాటలు పాడటం ఇష్టం. కానీ ఇప్పటివరకూ మాస్ పాటలే వచ్చాయి. మెలోడీ పాటలు కూడా ఉండేలా ఇండిపెండెంట్ ఆల్బం చేయాలనే ఆలోచన ఉంది.

ఆ డెవిల్ ఎవరు?


ఆదా శర్మ

ఆదా శర్మ ప్రస్తుతం నేషనల్ వైడ్‌గా క్రేజీ బ్యూటీగా మారిపోయారు. 'ది కేరళ ఫైల్స్, బస్తర్' వంటి సినిమాలతో ఆదా శర్మ రేంజ్ మారిపోయింది. చాలా కాలం తరువాత అదా శర్మ ప్రస్తుతం తెలుగు వారిని 'సి.డి' క్రిమినల్ ఆర్ డెవిల్' అనే సినిమాతో పలకరించ బోతున్నారు. కృష్ణ అన్నం దర్శకత్వం వహించిన ఈ మూవీని ఎస్ఎస్‌సిఎమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ మూవీకి గిరిధర్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు.

హర్రర్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ జోనర్లకు ఎక్కువగా డిమాండ్ ఉంది. కంటెంట్, కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు ఎక్కువగా సక్సెస్ అవుతున్నాయి. ఈ సినిమా కూడా ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతోంది. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా సినిమా మీద అంచనాలు పెంచేశాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ సభ్యులు ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికేట్‌ను జారీ చేశారు. ఈనెల 24న ఈ చిత్రం భారీ ఎత్తున విడుదల కాబోతోంది. విశ్వంత్, జబర్దస్త్ రోహిణి, భరణి శంకర్, రమణ భార్గవ్, మహేష్ విట్టా తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.

భావోద్వేగాల సమాహారం



జబర్దస్త్ ఫేమ్ గెటప్ శ్రీను 'రాజు యాదవ్'తో హీరోగా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా కృష్ణమాచారి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్ టైన్‌మెంట్ బ్యానర్లపై కె.ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఈనెల 24న ఈ సినిమా విడుదల కానుంది.

తాజాగా డైరెక్టర్ కొరటాల శివ 'రాజు యాదవ్' నుంచి ఫీల్ మై స్మైల్ సాంగ్‌ని లాంచ్ చేసి, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. స్టార్ కంపోజర్ హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ పాటని ఫీల్ గుడ్ మెలోడీ నెంబర్‌గా కంపోజ్ చేశారు. కాసర్ల శ్యాం అందించిన లిరిక్స్ అద్భుతంగా ఆకట్టుకున్నాయి. యశస్వి కొండేపూడి తన లవ్లీ వాయిస్‌తో మెస్మరైజ్ చేశాడు. ఈ పాటలో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది.

ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రాన్ని నిర్మాత బన్నీ వాస్ ఏపీ, తెలంగాణలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు. రాజు యాదవ్.. లవ్, కామెడీతో పాటు హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలతో అలరించనుంది. ఇక ఇందులో రాజుయాదవ్‌గా గెటప్ శ్రీను తన నట విశ్వరూపాన్ని చూపించబోతున్నారు. ఇటీవల ఈచిత్ర టీజర్‌ని చూసిన చిరంజీవి సైతం గెటప్ శ్రీను నటన గురించి అభినందించారు. గెటప్ శ్రీను, అంకిత ఖరత్, ఆనంద చక్రపాణి, రాకెట్ రాఘవ, మిర్చి హేమంత్, జబర్దస్త్ సన్నీ, సంతోష్ కల్వచెర్ల, శ్రీరామ్, కళ్యాణ్ భూషణ్, శ్రీమణి, పవన్ రమేష్, ఉత్తర ప్రశాంత్, తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి రచన, దర్శకత్వం: కృష్ణమాచారి. కె, నిర్మాతలు: ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, డీవోపీ: సాయిరామ్ ఉదయ్, సాహిత్యం: చంద్రబోస్, కాసర్ల శ్యామ్, ఎడిటర్: బొంతల నాగేశ్వర రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగేళా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విప్లవ్, గాయకులు: చంద్రబోస్, రామ్ మిరియాల, రాహుల్ సిప్లిగంజ్, మంగ్లీ, యసస్వి కొండేపూడి, కొరియోగ్రఫీ: జిత్తు మాస్టర్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

పదోన్నతులిచ్చారు.. జీతాలు మరిచారు

- కొన్ని శాఖల్లో ఐదు నెలలుగా అందని వేతనాలు
- స్థానికత ఓ చోట...ఉద్యోగం మరో చోట
- ఆందోళనలో పూర్వ వీఆర్ఏలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పూర్వ వీఆర్ఏల పరిస్థితి దుర్భరంగా మారింది. ఆ వ్యవస్థను రద్దు చేసి ఇతర శాఖల్లో కలిపిన నేపథ్యంలో కొన్ని శాఖల్లో విధులు నిర్వహిస్తున్న వారు ఐదు నెలలుగా జీతభత్యాలకు నోచుకోక అలమటిస్తున్నారు. గతేడాది చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా వారిని క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. ఆయా విభాగాల్లో చేరిన వారికి ఇప్పటి వరకూ గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదు. స్థానికత ఒక చోట..ఉద్యోగం మరో చోట కావడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

"భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జీసీసీలో పని చేస్తున్న వీఆర్వోలకు గత 22 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన ఐదు శాతం ఐఆర్ పెంపుదల కూడా వారికి వర్తించడం లేదు. కారుణ్య నియామకాలకు అర్హత లేకుండా పోయింది. ఆరోగ్యం, పిల్లల చదువుల విషయమై రాయితీ పొందే సౌకర్యం కోల్పోయారు సర్కార్ ఉద్యోగులకు వర్తించే ఇతర


(ఫైల్)

బకాయిలూ రావడం లేదు" ఇవి రాష్ట్రంలో పూర్వ వీఆర్వోలు ఎదుర్కొంటున్న దుస్థితికి కొన్ని ఉదాహరణలు మాత్రమే. 2023లో వారు చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా 10 నెలల క్రితం వీఆర్ఎలకు పే స్కేలు, పదోన్నతి, కల్పిస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం జీవో నెంబర్ 81ని జారీ చేసింది. డిగ్రీ, ఆపై చదువులు చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్లుగా ఇంటర్ చదివిన వారిని రికార్డ్ అసిస్టెంట్లుగా, పదో తరగతి చదివిన వారిని ఆఫీసు సబార్డినేట్లుగా నియమిస్తూ రాష్ట్రంలోని 20 వేల మంది వీఆర్ఎలలో 16 వేల మందిని ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఆయా శాఖల్లో చేరిన వారికి కనీస గుర్తింపు కార్డు ఇవ్వక పోగా వారికి జాబ్ చార్ట్ కూడా కేటాయించలేదు. ఫలితంగా వారు ఏ శాఖ ఉద్యోగులో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఆఫీస్ సబార్డినేట్లు సర్కార్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో వేసిన కేసును బూచిగా చూపి సర్కార్ ప్రారంభంలో కాలయాపన చేసింది. అయితే ఆ కేసును కోర్టు కొట్టేసినా వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన పూర్వ వీఆర్ఏల విధులు, బాధ్యతలను నాటి బీఆర్ఎస్ సర్కారు తేల్చలేదు.

సమ్మె కాలం నుంచి నేటి వరకు ఆర్థిక ఇబ్బందుల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 90 మందికి పైగా వీఆర్ఏలు చనిపోయారు. ఇందులో దాదాపు 20 మంది ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కార్ అయినా వివిధ శాఖల్లో తమను సర్దుబాటు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేస్తున్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి

సొసైటీలు, కార్పొరేషన్లలో సర్దు బాటు చేసిన వారికి జీతాలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. అలాగే కొన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న వీఆర్ఏలు సైతం జీతాల కోసం ఎదురు చూడక తప్పడం లేదు. వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు జాబ్‌చార్ట్‌ను కేటాయించాలి. ఇప్పటికీ ఏ శాఖలో సర్దుబాటు చేయని వారిని వెంటనే ఇతర శాఖల్లో చేర్చుకోవాలి. పదోన్నతి పొందిన జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లకు వారి విద్యార్హతలను బట్టి నియమించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం వీఆర్ఏలకు న్యాయం చేయాలి.

గరికె ఉపేందర్ రావు, అధ్యక్షులు, తెలంగాణ వీఆర్ఏల సంక్షేమ సంఘం

కారుడోర్ లాక్ అవడంతో..పాప మృతి


(ఫైల్)

నవతెలంగాణ-మణుగూరు

కారు డోర్ లాక్ అవడంతో ఊపిరాడక పాప మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో జరిగింది. వివరాల ప్రకారం.. మంగళవారం మండలంలోని సాంబాయి గూడెం గ్రామంలో చిన్నపిల్లలు ఆడుకుంటూ ఇంటి ముందు ఆగి ఉన్న కారులోకి ఎక్కారు. కొందరు కారు దిగి వెళ్ళిపోయారు. కుంజ సాయి, లిఖిత దంపతుల కూతురు కల్విషా (4) కారులోనే ఉండిపోయింది. కారు డోర్ లాక్ అవ్వడంతో ఊపిరాడక మరణించింది.

తల్లిదండ్రులు గమనించలేదు. పాప కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రాత్రి 8 గంటల వరకు గాలించారు. చివరికి కారులో ఉన్నట్టు గమనించిన తల్లిదండ్రులు కారు డోర్ ఓపెన్ చేయగా అప్పటికే మరణించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాప ఇంటికెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రమాదవశాత్తు మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో తల్లి,కూతురు ఆత్మహత్య

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల


(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులు.. భూ తగాదాలు ఓ కుటుంబంలో విషాదాన్ని నింపాయి. పురుగుల మందు తాగి తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా మానపాడు మండలం పరిధిలోని బూడిదపాడు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బూడిదపాడు గ్రామానికి చెందిన నర్సింహులు అన్నదమ్ముల మధ్య చాలా కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. ఎన్నిసార్లు పంచాయితీ పెట్టినా ఒక కొలిక్కి రాలేదు. గొడవలతో విసిగిపోయిన నర్సింహులు భార్య వరలక్ష్మి, కుమార్తె అనురాధ మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకెళ్లారు. కుటుంబీకులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించేలోపే ఇద్దరూ మృతిచెందినట్టు డాక్టర్లు తెలిపారు. అయితే, కూతురు, కొడుకు చదువు కోసం, పెండ్లి కోసం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని, వారసత్వంగా వచ్చిన భూములు సీలింగ్ ఉండటంతో ఎవరూ కొనేందుకు ముందుకు రావడం లేదు. ఈ విషయమై చాలాసార్లు అన్నదమ్ములకు విజ్ఞప్తి చేశాడు. అయినా వివాదం సమసిపోలేదు. దాంతో తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. కొడుకు హైదరాబాదులో చదువుకున్నట్టు తెలిసింది.

తాలిపేరు కాలువలోకి దూసుకెళ్లిన బొలేరో

- ఎనిమిది మందికి గాయాలు
- తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-చర్ల



తాలిపేరు కాలువలోకి బొలేరో వాహనం దూసుకెళ్లిన ఘటనలో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ధనవాయి పేట సమీపాన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ సరిహద్దు బూరుగుపాడు ఆదివాసీ గ్రామం, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సుకుమా జిల్లా దొర్నపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దెబ్బతోట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతదేహాన్ని తీసుకొని వెళ్లడానికి అక్కడి నుండి వచ్చిన పది మందితో పాటు మృతదేహంతో ప్రయాణిస్తున్న బొలోరో వాహనం మూల మలుపు వద్ద అదుపుతప్పి కాలువలోకి జారి పడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న వారిలో ఎనిమిది మందికి స్వల్ప గాయాలైనట్టు స్థానికులు తెలిపారు. అతి వేగంగా వాహనం నడిపితే పెను ప్రమాదమే జరిగి ఉండేదని క్షతగాత్రులు అంటున్నారు. కాగా, క్షతగాత్రులందరినీ స్థానిక సత్యనారాయణపురం వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

నేడే ఎడ్‌సెట్ రాతపరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఎడ్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ రాతపరీక్ష గురువారం ఆన్‌లైన్‌లో జరగనుంది. ఎడ్‌సెట్‌కు 33,879 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. గురువారం రెండు విడతల్లో ఎడ్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడతలో 16,929 మంది, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రెండో విడతలో 16,950 మంది రాతపరీక్షలకు హాజరవుతారు. రాష్ట్రవ్యాప్తంగా 79 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, కర్నూల్‌లో రెండు పరీక్షా కేంద్రాలున్నాయి. రాతపరీక్షలకు 90 నిమిషాల ముందు నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తామని పేర్కొన్నారు. ఉదయం విడతకు 8.30 గంటల నుంచి, మధ్యాహ్నం విడతకు 12.30 గంటల నుంచి అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లేందుకు అవకాశముంది. పరీక్ష ప్రారంభమైన తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

కిర్గిజ్‌స్థాన్‌లోని తెలంగాణ విద్యార్థులకు రక్షణ కల్పించాలి

- ప్రత్యేక మంత్రిని కేటాయించి పర్యవేక్షించాలి :ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఇటీవల మూకుమ్మడి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో, భారతదేశంతో సహా విదేశీ విద్యార్థులందరి భద్రత పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తెలిపింది. మంగళవారం కూడా పలు ఘటనలు జరిగాయని పేర్కొంది. ఎక్కువ మంది తెలుగు విద్యార్థులున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిని కేటాయించి పర్యవేక్షించాలని డిమాండ్ చేసింది. తెలంగాణ విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి చెందిన విద్యార్థులు కూడా కిర్గిజ్‌స్థాన్‌లో చదువుతున్నారనీ, అక్కడ పెరుగుతున్న హింసాకాండను దృష్టిలో ఉంచుకుని వారి భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర విద్యార్థుల కోసం ప్రత్యేక కమిటీని వేసి సచివాలయంలో సహాయక కేంద్రాన్ని ప్రారంభించాలని సూచించారు. తద్వారా వారి సమస్యలను తెలుసుకుని సహాయపడొచ్చని వివరించారు. వారి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడానికి కిర్గిజ్‌స్థాన్‌లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బాధిత విద్యార్థులకు వారి కుటుంబాలు సంబంధిత అధికారుల మధ్య సమన్వయం సులభతరం చేయాలని తెలిపారు. విదేశాల్లో ఉన్న రాష్ట్ర విద్యార్థులను రక్షించడానికి

ఖమ్మం డీఎంహెచ్‌వోపై విజి'లెన్స్'

'నవతెలంగాణ' కథనాలతో కదలిక

- ఆధారాలు సమర్పించాలని వరంగల్ రీజియన్ విజిలెన్స్ ఆఫీస్ నుంచి ఆదేశాలు
- మహబూబాబాద్ ఎమ్మెల్యేను అడ్డుపెట్టుకుని ఎంక్వయిరీ నుంచి బయటపడే యత్నం
- ముఖ్యమంత్రి పేషీ సూచన మేరకే ఎంక్వయిరీకి ఆదేశించినట్టు సమాచారం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి / ఖమ్మం

ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో చోటు చేసుకుంటున్న అవకతవకలపై 'నవతెలంగాణ'లో ప్రచురితమైన కథనాలు, పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, టీఎస్ (పీహెచ్ఎంఈయూ) ఖమ్మం జిల్లా కమిటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎ.బాలకోటి విచారణకు ఆదేశించారు. డీఎంహెచ్‌వో మాలతి నాలుగేండ్ల క్రితం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వైద్యారోగ్యశాఖలోని వివిధ విభాగాల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్టు ఆమెపై ఆరోపణలున్నాయి. దాంతో ఆయా సెక్షన్ల నుంచి వివరాలు సమర్పించాల్సిందిగా విజిలెన్స్ ఏఎస్పీ సూచించారు. 'నవతెలంగాణ' కథనంలో ప్రస్తావించిన ప్రతి అంశానికీ సంబంధించిన వివరణను విజిలెన్స్ ఆఫీసర్ కోరారు. గత నెల 25వ తేదీన డీఎంహెచ్‌వో ఆఫీస్‌కు ఈ వివరాలు సమర్పించాల్సిందిగా ఆదేశాలు అందాయి. ఈ విషయం బయటకు రాకుండా డీఎంహెచ్‌వో కార్యాలయం జాగ్రత్త పడింది. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి వివరాలు పంపినా.. అవి పూర్తిస్థాయిలో లేకపోవడంతో తిరిగి పంపించాల్సిందిగా విజిలెన్స్ ఆఫీసర్ ఆదేశాలిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీ నుంచే విజిలెన్స్ అధికారులకు ఈ వ్యవహారంపై ఆదేశాలున్నట్టు సమాచారం.

విజిలెన్స్ అధికారి అడిగిన వివరాలు ఏంటి..?

జిల్లాలో ఎన్ని ప్రయివేటు హాస్పిటల్స్ ఉన్నాయి? 2019 సంవత్సరం నుంచి వాటిలో శాశ్వత, తాత్కాలిక ప్రాతిపదికన అనుమతులు ఎన్నింటికి ఇచ్చారు, 2019 నుంచి 2023వరకు హైదరాబాద్ నుంచి వచ్చిన హయ్యర్ అఫీషియల్స్‌ను హోటల్ రూమ్స్‌లో ఉంచేందుకు చేసిన ఖర్చు ఎంత?, 2019 నుంచి 2021 వరకు నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం)కు మంజూరైన నిధులు ఎన్ని? వాటిలో ఎంత ఖర్చు చేశారు, 2019 నుంచి 2023 వరకు ఎన్ని ప్రయివేటు వాహనాలను అద్దె ప్రాతిపదికన శాఖ అవసరాలకు వినియోగించారు. వాటికి చెల్లించిన వ్యయం ఎంత? 2019 నుంచి 2022 వరకు కరోనా వ్యాప్తి నియంత్రణకు వచ్చిన నిధులు ఎన్ని? వాటిలో ఎంత మొత్తం ఖర్చు చేశారు? అలాగే రెమ్‌డిసివర్ ఇంజిక్షన్లు, ర్యాపిడ్ టెస్ట్ కిట్లు ఎన్ని వచ్చాయి? వాటి పంపిణీ వివరాలతో పాటు ఖమ్మంలోని మమత మెడికల్ కళాశాలకు ఎన్ని పంపిణీ చేశారో వివరాలను కూడా అందించాల్సిందిగా కోరారు. అలాగే 2019 నుంచి కారుణ్య నియామకాలు, సంబంధిత ఉద్యోగుల అర్హతలకు సంబంధించిన వివరాలూ సమర్పించాల్సిందిగా అడిగారు. 2019 నుంచి 2023 వరకు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఎఎస్) నిధులు ఎన్ని వచ్చాయి? వాటిని ఎలా ఖర్చు చేశారు? తదితర వివరాలను ఆర్డర్స్ అందిన వారం రోజుల్లో అందించాల్సిందిగా ఆదేశాలిచ్చారు.

అరకొర ఆధారాలు..

విజిలెన్స్ అధికారి అడిగిన ఆధారాలను అరకొర సమాచారంతో డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి పంపినట్టు తెలుస్తోంది. అయితే వాటన్నింటినీ తిరిగి పంపించి జిరాక్స్ ప్రతులతో సమర్పించాల్సిందిగా విజిలెన్స్ అధికారి కోరారు. ఈమేరకు మే 11వ తేదీన తిరిగి పంపారు. అయినప్పటికీ ఆ వివరాలు సమగ్రంగా లేకపోవడంతో మళ్లీ 17వ తేదీన కూడా పంపించారని సమాచారం.

ఎంక్వయిరీ తప్పించేందుకు తంటాలా..?

ఖమ్మం డీఎంహెచ్‌వో అవకతవకలపై 'నవతెలంగాణ'లో వచ్చిన కథనాలు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి ఉద్యోగ సంఘాల నేతలు



తీసుకెళ్లారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి కూడా తీసుకెళ్లినా.. అక్కడ ఓ ఉద్యోగి అడ్డుకుంటున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు పీహెచ్‌సీలో ఒకప్పుడు ఫార్మసిస్టుగా పనిచేసిన ఉద్యోగి, అలాగే నేలకొండపల్లి మండలం బోదులబండ పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నిషియన్‌గా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై వైద్యారోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న మరో ఉద్యోగి డీఎంహెచ్‌వోను ఈ వ్యవహారంలో కాపాడేందుకు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం. అలాగే హెల్త్ డైరెక్టరేట్‌లోనూ ఓ ఉన్నతస్థాయి ఉద్యోగి అండదండలు డీఎంహెచ్‌వోకు ఉన్నాయనే చర్చ జిల్లా వైద్యారోగ్యశాఖలో సాగుతోంది.

మహబూబాబాద్ ఎమ్మెల్యేతో పైరవీ?


మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌తో ఉన్న బంధుత్వాన్ని అడ్డుపెట్టుకుని విజిలెన్స్ ఎంక్వయిరీ నుంచి బయటపడేందుకు డీఎంహెచ్‌వో ప్రయత్నిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే నేరుగా సీఎం పేషీ నుంచే ఎంక్వయిరీకి ఆదేశాలు అందిన నేపథ్యంలో డీఎంహెచ్‌వో దిక్కుతోచని స్థితిలో పడ్డారని సమాచారం. జిల్లాలోని ముగ్గురు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి సైతం డీఎంహెచ్‌వో వ్యవహారాన్ని ఉద్యోగ సంఘాలు తీసుకెళ్లాయి. గతంలో డీఎంహెచ్‌వో తీరుపై ఏసీబీ అధికారులకు సైతం ఫిర్యాదులు వెళ్లటం గమనార్హం. విజిలెన్స్ ఎంక్వయిరీపై 'నవతెలంగాణ' డీఎంహెచ్‌వోను సంప్రదించింది. దీనిపై ఆమె నుంచి సరైన సమాధానం లేదు.

సెలవులో ఉన్నాను.. నాకు తెలియదు.. - బి. మాలతి, ఖమ్మం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశాలు వచ్చినప్పుడు మా నాన్నగారు చనిపోవడంతో సెలవులో ఉన్నాను. కాబట్టి నాకు ఈ విషయం తెలియదు. ఆధారాలను పంపారో లేదో తెలుసుకుంటాను.

మళ్లీ కోవిడ్ పంజా

- కేపీ 2 కేసులు 290, కేపీ 1 లో 34



న్యూఢిల్లీ : కోవిడ్ -19 కొత్త వేరియంట్‌తో మళ్లీ కలకలం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు 324 కేసులు నమోదయ్యాయి. ఇన్సాకోగ్ డేటా ప్రకారం... కేపీ 2 -290, కేపీ 1 - 34 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ జేఎన్1 సబ్ వేరియంట్‌లని, ఆస్పత్రిలో చేరేంత తీవ్రత లేదని, కేసుల్లోనూ పెరుగుదల లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. అందువల్ల ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని వెల్లడించింది. ఐఎన్ఎస్ఏసీఓజీ ఈ కొత్త వేరియంట్ మీద నిఘా పెట్టి, వైరస్ తీవ్రత తెలుసుకునేందుకు నమూనాలు సేకరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. ఇన్సాకోగ్ సేకరించిన డేటా ప్రకారం ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కేపీ 1 వేరియంట్‌లో 34 కేసులు నమోదయ్యాయి.

ఒక్క పశ్చిమ బెంగాల్‌లో అత్యధిక (23) కేసులు నమోదయ్యాయి. ఇతర రాష్ట్రాలైన గోవా (1), గుజరాత్ (2), హర్యానా (1), మహారాష్ట్ర (4), రాజస్థాన్ (2), ఉత్తరాఖండ్ (1) కేసులున్నాయి. ఇక కేపీ 2 వేరియంట్‌లో 290 కేసుల్లో మహారాష్ట్ర నుంచి అత్యధికంగా 148 ఉంటే, మిగిలినవి ఢిల్లీ (1), గోవా (12), గుజరాత్ (23), హర్యానా (3), కర్నాటక (4), మధ్యప్రదేశ్ (1), ఒడిశా (17), రాజస్థాన్ (21), ఉత్తరప్రదేశ్ (8), ఉత్తరాఖండ్ (16), పశ్చిమ బెంగాల్ (36) లలో ఉన్నాయి.

మే 5 నుంచి 11 వరకు దాదాపు 25,900 కరోనా కేసులు నమోదవ్వడంతో సింగపూర్‌లో కోవిడ్ తీవ్రత అధికంగా ఉన్నట్టు కథనాలు వస్తున్నాయి. వీటిల్లో కేపీ 1, కేపీ 2 కేసులు మూడింట రెండు వంతులకు పైగా ఉన్నాయి.ప్రపంచవ్యాప్తంగా, ప్రధాన కోవిడ్ -19 వేరియంట్‌లు ఇప్పటికే జేఎన్.1 తోపాటు కేపీ 1, కేపీ 2లు సబ్‌వేరియంట్‌లు ఉన్నాయి. కోవిడ్ - 19 వేరియంట్ సమూహానికి చెందిన కేపీ 1, 2లకు వాటి మ్యూటేషన్‌లను బట్టి 'ఫ్లిర్ట్' అని శాస్త్రవేత్తలు పేరు పెట్టారు. ఈ ఫ్లిర్ట్‌లోని జాతులన్నీ జేఎన్ 1 మూలం కలిగినవే. ఇక కేపీ 2 ఓమిక్రోన్ వేరియంట్‌కు ఒక శాఖ అని, దీన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షణలో ఉన్న కొత్త వేరియంట్‌గా వర్గీకరించింది.

పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలి

- నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలి : బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే.అరుణ



నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

ఎవరికి ఓటు వేస్తే ఉపయోగమో ఆలోచించి పట్టభద్రులు ఓటు వేయాలని, ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే.అరుణ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డిది మాటల గారడీ ప్రభుత్వమని, పరిపాలనపై పట్టులేక పాలన గాడి తప్పిందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నోటిఫికేషన్ వెయ్యకుండా 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. రైతులకు రూ.500 బోనస్ అని మోసం చేశారన్నారు. పాలనను గాడిలో పెట్టడం చేతకాక రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై పోరాడే శక్తి బీజేపీ అభ్యర్థికే ఉందని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేసినా నిరుపయోగం అవుతుందన్నారు. బీజేపీ బలపరిచిన ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, బీజేపీ జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షులు కళ్యాణ్ నాయక్, మహిళా మోర్చా అధ్యక్షులు రావెల్లి కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి ఆడబిడ్డ..

- రూ.4.5 లక్షలకు విక్రయించే యత్నం
- ముఠాను పట్టుకున్న మేడిపల్లి పోలీసులు

నవతెలంగాణ-బోడుప్పల్

ఏ తల్లి కన్న బిడ్డో.. ఎవరికి బరువైందో.. అమ్మకానికి పెట్టారు. మూడు నెలల పసికందును విక్రయించే యత్నం చేయగా.. పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. ముగ్గురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలో బుధవారం జరిగింది. మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ రామకృష్ణనగర్ రిలయన్స్ మార్ట్ సమీపంలో ఒక మహిళ మూడు నెలల వయస్సున్న ఆడపిల్లను రూ.4.5 లక్షలకు విక్రయించేందుకు సిద్ధమైందన్న విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. దాంతో వారు అక్కడకు చేరుకున్నారు. పీర్జాదిగూడలో నివాసం ఉంటున్న ఐత శోభారాణి ఒక ప్రయివేటు ప్రథమ చికిత్సా కేంద్రంలో పసికందును పట్టుకుని ఉండగా.. అదుపులోకి తీసుకున్నారు. ఆమెకు సహకరించిన చింత స్వప్న, షేక్ సలీం పాషాను కూడా అరెస్టు చేశారు. పసికందును హైదరాబాద్‌లోని శిశు సంరక్షణా కేంద్రానికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.



పాప ఎక్కడి నుంచి వచ్చింది..

నిందితులను విచారించగా.. విజయవాడకు చెందిన వారి నుంచి పాపను అన్నోజిగూడకు చెందిన పద్మ, హరి తీసుకొచ్చినట్టు తెలిపారు. దాంతో అసలు నిందితుల కోసం వారు చెప్పిన అడ్రసుకు పోలీసులు వెళ్లేసరికే ఇంటికి తాళాలు వేసి పరారయ్యారు. అయితే చిన్న పిల్లలను విక్రయించే ఈ ముఠా కార్యకలాపాలు ఇంకా ఎక్కడెక్కడ ఉన్నాయో అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

తడిచిన, మొలకెత్తిన వడ్లనూ కొనాలి

మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ-చిన్నకోడూరు

ఆరుగాలం కష్టపడి పంట పండించిన పంట అకాల వర్షాలతో తడిచి వడ్లు మొలకెత్తాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. మరో పక్క ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు.. కల్లాల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఏర్పడిందని అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో వచ్చే 3 రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రభుత్వం మాత్రం రోజుల తరబడి వడ్లు కొనకపోవడం వల్ల వడ్లు తడిచే అవకాశం ఉందని అన్నారు. తడిసిన వడ్లతో సహా అన్ని వడ్లను కొంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేలా ఉందని తెలిపారు. చిన్నకోడూరు కేంద్రాల్లో రైతులు 20 రోజులుగా వేచి చూస్తున్నారన్నారు. కాలం కూడా కక్ష కట్టినట్టు అకాల వర్షాలతో ధాన్యం ఒకటికి రెండుసార్లు తడిసి మొలకెత్తడంతో ధాన్యం రైస్ మిల్లుకు వెళ్లాక తేమ శాతం ఎక్కువ ఉందని, మొలకెత్తిందని కొనడం లేదని చెప్పారు. కొన్నా తరుగు తీసేయడం వల్ల సంచికి మూడు కిలోలు కోతపెట్టే పరిస్థితి నెలకొందన్నారు. తరుగు తీయకుండా వెంటనే వడ్లు కొనాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 40 శాతం ధాన్యం ఇంకా కొనుగోలు కేంద్రాల్లోనే ఉందనీ, లారీల సంఖ్య పెంచి ధాన్యాన్ని కొనాలని ప్రభుత్వాన్ని రైతుల పక్షాన కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం సన్నవడ్లకే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని ఆరోపించారు. పెట్టుబడి ఎక్కువ దిగుబడి తక్కువైన సన్నరకాన్ని సాధారణంగా రైతులు సాగు చేయరని, సిద్దిపేట జిల్లాలో 3,38,389 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని అందులో 3.21 లక్షల ఎకరాల్లో దొడ్డు రకం, 16 వేల ఎకరాల్లో మాత్రమే సన్నరకం వేశారని తెలిపారు. రూపాయికి 95 శాతం దొడ్డువడ్లు పండించే వాళ్లకు బోనస్ ఎగ్గొట్టి, కేవలం 5శాతం సన్నవడ్లు పండించే వాళ్లకు బోనస్ ఇస్తామనడం రైతులను దగా చేయడమేనని అన్నారు. ఎకరానికి రూ.7500 రైతు భరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ పనులు మొదలుకాకముందే జూన్‌లోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆగ్రో సేవా కేంద్రాల్లో పచ్చి రొట్టె విత్తనాలు ఇవ్వడం లేదని, విత్తనాల కోసం రైతులు పాస్ పుస్తకాలు లైన్‌లో పెట్టి వేచి చూసే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పడిందని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా పచ్చి రొట్టె విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మంత్రులు కల్లాల్లో తిరిగేవాళ్లనీ, ఇప్పుడు ఒక్క మంత్రి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం లేదని, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయం తెలుసుకోవడానికి మంత్రులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని హితవు పలికారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ, చిన్నకోడూరు ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అన్ని రకాల పంటలకూ బోనస్ ఇవ్వాలి

- సీపీఐ(ఎంఎల్) లిబరేషన్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాబాద్

రైతులు పండించిన అన్ని రకాల పంటలకూ బోనస్ ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం సమంజసం కాదని తెలిపారు. మిగతా వడ్లకూ బోనస్‌ను వర్తింపచేయాలనీ, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

బిజినెస్

కేంద్రానికి ఆర్‌బీఐ బంపర్ డివిడెండ్

- 2023-24కుగాను రూ.2.1 లక్షల కోట్లు
- ఇంతక్రితం కంటే 140 శాతం అదనం
- మోడీ సేవలో తరిస్తున్న గవర్నర్ శక్తికాంతదాస్



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కేంద్ర భక్తిని చాటుకుంది. ఆర్థిక సంవత్సరం 2022-23కు గాను ఏకంగా రూ.2.1 లక్షల కోట్ల రికార్డ్ డివిడెండ్‌ను ప్రకటించింది. ఈ మేరకు గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆర్‌బీఐ కేంద్ర బోర్డు డైరెక్టర్ల సమావేశమై డివిడెండ్ నిధులను ప్రభుత్వానికి బదిలీ చేసే విషయమై ఆమోదం తెలిపారు. ఇంతక్రితం 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.87,420 కోట్ల డివిడెండ్‌ను అందించింది. దీంతో పోల్చితే రెండు రెట్ల (140 శాతం) పైగా పెంచడం విశేషం.

ఆర్థిక సంవత్సరం 2024-25 తాత్కాలిక బడ్జెట్‌లో ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో రూ.1.02 లక్షల కోట్లు సమకూరుతాయని కేంద్రం అంచనా వేసింది. మరోవైపు ఈ ఏడాది రూ.75,000-1,20,000 కోట్ల మేర ఆర్‌బీఐ డివిడెండ్ ప్రకటించవచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. ప్రభుత్వం సహా ఆర్థిక నిపుణుల అంచనాలు మించి ఆర్‌బీఐ రికార్డ్ స్థాయిలో డివిడెండ్ ప్రకటన ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఆర్‌బిఐ చెల్లించనున్న డివిడెంట్‌తో కొత్తగా అధికారం చేపట్టే ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరనుంది. పెట్టుబడులపై వచ్చే మిగులు ఆదాయం, కరెన్సీ ముద్రణ కోసం తీసుకునే చార్జీ, తమ వద్ద డాలర్ల విలువలో హెచ్చుతగ్గులపై వచ్చే ఆదాయం, బ్యాంక్‌లకు ఇచ్చే రుణాలపై వచ్చే వడ్డీ తదితర ఆదాయాల నుంచి ఆర్‌బీఐ ప్రతీ ఏడాది డివిడెండ్ రూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తుంది. ఆర్‌బీఐ ఇచ్చిన డివిడెండ్ వల్ల కేంద్రం తన ద్రవ్య లోటును పూడ్చుకోవడానికి ఉపయోగపడనుంది.

ఏడాదిలో 100 శాఖలు తెరుస్తాం

- ఆయోధ్యలో 840 శాఖ ఏర్పాటు : కేవీబీ సీఈఓ రమేష్ బాబు వెల్లడి



ఆయోధ్య : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో కొత్తగా 100 శాఖలను తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) ఎండీ, సీఈఓ ఆర్ రమేష్ బాబు తెలిపారు. బుధవారం ఆయోధ్యలో బ్యాంక్ 840వ శాఖను ఛైర్‌పర్సన్ మీనా హేమచంద్రతో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కొత్తగా 39 శాఖలను ప్రారంభించామన్నారు. 2024 మార్చి 31తో ముగిసిన ఏడాదిలో కెవిబి రూ.1,605 కోట్ల నికర లాభాలు సాధించింది. నికర నిరర్థక ఆస్తులు 0.40 శాతానికి తగ్గాయి. ఆస్తులు, లాభదాయకత అంశంలో బ్యాంక్ మెరుగైన ఫలితాలను సాధిస్తుందని రమేష్ బాబు అన్నారు. నూతన శాఖ ప్రారంభోత్సవంలో కేవీబీ సీనియర్ అధికారులు కెఎస్ రవీచంద్రన్, ఆర్ రాంకుమార్, కెజి మోహన్, మురళి రామస్వామి, ఆర్ విద్యా శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ లాభాల్లో 60% వృద్ధి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం2023-24లో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ 60 శాతం వృద్ధితో రూ.35 కోట్ల నికర లాభాలు సాధించింది. బ్యాంక్ నెలసరి సగటు లావాదేవీలు 8.04 కోట్లుగా నమోదయ్యాయి. ఖాతాదారుల డిపాజిట్లు 50 శాతం పెరిగి రూ.2,801 కోట్లకు చేరాయి. స్థూల వ్యాపార విలువ రూ.2.5 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. అయితే పేమెంట్ బ్యాంక్‌లు రుణాలు జారీ చేయడానికి ఆర్‌బిఐ అనుమతి లేదు. తమ బ్యాంక్ 5 లక్షల టచ్ పాయింట్లకు చేరాయని ఆ సంస్థ తెలిపింది.

మూడింతలయిన పేటియం నష్టాలు


న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక సంస్థ పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ నష్టాలు భారీగా పెరిగాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం(క్యూ4)లో రూ.550 కోట్ల నష్టాలు చవి చూసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.169 కోట్ల నష్టాలతో పోల్చితే 3.2 రెట్ల నష్టాలు పెరిగాయి. గడిచిన క్యూ4లో సంస్థ రెవెన్యూ 3 శాతం తగ్గి రూ.2,267 కోట్లకు పరిమితమయ్యింది. నిబంధనలు ఉల్లంఘించిన పేటియం పేమెంట్ బ్యాంక్‌పై జనవరి 31న ఆర్‌బిఐ చర్యలు తీసుకోవడంతో ఆ సంస్థ ఆదాయం భారీగా తగ్గడంతో పాటుగా నష్టాలు పెరిగాయి. 2024 మార్చి ముగింపు నాటికి రూ.8,650 కోట్ల నగదు బ్యాలెన్స్ ఉందని తెలిపింది.

ఉద్యోగులపై వేటు..!

పేటియం ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చడానికి త్వరలో ఉద్యోగుల తొలగింపు ఉంటుందని సమాచారం. ఈ విషయమై ఆ సంస్థ సిఇఒ విజయ్ శేఖర్ శర్మ వాటాదారులకు రాసిన లేఖలో పేర్కొన్నట్లు రిపోర్టులు వస్తున్నాయి. ఈ నిర్ణయంతో సంస్థకు ఏటా రూ.400-500 కోట్ల వరకు ఆదా అవుతుందని అంచనా వేశారని సమాచారం.

ఇఎంసి స్వాధీనానికి సకాలంలో చెల్లింపులు

- సలాసర్ టెక్నో వెల్లడి



హైదరాబాద్ : ఇఎంసి లిమిటెడ్ స్వాధీనానికి సకాలంలో పూర్తి చెల్లింపులు చేసినట్లు సలసార్ టెక్నో ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. తమ వ్యూహాత్మక విస్తరణ ప్రయాణంలో ఒక స్మారక మైలురాయిగా ఇది నిలుస్తుందని పేర్కొంది. తమ సామర్థ్యం మా ప్రణాళికలను ఖచ్చితత్వంతో, చురుకుదనంతో అమలు చేయడంలో మా నిబద్ధతను నొక్కి చెబుతుందని తెలిపింది. ఇటీవల ఆ సంస్థ దివాలకు వచ్చిన ఇఎంసి లిమిటెడ్‌ను ఎన్‌సిఎల్‌టి ద్వారా దక్కించుకుంది. దీని మొత్తం స్వాధీన విలువ రూ.178 కోట్లుగా ఉంది. ఇఎంసి స్వాధీనంతో ఇంజనీరింగ్, మౌలిక వసతుల రంగంలో సలాసర్ టెక్నో మరింత బలోపేతం కానుందని విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

యూకో బ్యాంక్ ఎంజి రోడ్ శాఖ మార్పు

- బిఎస్ఎన్ఎల్ బిల్డింగ్‌లో ఏర్పాటు



హైదరాబాద్ : సికింద్రాబాద్ ఎంజి రోడ్‌లోని యూకో బ్యాంక్ శాఖను అదే రోడ్‌లోని బిఎస్ఎన్ఎల్ బిల్డింగ్‌లోకి మార్చారు. ఈ కొత్త శాఖను బుధవారం యూకో బ్యాంక్ జోనల్ హెడ్ ఎస్ శ్రీకాంత్ లాంచనంగా ప్రారంభించారు. తమ కొత్త శాఖ ఖాతాదారులకు మరింత చేరువగా.. అందరికీ కనిపించేలా ఉంటుందని ఆ బ్యాంక్ తెలిపింది. ఖాతాదారులకు మెరుగైన సేవలతో పాటు సాధారణ ప్రజలకు తక్కువ వడ్డీ రేటుకే రుణాలు ఇస్తుందని ఎస్ శ్రీకాంత్ తెలిపారు. స్వాతంత్య్రానికి ముందే 1945లోనే ఎంజి రోడ్‌లో యూకో బ్యాంక్ తన శాఖను ఏర్పాటు చేయడం విశేషం.

అధికార మార్పిడి సాధ్యమేనా?

బీజేపీ అంత సులువుగా వదలకపోవచ్చు

- ఇప్పటికే ప్రతిపక్షాలపై కఠిన చర్యలు
- కేంద్ర దర్యాప్తు సంస్థలు, అరెస్టులతో మోడీ నియంతృత్వ ధోరణి
- బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది : నిపుణులు, విశ్లేషకులు

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే, కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీల కూటమి 'ఇండియా' మధ్య ప్రధాన పోటీ నెలకొన్నది. ఎన్డీయేకు 400 సీట్ల నినాదంతో మోడీ.. బీజేపీని గద్దె దించటమే లక్ష్యంగా ఇండియా కూటమి పని చేస్తున్నది. అయితే, బీజేపీ ఊహించినట్టుగా క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి అంతగా బలం లేదనీ, ఇప్పటి వరకు ముగిసిన ఐదు దశల ఎన్నికల్లో కాషాయపార్టీకి ప్రతికూల ధోరణిలో ఓటింగ్ జరిగిందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక కాంగ్రెస్ ప్రధాన భూమిక పోషిస్తున్న ఇండియా కూటమి చాపకింద నీరులా దూసుకెళ్తున్నదనీ, ఆ కూటమికి ఆశించినదానికంటే మంచి ఫలితాలు దక్కే అవకాశాలున్నాయని అంటున్నారు. అధికారానికి అలవాటు పడిన బీజేపీ.. అంత సులువుగా అధికార మార్పిడికి సహకరిస్తుందా? అనే అనుమానాలనూ రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.



న్యూఢిల్లీ : మోడీ పాలనలో ఇప్పటికే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనీ, రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు ఇప్పటికే మొదలయ్యాయనీ, మూడో సారి మోడీ అధికారంలోకి వస్తే జరిగబోయేదదేనని కాంగ్రెస్ సహా పలు పార్టీల నాయకులు ప్రధానంగా వినిపిస్తున్న ఆరోపణ. అధికారాన్ని మూడోసారి చేపట్టటానికి బీజేపీ ఎంతకైనా తెగిస్తుందనీ, ఎన్ని ప్రయత్నాలైనా చేస్తుందని రాజకీయ విమర్శకులు అంటున్నారు. ఇందులో భాగంగానే, ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, రాజకీయ నాయకుల అరెస్టులు వంటివి సార్వత్రిక ఎన్నికల ముందు చూశామని వారు గుర్తు చేస్తున్నారు. ప్రధాన జాతీయ ప్రతిపక్షం కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలు స్తంభింపజేయబడటమూ ఇందులో భాగమేనని వారు అంటున్నారు. ఇద్దరు ప్రతిపక్ష ముఖ్యమంత్రులను విచారణ లేకుండానే జైలుకు పంపిన విధానాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఇది మోడీ సర్కారు నియంతృత్వ పోకడకు ప్రత్యక్ష తార్కాణమని అంటున్నారు. 2047 వరకు అభివృద్ధి చెందిన దేశంగా తయారు చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్తున్న మోడీ సర్కారు.. అప్పటి వరకు కూడా తామే అధికారంలో ఉండాలనే ప్రయత్నాలను చేస్తున్నదా? అని రాజకీయ విమర్శకులతో పాటు కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ప్రధాని మోడీ, అతని సైద్ధాంతిక మార్గదర్శకులు అధికారాన్ని అంటిపెట్టుకోవటమే లక్ష్యంగా పెట్టుకున్నారనీ, ఇందుకోసం భావోద్వేగ ఐక్యత, బలం, సుస్థిర ప్రభుత్వం పేరుతో ఏకత్వాన్ని నొక్కి చెబుతారని విశ్లేషకులు చెప్తున్నారు. ఒక దేశం-ఒక ఎన్నికలు, ఒక దేశం-ఒక రేషన్ కార్డ్, ఒక దేశం-ఒక సర్వోన్నత మతం, అఖండ హిందూ భారత్ వంటి అమలుకు హామీ కానీ నినాదాలను ప్రజల్లో వదులుతూ బీజేపీ రాజకీయాలు చేస్తున్నదని వారు అంటున్నారు.

(వారు, యాదృచ్ఛికంగా, మోసపోలేదు. కొత్త దేశానికి అత్యంత ఉత్సాహంగా పాల్గొనేవారు మరియు చందాదారులు నిరాడంబరమైన జానపదుల కంటే మధ్య మరియు ఉన్నత తరగతుల వర్గపటం అని పండితుల రచన చూపిస్తుంది. హాస్యాస్పదంగా, ఈ సందర్భంలో ఇలాంటిదే జరుగుతోంది. మోడీ అభిమాని ఇచ్చిన హిందూ రాష్ట్రం కోసం పిలుపు.

దేశ అభివృద్ధికి అధికార మార్పిడి తప్పనిసరనీ, లేకపోతే అది నియంతృత్వానికి దారి తీసే ప్రమాదమున్నదని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మోడీ మూడోసారి విజయం సాధించే అవకాశం లేదనీ, ఒకవేళ అదే జరిగితే దేశాన్ని నియంతృత్వ దిశలో, ఫాసిస్ట్ విధానానికి దారితీసే అవకాశమున్నదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తన ఇటీవల ఎన్నికల ర్యాలీలలో ఆరోపణలు చేశారు. ప్రస్తుతానికి, సమాధానాలు ఊహాగానాలు మాత్రమేనీ, దేశ ప్రజలు మాత్రం తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలని రాజకీయ నిపుణులు, మేధావులు సూచిస్తున్నారు.

కోర్టు నియమించిన అడ్వకేట్ కమిషన్లను అడ్డుకోరాదు :హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏదైనా అంశంపై విచారణ నిమిత్తం కోర్టు అడ్వకేట్ కమిషన్లను నియమించిన నేపథ్యంలో ఆ కమిషన్లను అడ్డుకోవడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. 2012లో వరంగల్ సుబేదారి పోలీస్ స్టేషన్లో తెలంగాణ రాష్ట్ర సమితి మద్దతుదారులు రాజేంద్ర యాదవ్, నర్సింగ్ రావు, వాసుదేవ్ రెడ్డి, జె రమేష్ అనిల్, దర్శన్ సింగ్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు . వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించే అవకాశముందంటూ న్యాయవాది అబ్దుల్ నది అక్కడి కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో వరంగల్ కోర్టు నియమించిన అడ్వకేట్ కమిషన్‌ను ఆనాటి సుబేదారి సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.సురేష్ అడ్డుకోవడాన్ని హైకోర్టు తప్పు పట్టింది. ఆదేశాల మేరకు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ సుబేదారి పోలీస్ స్టేషన్ సీఐ సురేష్ దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఇ.వి. వేణుగోపాల్ ఇటీవల తీర్పు వెలువరించారు.కాకతీయ విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమానికి నాటి ముఖ్యమంత్రి హాజరవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని టీఆర్ఎస్ సానుభూతిపరులు రాళ్ల దాడి చేసేందుకు కుట్ర చేస్తున్నారంటూ పలువురిని సీఐ అదుపులోకి తీసుకున్నారు. వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించే అవకాశం ఉందని ఈ వ్యవహారంపై అడ్వకేట్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఒక న్యాయవాది అక్కడి కోర్టులో దరఖాస్తు చేశారు. దీనిపై వరంగల్ చీఫ్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఇద్దరు న్యాయవాదులతో కూడిన అడ్వకేట్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ పోలీస్ స్టేషన్ కి వెళ్ళినప్పుడు నలుగురు టీఆర్ఎస్ మద్దతుదారులు అక్కడ ఉండడాన్ని గుర్తించారు. అదే సమయంలో అడ్వకేట్ కమిషనర్లను నాటి సీఐ సురేష్ అడ్డుకున్నారు. ఈ విషయాన్ని వారు అక్కడి కోర్టుకు తెలిపారు. అడ్వకేట్ కమిషనర్ల నివేదికను సిఐకి కోర్టు అందజేసింది. ఆ తర్వాత సిఐపై కేసు నమోదుకు ఉత్తర్వులు జారీ చేసింది. తనపై కేసు నమోదు చేయడాన్నిసురేష్ హైకోర్టులో సవాల్ చేశారు. వాద ప్రతి వాదనల తర్వాత హైకోర్టు సురేష్ పిటిషన్ కొట్టేసింది. సీఆర్పీసీ సెక్షన్ 197 (1) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదుకు ముందస్తు అనుమతి కావాలన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది. కోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పుడు అలాంటి అనుమతి అవసరం ఉండదని తీర్పులో పేర్కొంది. అడ్వకేట్ కమిషనర్లు పబ్లిక్ సర్వెంట్స్ పరిధిలోకి వస్తారని పేర్కొంటూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

ఆశాజనకంగా నైరుతి రుతుపవనాల విస్తరణ

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- 24న వాయుగుండంగా మారే అవకాశం
- రాష్ట్రంలో మళ్లీ పెరుగుతున్న ఎండలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల్లో మిగిలి ప్రాంతం, ఉత్తర మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్ర తీరానికి సమీపంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగాఉన్న ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఆవరించింది. ఈ అల్ప పీడనం ఈశాన్య దిశలో కదిలి ఈ నెల 24 నాటికి మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశముంది. తెలంగాణలో నేడు, రేపు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులతో కూడిన వానలు పడొచ్చు. 23, 24 తేదీల్లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో వర్షాలు పడే అవకాశముండటంతో ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలో మంగళవారం కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు వాన పడింది. మొత్తంగా మీద రాత్రి 11 గంటల వరకు 51 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. అదే సమయంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. నిర్మల్ జిల్లా కుబీర్‌లో అత్యధికంగా 44.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. చాలా జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో వచ్చే మూడ్రోజుల్లో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల వరకు చేరే అవకాశముంది.

జన్మభూమికి తప్పిన ముప్పు

ఎం-1, డి-1 మధ్య తెగిన లింక్



విశాఖపట్నం: లింగంపల్లి జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12805)లోని ఎం-1, డి-1 కోచ్‌లలో సాంకేతిక లోపం తలెత్తడంతో రైలు బయలుదేరిన కొద్దిసేపటికే రెండుగా విడిపోయింది. విశాఖపట్నం నుంచి లింగంపల్లికి బుధవారం ఉదయం 6.20 గంటలకు బయలుదేరిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కొద్దిసేపటికే సాంకేతిక సమస్య కారణంగా ఎసి బోగీ ఎం-1, సెకండ్ సిట్టింగ్ బోగీ డి-1 కోచ్‌ల మధ్య లింక్ తెగిపోయింది. ఆ సమయంలో రైలు నెమ్మదిగా వెళ్తుండడంతో పెను ప్రమాదం తప్పింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే రైలును స్టేషన్‌కు తీసుకొచ్చి మరమ్మత్తులు చేపట్టారు. మరమత్తుల అనంతరం 9.37 గంటలకు విశాఖపట్నం నుంచి రైలు బయలుదేరింది.విద్యుత్ కనెక్షన్ కప్లర్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఈ సంఘటన జరిగిందని, రెండు కోచ్‌లను మార్చి పంపించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మూడు గంటల 17 నిమిషాలు ఆలస్యంగా నడుస్తోంది.

జూన్ 19న డాక్ అదాలత్

- 7వ తేదీలోపు ఫిర్యాదుల స్వీకరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పోస్టల్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 19వ తేదీ డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం, పోస్టల్ సర్వీసెస్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ రంగారావు తెలిపారు. ఆన్‌లైన్‌లో జరిగే ఈ అదాలత్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. జూన్ 7వ తేదీలోపు తమ లేఖల్ని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయానికి పంపాలనీ, వాటిపై తప్పనిసరిగా 'డాక్ అదాలత్' అని స్పష్టంగా రాయాలని పేర్కొన్నారు. పోస్టల్ ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్ మేటర్స్, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్ని ఈ అదాలత్‌లో స్వీకరించబోమని స్పష్టంచేశారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇలాంటి అదాలత్‌లు ఉపయోగపడతాయనీ, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. డాక్ అదాలత్‌కు రాసే లేఖల్లో ప్రజలు తప్పనిసరిగా తమ ఫోన్ నెంబరు, ఈమెయిల్ ఐడీ రాయాలనీ, వర్చువల్‌గా జరిగే అదాలత్ లింకుల్ని పంపేందుకు ఇవి అత్యవసరమని తెలిపారు. ఈ లింక్‌ల ద్వారా ఫిర్యాదుదారులు నేరుగా అదాలత్‌లో పాల్గొనవచ్చన్నారు. పోస్టల్ వినియోగదారులు తమ లేఖల్ని ఎస్ రంగారావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ (పీజీ), ఆఫీస్ ఆఫ్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ తెలంగాణ సర్కిల్, హైదరాబాద్-500001 చిరునామాకు పంపాలని కోరారు.

సోరెన్‌కు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ : మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసులో ఇడి తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం నిమిత్తం తనకు బెయిల్ మంజూరుచేయాలని సోరెన్ ఇటీవల సుప్రీంను ఆశ్రయించారు. ఈసందర్భంగా కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. సోరెన్ పిటీషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన వెకేషన్ బెంచ్.. సోరెన్ పిటిషన్‌పై అసహనం వ్యక్తంచేసింది. ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయలేదన్న విషయాన్ని తమకు తెలపలేదని, కేసులో వాస్తవాలను దాచడానికి ప్రయత్నించారని ఆగ్రహించింది. ఈ పిటిషన్‌ను కొట్టివేస్తామని హెచ్చరించింది. దీంతో సోరెన్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.అలాగే, కేజ్రీవాల్ కేసుకు, సోరెన్ కేసుకు తీవ్ర వ్యత్యాసం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేజ్రీవాల్ ట్రయల్ కోర్టు నుంచి రెగ్యులర్ బెయిల్‌ను కోరలేదని, కేసులో అతనిపై ఎటువంటి న్యాయపరమైన ఆదేశాలు రాలేదని వెకేషన్ బెంచ్ ఎత్తి చూపింది.

బంగ్లాదేశ్ ఎంపి హత్య

కొల్‌కతాలో ముగ్గురు అరెస్టు



ఢాకా : భారత్‌లో ఆచూకీ తెలియకుండా పోయిన బంగ్లాదేశ్ అవామీలీగ్ పార్టీ ఎంపి అన్వరుల్ అజీమ్ అనర్ కోల్‌కతాలో ఒక ఫ్లాట్‌లో హత్యకు గురైనట్లు హోం మంత్రి అసదుజ్‌మాన్ ఖాన్ బుధవారం ప్రకటించారు. ఇందుకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశామని తెలిపారు. ఖాన్ మీడియాతో మాట్లాడుతూ.. హంతకులందరూ బంగ్లాదేశీయులేనని తెలుస్తోందన్నారు. ఇది ఒక పథకం ప్రకారం జరిగిన హత్య అని పేర్కొన్నారు. కోల్‌కతాలోని తన ఫ్లాట్‌లో రక్తపుమరకలు కనిపించాయని, బహుశా అయనను అక్కడ చంపి, బాడీని ఎక్కడో విసిరేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఎంపి మృతదేహం కోసం గాలింపు ముమ్మరంగా సాగుతోందని మంత్రి తెలిపారు. అన్వరుల్ ఈ నెల 12న చికిత్స కోసం భారత్‌కు వచ్చారు. 18న ఉత్తర కోల్‌కతాలో బారానగర్ పోలీసు స్టేషన్‌లో ఆయన అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. అన్వరుల్ హత్యపై ప్రధాని షేక్ హసీనా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

దశల వారీగా వడ్లకు బోనస్ అంటే ఏమిటి?

బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దశల వారీగా అన్ని రకాల వడ్లకు బోనస్ కల్పిస్తామంటూ ప్రభుత్వం చెప్పడంలో ఆంతర్యమేంటని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతు భరోసా కింద ఎకరాకు రూ.7,500 ఇవ్వాలని కోరారు. ప్రతి హామీపై రేవంత్ ప్రభుత్వ వైఖరి డొంక తిరుగుడులాగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ మంత్రి ఉన్నారా ? కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ కింద తులం బంగారం ఎప్పుడిస్తారు ? విద్యార్థినులకు స్కూటీలు ఎప్పుడిస్తారు? మహాలక్ష్మి కింద ప్రతి మహిళకు రూ.2,500 నెలకు ఇస్తారు? అంటూ ప్రశ్నలు సంధించారు. వంద రోజుల్లో గ్యారంటీలకు చట్ట బద్ధత ఇస్తామంటూ ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే చెప్పిన మాటలు అమలు కాలేదని గుర్తుచేశారు. ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నా... దాని అమలు కూడా అనుమానాస్పదంగా ఉందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు మాఫీ చేయడం అసాధ్యమని రావుల ఈ సందర్భంగా చెప్పారు. మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుపై సీఎం కార్యాచరణ ఏమిటో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అభయ హస్తం అక్కరకు రాని నేస్తంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతిపై కూడా కాంగ్రెస్ నేతలు మాట మార్చారని విమర్శించారు.

బీసీలకిచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీలకిచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్ రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను ఆ పార్టీ విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయినా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు 55 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ కులగణన, బీసీలకు ఐదేండ్లలో రూ.ఒక లక్ష కోట్ల కేటాయింపు, సివిల్ కాంట్రాక్టుల్లో 42 శాతం రిజర్వేషన్లు, వైన్స్‌లో గౌడ కులస్తులకు 23 శాతం రిజర్వేషన్లు, మండలానికో బీసీ గురుకులం అనేవి కేవలం హామీలుగానే మిగిలిపోయాయని తెలిపారు. బీసీ డిక్లరేషన్ అమలుకు చర్యలు తీసుకోకపోతే వారి ఆగ్రహానికి గురి కాక తప్పదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రేపటినుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ మూడో తేదీ వరకు అవి జరుగుతాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకూ ఇదే షెడ్యూల్ వర్తిస్తుంది. విద్యార్థులకు ఇప్పటికే హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే tsbie.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లను ప్రిన్సిపాళ్ల సంతకం లేకపోయినా పరీక్షలకు అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఇంటర్ బోర్డు అధికారులు ఆదేశించారు.

నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోం

- చనగాని దయాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి ఆర్‌ఆర్ ట్యాక్స్, యు ట్యాక్స్ అంటూ తమ పార్టీ నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహేశ్వర్ రెడ్డికి పిచ్చిపట్టిందని విమర్శించారు. పట్టభద్రులకు ద్రోహం చేసిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు వారి ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని తెలిపారు. అగ్నిపథ్ పేరుతో బీజేపీ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లు రాష్ట్రంలో అధికారాన్ని చెలాయించిన బీఆర్ఎస్ నిరుద్యోగులను జైల్లో పెట్టించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు నిరుద్యోగులకు అవసరమని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాకే ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని చెప్పారు.

నేడు బుద్ధ జయంతి

- నాగార్జున సాగర్, హుస్సేన్ సాగర్‌లో వేడుకలకు ప్రభుత్వ ఏర్పాట్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గౌతమ బుద్ధుడి జయంతి సందర్భంగా గురువారం నాగర్జున సాగర్‌లోని బుద్ధవనం, హుస్సేన్ సాగర్‌లోని బుద్ధుడి విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ వేడుకల్లో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ వేడుకల్లో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు ఆయన నాగర్జున సాగర్‌లోని బుద్ధవనంలో బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు హుస్సేన్ సాగర్‌లోని బుద్ధుని విగ్రహం వద్ద నిర్వహించే బుద్ధ జయంతి వేడుకల్లోనూ మంత్రి పాల్గొంటారు.